www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 225 | సోమవారం | 4 ఫిబ్రవరి, 2019 | పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

దివ్యాద్రి



1100 ఎకరాల్లో యాదాద్రి టెంపుల్ సిటీ

గుడి నిర్మాణాన్ని స్వయంగా పరిశీలించిన సిఎం కెసిఆర్ ప్రకటన

133 దేశాల వైష్ణవ సాధువులతో ఉద్ఘాటన కార్యక్రమం

మన సంస్కృతిని, సంస్కారాన్ని తరాలకు అందజేసే పరివర్తనా కేంద్రాలే హిందూ ఆలయాలు అని, ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా ప్రతిష్ఠాపన జరుగనున్న యాదగిరిగుట్ట (యాదాద్రి)ప్రపంచంలోనే గర్వించదగిన దివ్యక్షేత్రంగా రూపొందుతుందని ముఖ్యమంత్రి కెసిఆర్ వెల్లడించారు

- సంస్కృతి, సంస్కారాల క్షేత్రం
- యాభై ఎకరాల్లో ప్రవచన మండపం
- ప్రారంభ తేదీలు త్వరలో
- కలకాలం నిలిచేలా కృష్ణ శిలలతో ఆలయం
- 1008 కుండాత్మక అభిషేకంతో ఉద్ఘాటన
- ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్
- ఆగమశాస్త్ర అనుగుణంగా ఆలయం
- ఉన్నత ప్రమాణాలతో కాటేజీలు
- భూ సేకరణకు నిధులు విడుదల





మన తెలంగాణ / యాదగిరిగుట్ట, హైదరాబాద్ : మన సంస్కృతిని, సంస్కారాన్ని తరాలకు అందజేసే పరివర్తనా కేంద్రాలే హిందు ఆలయాలు అని, ప్రస్తుతం ఆగమశాస్త్ర నిబంధనలకు అనుగుణంగా ప్రతిష్ఠాపన జరుగుతున్న యాదగిరిగుట్ట (యాదాద్రి) ఆలయం ప్రపంచంలోనే గర్వించదగిన దివ్యక్షేత్రంగా రూపొందుతుందని ముఖ్యమంత్రి కెసిఆర్ తెలిపారు. సుమారు 1100 ఎకరాల్లో టెంపుల్ సిటీ రూపుదిద్దుకుంటోందని, ప్రపంచంలోని 133 దేశాల నుంచి వైష్ణవ తత్వాన్ని ఆచరిస్తున్న స్వామీజీలు ఉద్ఘాటన కార్యక్రమానికి రానున్నట్లు ఇప్పటికే లేఖలు రాశారని, నిర్మాణపు పనులన్నీ పూర్తయిన తర్వాత ప్రారంభోత్సవ తేదీలను ఖరారు చేస్తామని తెలిపారు. ఆలయంలో జరుగుతున్న వివిధ రకాల పనులను ఆదివారం స్వయంగా దగ్గరుండి పరిశీలించి అధికారులు, స్థపతి తదితరులతో సమీక్షించిన తర్వాత ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో పలు అంశాలను వివరించారు. ఆలయ నిర్మాణాన్ని ఆషామాషీగా తీసుకోవడంలేదని, మొత్తం కృష్ణ శిలను వినియోగించి శిల్పాలతోనే ఆలయ గోపులను ఏడు అంతస్తులతో నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రారంభోత్సవ తేదీలను స్వయంగా తానే ప్రకటిస్తానని, ఇప్పటికిప్పుడు అంచనాగా చెప్పలేమన్నారు. మొత్తం 1100 ఎకరాల్లో ఆవిర్భవించనున్న యాదాద్రి దివ్యక్షేత్రానికి ఇప్పటికే

తరువాయి 3లో



వాహనం ఢీకొని జింక మృతి

17

కలకత్తా కాళిక



- చిట్‌ఫండ్ కుంభకోణాల్లో కలకత్తా పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను ప్రశ్నించడానికి వెళ్లిన 40 మంది సిబిఐ అధికారులు
- సమాచారం ఇవ్వకుండా వచ్చారన్న కలకత్తా పోలీసులు
- హుటాహుటిన అక్కడికి చేరుకున్న సిఎం మమత
- రాజీవ్ ఇంటి వద్ద ఆమె ధర్నా

కోల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లో ఆదివారం ఉన్నట్లుండి హై డ్రామా నెలకొంది. సిబిఐకి, మహానగరం కోల్‌కతా పోలీసులకు మధ్య ప్రత్యక్షంగా, కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య పరోక్షంగా వివాదం రగులుకుంది. సిబిఐకి, పోలీసులకు మధ్య తోపులాటలు జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీ నుంచి వచ్చిన సిబిఐ అత్యున్నత స్థాయి బృందాన్ని కోల్‌కతా నగర పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్ నివాసం వద్ద అక్కడి పోలీసు దళాలు అడ్డగించాయి. సిబిఐ బృందంలో దాదాపు 40 మంది అధికారులు ఉన్నారు. వీరిని లోపలికి వెళ్లకుండా నగర

తరువాయి 6లో

ఐదుగురు సిబిఐ అధికారులను అరెస్టు చేసి విడుదల చేసిన కోల్‌కతా పోలీసులు

కేంద్రంతో ఢీ అన్న పశ్చిమబెంగాల్ సిఎం మమత

> దేశంలోని అన్ని వ్యవస్థలపై కేంద్రం దాడికి దిగుతోంది. బిజెపి వారు పోలీసులను తమ అదుపులోకి తెచ్చుకునేందుకు, ప్రత్యర్థులను బెదిరించేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారు
>
> — మమతా బెనర్జీ



జయరాం హత్య వెనుక మరో స్త్రీ?

టివి యాంకర్ హస్తం ఉందని అనుమానం

మామయ్య జయరాంతో శారీరక సంబంధం ఉన్నట్టు శిఖా చౌదరి వెల్లడి



మన తెలంగాణ/హైదరాబాద్: చిగురుపాటి జయరాం హత్య కేసులో కొత్త కోణాలు వెలుగు చూస్తున్నాయి. చిగురుపాటి హత్య కేసులో చీకటి ఒప్పందాలున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు సమాచారం. నేరం చేసింది ఒకరైతే ఆ నేరాన్ని మరొకరు ఒప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. చిగురుపాటి చంపేందుకు శిఖాచౌదరి ఓ అజ్ఞాత యువతి నియమించినట్లు సమాచారం. చిగురుపాటి చివరి ప్రయాణంలో వైట్ డ్రస్‌లో ఉన్న ఆ యువతి పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. చిగురుపాటి హత్యకు నెల రోజుల నుంచి కుట్ర జరిగినట్లు పోలీసుల విచారణలో వెలుగుచూసింది. ఈ నేపథ్యంలో జయరాంను హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లోనే హత్య చేసేందుకు కుట్ర జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నెల రోజులుగా ఒక యువతితో జయరాం సన్నిహితంగా వుంటున్నట్లు ఆయన ఇంటి చుట్టుపక్కల వారు సైతం వివరిస్తున్నారు. సదరు యువతిని జయరాం మేనకోడలు శిఖా చౌదరి నియమించినట్లు ఆమె పోలీసుల విచారణలోనూ వెల్లడించింది. అయితే ఆ అజ్ఞాత యువతిని శిఖాచౌదరి ఏర్పాటు చేసినట్లు చిగురుపాటికి సైతం తెలియదని పోలీసులు వివరిస్తున్నారు. చిగురుపాటిని కోదాడ శివారుల్లో అంతమొందించి నందిగామ శివారులో రోడ్డు ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించడంలో శిఖా, రాకేష్, అజ్ఞాత

తరువాయి 6లో

మల్లేశం చిత్ర బృందానికి కెటిఆర్ ప్రశంస



మనతెలంగాణ/హైదరాబాద్: బట్టలు నేయడంలో తల్లి పడేబాధలకు చలిం చి 'ఆసు' యంత్రాన్ని రూపొందించన చింతకింది మల్లేశం జీవన చిత్రంగా రూపొందిస్తున్న మల్లేశం ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ ఆఫ్ యాన్ ఆర్డనరరీ మాన్ చిత్రం ఫస్ట్ లుక్‌ను ట్విట్టర్‌లో షేర్ చేసిన బృందానికి టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆల్‌ది బెస్ట్ చెప్పారు. చేనేతకార్మికులు సుమారు 18 వేల పర్యాయాలు దారాన్ని చుడితే కానీ చీర తయారు కాదు. ఈ పనిలో తల్లి పడే బాధలకు చలించి 10వ తరగతి ప్రైవేటుగాచదివిన చింతకింది మల్లేశం 7సంవత్సరాల నిరంతర శ్రమతో రూపొందించిన ఆసు యంత్రానికి పద్మశ్రీ అవార్డు లభించింది. ఈ యంత్రంతో చేనేత కార్మికుల శారీరక శ్రమ తగ్గుతుంది. ఈనేపథ్యంలో నిర్మిస్తున్న మల్లేశం చిత్రం ఫస్ట్‌లుక్‌ను కెటిఆర్‌కు చిత్ర బృందం పోస్టు చేసింది. భవనగిరిజిల్లా ఆలేరుకు చెందిన మల్లేశం పాత్రలో టాలీహుడ్ నటుడు ప్రియదర్శి నటిస్తున్నారు. ఈ సినిమాటైటిల్‌ను కూడా ఇటీవల కెటిఆర్ ఆవిష్కరించారు. చేనేత కార్మికులపై ప్రత్యేక అభిమానం చూపించే కెటిఆర్ మల్లేశం చిత్రం ఫస్ట్‌లుక్ చూసి తక్షణం పోస్టు చేశారు. మల్లేశం తెలంగాణ చేనేత కార్మికులు పడే బాధలకు పరిష్కారం చూపించారని ఇప్పటికే అమెరికాలాంటి దేశాలు ప్రశంసించడంతో పాటు ఆయనను ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాయి.

తల్లి ఆరోగ్యంపై స్పీకర్ వాకబు

మన తెలంగాణ/బాన్సువాడ : రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తన తల్లి పాపమ్మ(107) ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఆదివారం ఉదయం బాన్సువాడకు చేరుకున్న ఆయన బాన్సువాడ ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లి ఆరోగ్య పరిస్థితులను డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలియజేయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా పాపమ్మ ఆరోగ్యం సరిగ్గా లేక పోవడంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేర్పించి చికిత్స నందిస్తున్నారు. స్పీకర్ వెంట కుటుంబ సభ్యులు ఉన్నారు. అనంతరం స్పీకర్ హైదరాబాద్‌కు తిరిగి వెళ్లిపోయారు.

పిహెచ్‌సిలో స్పెషలిస్టులు

30 చోట్ల పైలట్ ప్రాజెక్టు

మన తెలంగాణ/ హైదరాబాద్ : పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలకు నాణ్యమైన్య వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 42 పట్టణాల్లో ఉన్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో స్పెషలిస్టు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో మొత్తం 250 యుపిహెచ్‌సిలు ఉండగా ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లోని ఎనిమిది కేంద్రాల్లో అమలవుతుండగా ఈ నెలలో మరో 22 కేంద్రాల్లో అమలులోకి తేనుంది. యుపిహెచ్‌సిల్లో మొత్తం 15 రకాల వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రయోగాత్మకంగా హైదరాబాద్‌లో 30 చోట్ల ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిన తర్వాత కూలంకషంగా అధ్యయనం చేసి ఆ తర్వాత మిగిలిన పట్టణాలకు విస్తరించడంపై నిర్ణయం తీసుకుంటారు. ఈ సేవలన్నింటినీ పూర్తిగా ఉచితంగా నిర్వహించనున్నట్లు అధికారు లు తెలిపారు. పట్టణ పేదలకు వైద్య సేవలను మ రింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రతీ ఐదు వేల జనాభాకు ఒక బస్తీ దవాఖానను గతంలో ఏర్పాటుచేసింది. అవి యధాతథంగా కొనసాగుతూనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో స్పెషలిస్టు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకు రావాలని అధికారులు నిర్ణయించారు. పట్టణ ప్రాంతా ల్లో ప్రతీ 50 వేల జనాభాకు ఒకటి చొప్పున ఉన్న యుపిహెచ్‌సి కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు సాధారణ వైద్య సేవలు అందుబాటులో ఉంటున్నాయి. అయితే యుపిహెచ్‌సిలకు వచ్చే పేదలకు ప్రత్యేక వైద్య సేవలను కూడా అందించాలనే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ ఈ కొత్త ఆలోచన చేసింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి స్పెషలిష్టు వైద్య సేవల ను అందుబాటులోకి తీసుకు రావాలని ప్రాథమికం గా సమయాన్ని నిర్ణయించింది. జిహెచ్ఎంసి పరిధిలోని ఎనిమిది యుపిహెచ్‌సిల్లో గత నెల 21 నుంచి ప్రయోగాత్మకంగా స్పెషలిష్టు వైద్య సేవలను అందుబాటులోకి వచ్చాయి. నగరంలోని అజంపుర, గగన్ మహల్, హరాజ్‌పెంట, కామాటిపుర, కుమ్మరవాడి, పంజేష, పురానాపూల్‌లలో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించారు. వీటిలో నాలుగు రకాల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఎనిమిది యుపిహెచ్‌సిల్లో పిల్లల వైద్యుడు (పెడియాట్రిషియన్), మహిళల కోసం గైనకాలజిస్టు, జనరల్ ఫిజీషియన్, మానసిక వైద్య సమస్యల కోసం సైకియాట్రిస్ట్‌లను అందుబాటులో ఉంచింది వైద్యారోగ్య శా ఖ. ప్రతీ సోమవారం నుంచి గురువారం వరకు నా లుగు రోజుల పాటు రోజూ నాలుగు గంటల పాటు రోగులను పరీక్షిస్తారు. ఒక్కో డాక్టరు ఒక్కో యుపిహెచ్‌సిలో రోగులకు అందుబాటులో ఉంటారు.

డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుసంధానం

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఏర్పాటు చేసిన స్పెషలిస్టు వైద్య సేవలను తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుసంధానం చేయనున్నారు. రోగులను పరీక్షించిన అనంతరం వారికి అవసర మైన రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్లకు వెళితే మళ్ళీ రోగులకు ఆర్థిక భారమవుతుందనే ఉద్దేశంతో ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుసంధానం చేయడం ద్వారా ఒక్కరోజులోనే రోగ నిర్ధారణ పరీక్షా ఫలితాలు ఆన్‌లైన్‌లోనే అందుతాయని, రోగులకు వీలైనంత తొందరగా చికిత్స అందించటం సాధ్యమవుతుందని అధికారుల ఆలోచన.



అద్భుత స్పందన....

వైద్య ఆరోగ్య శాఖ ప్రయోగాత్మకంగా చేపట్టిన స్పెషలిష్టు వైద్య సేవలకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. గత నెల 21న ఈ వైద్య సేవలను ప్రారంభించగా తొమ్మిది రోజుల్లో 1367 మంది వినియోగించుకొన్నారు. సరాసరిన రోజుకు 152 మంది చొప్పున రోగులను వైద్యులు పరీక్షించారు. గత నెల 30వ తేదీన అత్యధికంగా 191 మంది రోగులు యుపిహెచ్‌సిలకు హాజరయ్యారు. ఒక్కో యుపిహెచ్‌సికి 25 నుంచి 30 మంది ఈ సేవలను ఉపయోగించుకొంటారని అధికారులు అంచనావేసినప్పటికీ ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి ఆశ్చర్యపోయారు. దీనితో నగరంలోని 30 యుపిహెచ్‌సిలకు స్పెషలిస్టు సేవలను విస్తరింపచేయాలని నిర్ణయించారు. ఈ నెలలోనే వీటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మార్చి నెలలో 42 పట్టణాల్లోని యుపిహెచ్‌సిల్లో 15 రకాల స్పెషలిస్టు డాక్టర్లను నియమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

అక్రమ లేఔట్ల కూల్చివేత

తుర్కయాంజాల్‌లో చర్యలకు శ్రీకారం • నేడు పసుమాములలో చర్యలు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీ బ్యూరో : అనుమతిలేని లేఅవుట్లు, నిర్మాణాలపై హెచ్ఎండిఎ చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే తుర్కయాంజాల్ పురపాలక సంఘం పరిధిలోని రెండు లేఅవుట్లలో కూల్చివేతలను చేపట్టింది. రోడ్లు, డ్రైనేజీలు, ఇతర నిర్మాణాలను పూర్తిగా నేలమట్టం చేసింది. నేడు(సోమవారం) నగర శివారులోని హయత్‌నగర్ మండల పరిధిలోని పసుమాముల గ్రామ ప్రాంతంలో అక్రమంగా వెలిసిన 3 లేఅవుట్లు, నిర్మాణాలపై చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు పూర్తిచేసుకున్నది. ఈ పాటికే అథారిటీ పరిధిలో అనుమతులు లేకుండా వెలిసిన లేఅవుట్లు, నిర్మాణాలు గుర్తించిన ప్లానింగ్ అధికారులు ఇప్పుడు వాటిపై చర్యలతో విరుచుకు పడుతున్నారు. గత 15 రోజుల క్రితమే సుమారు 540 నిర్మాణాలు 260 లేఅవుట్ల వరకు అక్రమంగా వెలిసినట్టు గుర్తించిన సంస్థ ప్రత్యేకంగా నివేదికను తయారు చేసి ఆయా జిల్లాల కలెక్టర్లకు, డిపిఓ, ఉన్నతస్థాయి అధికారులకు పంపించడం జరిగింది. ఈ జాబితా ఆధారంగా స్థానిక సంస్థలు వాటిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. కానీ, ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడంతో అథారిటీయే స్వయంగా కూల్చివేతలకు ఉపక్రమించింది. స్థానిక పోలీసు యంత్రాంగం, అథారిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సహాకారంతో ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



అధికారాలు బదిలీ

వాస్తవానికి అనుమతులు లేకుండా వెలిసే వాటిపై స్థానిక సంస్థ(గ్రామపంచాయితీ, పురపాలక సంఘం)లు చర్యలు తీసుకోవాల్సి ఉన్నది. అందుకు అనుగుణంగా అథారిటీకున్న అధికారాలను 2009లోనే శివారు గ్రామాలకు బదిలీ చేసింది. సంస్థ విస్తరిత ప్రాంతాన్ని ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి చేసేందుకు, శివారు గ్రామాలను ఆర్థికంగా మరింత పరిపుష్టి చేసేందుకు ఈ అధికారాలు దోహదం చేస్తాయని అధికారాలను స్థానిక సంస్థలకు బదిలీచేసింది. అథారిటీ పరిధిలో 1032 గ్రామాలు, 70 మండల కేంద్రాలు, 12 పురపాలక సంఘాలున్నాయి. అయితే, అనుమతులులేని లేఅవుట్లపై చర్యలు తీసుకోవడం లేదా నివారించడం చేయాల్సిన బాధ్యతలను అవి విస్మరిస్తున్నందున అథారిటీయే స్వయంగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఇదిలా ఉండగా గత ఏడాదిలో అక్రమలేఅవుట్లపై ఫిర్యాదులు చేసేందుకు సంస్థ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీంతో శివారు గ్రామాల వారు నేరుగా ఆన్‌లైన్‌లోనే తమతమ గ్రామాల పరిధిలో వెలుస్తున్న అక్రమలేఅవుట్లు, నిర్మాణాలపై ఫిర్యాదులు చేయడం మొదలుపెట్టారు. అవి సుమారుగా వెయ్యి వరకు వచ్చాయి. తమకు అందిన ఫిర్యాదుల మేరకు వాటి యజమానులకు అథారిటీ నోటీసులు జారీచేయడం జరిగింది.

ఇంజనీరింగ్‌కు ఎన్‌బిఎ ఉండాల్సిందే

మనతెలంగాణ/హైదరాబాద్ : ఇంజనీరింగ్‌లో నాణ్యత పెంచడంతో అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఎఐసిటిఇ) దృష్టి సారించింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిబంధనలలో మార్పులు చేస్తూ వస్తోంది. ఇంజనీరింగ్ కళాశాలలు వచ్చే నాలుగేళ్లలో 60 శాతం కోర్సులకు తప్పనిసరిగా నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడియేషన్(ఎన్‌బిఎ) గుర్తింపు పొందాలనే నిబంధనను ఎఐసిటిఇ తీసుకువచ్చింది. వచ్చే విద్యాసంవత్సరం అనుమతుల ప్రక్రియలో వచ్చిన మార్పులపై ఎఐసిటిఇ హ్యాండ్‌బుక్‌ను విడుదల చేసింది. నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిబంధనలను తీసుకొచ్చినట్లు వెల్లడించింది. నాలుగేళ్లలో 60 శాతం కోర్సులకు ఎన్‌బిఎ గుర్తింపు లేకపోతే ఆ తర్వాత అనుమతుల పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది. తాత్కాలిక భనాలలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాలలు రెండేళ్లలో శాశ్వత క్యాంపస్‌లోకి మారకపోతే 50 శాతం సీట్లలో కోత పడుతుందని పేర్కొంది. ఆ తర్వాత నాలుగేళ్ల ఇదే పరిస్థితి కొనసాగితే అనుమతులు నిలిపివేస్తామని తెలిపింది. ఇ-సెట్ ద్వారా ఇంజనీరింగ్ రెండవ ఏడాదిలో నేరుగా ప్రవేశాల తీసుకుంటున్న సీట్లలో కోత విధించింది. గతంలో 20 శాతం సీట్లు ఉండగా, వీటిని 10 శాతానికి కుదించింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో విధులు నిర్వహిస్తున్న అధ్యాపకులు ఏదైనా విద్యాసంస్థలలో ఫుల్‌టైం కోర్సులు చదువుతున్నట్లయితే ఆ అధ్యాపకులను పరిగణలోకి తీసుకోమని స్పష్టం చేసింది.

మల్లు రవి ఇంట్లో కాంగ్రెస్ నేతల భేటీ

మన తెలంగాణ/హైదరాబాద్: టిపిసిసి ఉపాధ్యక్షుడు మల్లురవి స్వగృహంలో కాంగ్రెస్ ముఖ్యనాయకుల గెట్ టు గెదర్ కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. సిఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఎన్నికైన నేపథ్యంలో మల్లురవి ఈ విందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై వారు చర్చించినట్లుగా సమాచారం.

చెలరేగిన రేషన్ దందా

• 220 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత
• లారీ, మరో నాలుగు వాహనాలు స్వాధీనం

మన తెలంగాణ / ఖమ్మం: ఖమ్మం జిలా రఘునాథపాలెం మండలం కోయచెలక గ్రామ శివారులో పెద్ద మొత్తంలో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని వ్యాపారులు దారి మళ్లిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసు చాకచక్యంగా వ్యవహరించి వాటిని స్వాధీన పర్చుకున్నారు. 440 బస్తాల్లో నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని ఒక లారీ, రెండు బొల్లెరో మాక్స్, అశోక్ లేల్యాండ్ దోస్ వాహనాల్లో మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధం చేయగా అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఖమ్మం నగరం పాండురంగాపురంకు చెందిన భవనగిరి బాలకృష్ణ, ఖమ్మంకు చెందిన రేపాక ప్రసాద్, దుర్గాప్రసాద్, సురేష్, శ్రీనివాస్‌లు ఒక బృందంగా ఏర్పడి పిడిఎస్ వ్యాపారాన్ని సాగిస్తున్నారని వివరించారు. ఖమ్మం నగరంతో పాటు ఇతర చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల నుంచి సేకరించి ఆటోల ద్వారా పలు ప్రాంతాలకు తీసుకొచ్చి నిల్వ చేస్తున్నట్లు వారు చెప్పారు. ఆదివారం తెల్లవారు జామున కోయచెలకలో నిల్వ చేసిన పిడిఎస్ బియ్యాన్ని జగ్గయ్యపేట ప్రాంతానికి చెందిన లారీ, ఒక బొల్లెరో మ్యాక్స్, మరో అశోకా లేల్యాండ్ వాహనాల్లోకి లోడ్ చేసి తరలించే ప్రక్రియలో టాస్క్‌ఫోర్స్ ఎసిపి రెహ్మాన్ నేతృత్వంలోని బృందం దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. దాడి సమయంలో బియ్యం వ్యాపారులైన బాలకృష్ణ, దుర్గాప్రసాద్, ప్రసాద్‌లు పారిపోయినట్లు వివరించారు. పట్టుబడిన బియ్యం 220 క్వింటాళ్లు ఉన్నట్లు గుర్తించి స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వారు నగరంలో అనేక మార్లు బియ్యం తరలిస్తూ పట్టుబడిన వారే. వీరు లబ్ధిదారులతో పాటు ఆయా గ్రామాల డీలర్ల నుంచి బియ్యాన్ని సేకరించినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. దాడి సమయంలో గుర్తించిన వాహనాలను సీజ్ చేసి రఘునాథపాలెం పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. లారీ డ్రైవర్ దేవరపల్లి లక్ష్మయ్యతోపాటు వ్యాపారులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





వెయ్యి మందితో వెదురు సాగు!

• ప్రణాళికలు సిద్ధం చేసిన ఉద్యానశాఖ
• ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసిన సంచాలకులు ఎల్. వెంకట్రామ్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో వెయ్యి మంది రైతులతో వెదురు సాగు చేయించే ప్రక్రియను ఉద్యానశాఖ వేగవంతం చేసింది. ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసింది. ఇటీవల నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రణాళిక నివేదికలు కూడా పంపింది. రైతులు వెదురు పంటను టిష్యూకల్చర్ పద్ధతిలో సాగుచేసేందుకు వీలుగా బ్యాంబూసా బాల్కోనా రకం ప్లాంట్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మేరకు ఐదు లక్షల ప్లాంట్లు సరఫరా చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని రాష్ట్రం కోరింది. ప్రభుత్వం వెదురు మొక్కలను రైతులకు ఉచితంగా అందజేస్తుంది. మొదటి నాలుగేండ్లు ఎకరానికి రూ. 4 లక్షలు, ఆ తర్వాత ఏడాదికి రూ.25 వేలు పెట్టుబడి కానుంది. మూడోఏట నుంచే పంట చేతికొస్తుందని, ఎకరానికి రూ.1.32 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దాదాపు 50 సంవత్సరాల పాటు పంట వస్తుందని, వెదరు సాగుకు ఉచిత డ్రిప్‌ను అందించనున్నట్లు ఉద్యాన శాఖ సంచాలకులు ఎల్. వెంకట్రామ్ రెడ్డి "మన తెలంగాణ"కుతెలిపారు. ఇటీవల ఆయన మహారాష్ట్రలోని పుణేకు వెళ్లారు. అక్కడ వెదురు సాగుపై అధ్యయనం చేసి వచ్చారు. కేంద్రంకు పంపిన యాక్షన్ ప్లాన్ నిధులకు సంబంధించి ఆమోదం లభించిన వెంటనే రైతుల చేత సాగు చేయించనున్నారు. పంటల సాగుకు తగినంత సారం లేని భూములు, అటవీయేతర ప్రభుత్వ భూములు వెదురు తోటల సాగుకు అనుకూలం. దేశవ్యాప్తంగా రెండేళ్లలో 1,05,000 హెక్టార్లలో వెదురు తోటల సాగే లక్ష్యంగా, ప్రత్యేకంగా 'బాంబూ మిషన్' ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకమిస్తున్నాయి. ఖర్చులో 60% కేంద్రం, 40% రాష్ట్రం భరించనున్నాయి. ఇటీవల ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌కు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. వెదురు అనాదిగా మనకు అనేక విధాలుగా ఉపయోగపడుతున్నది. సుమారు 1500 రకాలుగా వెదురు ఉపయోగపడుతున్నట్లు అంచనాగా ఉంది. అయితే, మన దేశంలో వెదురు ఇన్నాళ్లూ సంరక్షించదగిన అటవీ చెట్ల జాబితాలో ఉంది. అందువల్లనే మన పొలంలో పెరిగిన వెదురు బొంగులను నరకాలన్నా అటవీ శాఖ అనుమతి తీసుకోవాల్సి వచ్చేది. ఈ ఆంక్షల వల్ల ప్రజల అవసరానికి తగినంత వెదురు దొరక్కుండా పోయింది. అందుకని, కేంద్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం వెదురును అటవీ చెట్ల జాబితాలో నుంచి తొలగించింది. దీంతో పొలాల్లో వెదురు తోటలు సాగు చేయడానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి.





రైతులకు బోలెడు లాభాలు

వెదురుతో తయారు చేసిన గృహోపకరణాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ వుంది. వెదురుతో ఫర్నీచర్, వెదురు బద్దలతో మన్నికైన, ఆకర్షణీయమైన గృహోపకరణాలు తయారు చేసుకోవచ్చు. అలాగే వెదురు కోత సందర్భంలో నిరుపయోగంగా ఉన్న వెదురు ముక్కల్ని విద్యుత్ ఉత్పత్తికి వాడుకునే అవకాశం ఉండటంతో ఏపుగా పెరిగి వెదురుతోపాటు, విరిగిన వెదురుగడలు లాభాలు అర్జించి పెట్టే అవకాశం వుంది. ఒక్క పంట 50 ఏళ్లు, వంద ఏళ్లు వస్తుంది. బ్యాంబూ సాగు రైతులకు అన్ని రకాలుగా లాభామే. త్వరలోనే రాష్ట్రంలో వెయ్యి మంది రైతులను ఎంపిక చేసి సాగును ప్రారంభిస్తాం.

-ఉద్యానశాఖ సంచాలకులు, వెంకట్రామ్ రెడ్డి

పువ్వు ఆకారంలో...

యాదాద్రి టెంపుల్ సిటీ పువ్వు, మొగ్గ ఆకారంలో ఉంటాయని, డిజైన్ ఖరారు చేస్తే వెంటనే కట్టడానికి నిర్మాణ సంస్థలు సంసిద్ధంగా ఉన్నాయని ముఖ్యమంత్రి కెసిఆర్ తెలిపారు. యాదాద్రికి సమీపంలోనే బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్‌లు త్వరలో వినియోగంలోకి వస్తాయని, అవి పూర్తికాగానే జూన్ కల్లా కాళేశ్వరం నీళ్ళు కూడా వస్తాయని, ఆ తర్వాత గండిచెరువు కుంటలో స్వామి వారి తెప్పోత్సవానికి ఎలాంటి ఇబ్బందులూ ఉండవన్నారు. సంవత్సరం పొడవునా సౌకర్యం ఉంటుందని వివరించారు. సుమారు 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రవచన మండపం కూడా ఉంటుందని, ఇందులో ఏక కాలంలో రెండు లక్షల మంది హాజరయ్యేలా కడతామని తెలిపారు. నిర్ణయం జరిగిందిగానీ త్వరలో డిజైన్ కూడా ఖరారవుతుందని తెలిపారు.





యాదాద్రిలో ఏరియల్ వ్యూ నిర్వహిస్తున్న సిఎం కెసిఆర్. చిత్రంలో ఎంపి జోగినపల్లి సంతోష్ కుమార్, ఎంఎల్ఎలు గ్యాదరి కిషోర్, మర్రి జనార్దన్ రెడ్డి



దివ్యాద్రి

(మొదటిపేజీ తరువాయి)

832 ఎకరాల మేర స్థలాన్ని ఒకే పీస్‌గా ప్రభుత్వం సేకరించిందని, మరో 250 ఎకరాలను కూడా తొందరలోనే సేకరించనున్నామని, గుట్ట కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణ అవసరాల నిమిత్తం తక్షణం రూ. 70 కోట్లను కొద్దిసేపటి క్రితమే మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే శనివారం, ఆదివారం రోజుల్లో సగటున 70 వేల మంది భక్తులు, యాత్రికులు ఇక్కడకు వస్తున్నారని, సమీప భవిష్యత్తులో ఈ క్షేత్రం మరింతగా వెలుగొందుతుందని, లక్షలాది మంది వచ్చినా వారికి సకల సౌకర్యాలు కల్పించేంత ఉత్తమంగా ఈ క్షేత్రాన్ని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణలోని ఆలయాలు, వాటి విశిష్టత, పుష్కరాలు తదితరాలన్నీ నిర్లక్ష్యానికి గురయ్యాయని, ఇప్పుడు తెలంగాణ ఏర్పడిన తర్వాత పూర్వ వైభవాన్ని సంతరించుకుంటున్నాయని అన్నారు. ఇంత భారీ సంఖ్యలో భక్తులు వస్తున్నారుకాబట్టే వెయ్యి ఎకరాల్లో టెంపుల్ సిటీని నిర్మిస్తున్నామన్నారు.



అధికారులతో కెసిఆర్ సమీక్ష, వివిధ నమూనాల పరిశీలన



సిఎం కెసిఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ పూజారులు, అధికారులు

పనుల్లో వేగం పెరగాలి

చిన జీయర్ స్వామి ఆగమశాస్త్రం నిబంధనల ప్రకారం చేసిన సూచనల మేరకు ఆలయం నిర్మాణం పనులు జరుగుతున్నాయని, అయితే పనుల్లో వేగం పెరగాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇకపైన ప్రతీ నెలా రెండు మూడుసార్లు తానే స్వయంగా వచ్చి పనులను సమీక్షిస్తానని తెలిపారు. ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం ఆలయం గొప్పగా రూపుదిద్దుకుంటోందని, మండపాలు, ప్రాకారాలు చాలా బాగా వచ్చాయని, మొత్తం పనులు పూర్తయిన తర్వాత ఈ క్షేత్రానికి వచ్చే భక్తులకు ఒక దివ్యమైన అనుభూతి కలుగుతుందని అన్నారు. ఇక్కడే ఉన్న శివాలయం కూడా చాలా గొప్పగా ఉంటుందని, గతంలో ఉన్నదానితో పోల్చుకోలేనంత గొప్పగా ఆవిర్భవిస్తుందన్నారు. మరో పదిహేనురోజుల్లో తాను జియర్ స్వామిని పిల్చుకుని వస్తానని తెలిపారు. జియర్ స్వామి చేసిన ఆగమశాస్త్ర సూచనలకు అనుగుణంగానే ఆలయం లోపల పనులు జరిగాయని, పెద్దగా మార్పులేమీ లేవుగానీ, కొన్ని చిన్నచిన్న మార్పులు ఉండవచ్చని అన్నారు. కొండ కింది వైపున పశ్చిమభాగంలో జరిగే ఏర్పాట్ల గురించి కూడా చర్చించామని, దాని ప్రకారం పనులు వెంటనే ప్రారంభమవుతాయన్నారు.

స్వామి తెప్పోత్సవానికి గండిచెరువు కుంట

గుట్ట కింద పెండింగ్‌లో ఉన్న భూసేకరణను ఇప్పుడే పూర్తి చేశామని, రూ. 70 కోట్లు కూడా విడుదల చేయించామని తెలిపిన ముఖ్యమంత్రి కెసిఆర్ ఆలయానికి ఉత్తరంవైపు కింది భాగంలో 73 ఎకరాల స్థలాన్ని కూడా సేకరించామని, దానికి అవసరమైన డబ్బును కూడా చెల్లించామని తెలిపారు. గండిచెరువు కుంటగా పిలిచే 30 ఎకరాల స్థలంలో స్వామివారి తెప్పోత్సవానికి వినియోగిస్తామని, మిగిలిన 143 ఎకరాల స్థలంలో భక్తుల వసతి సౌకర్యాల కోసం ఉపయోగిస్తామని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహా పలు ఆధ్యాత్మిక క్షేత్రాల్లోని వసతి సౌకర్యాలను పరిశీలించి యాదాద్రిలో సైతం ధీటుగా నిర్మిస్తామని తెలిపారు.

దాతల విరాళాలతో కాటేజీలు

యాదాద్రి ఆలయం నిర్మాణం పూర్తయితే రోజుకు కనీసం రెండున్నర లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, దాన్ని దృష్టిలో పెట్టుకునే భారీ స్థాయిలో వసతి సౌకర్యాలను కూడా కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. రాజు వెగ్నేశ ఫౌండేషన్ ప్రతినిధి ఆనందరాజు ఇప్పుడే తనతో మాట్లాడారని, కాటేజీల నిర్మాణం కోసం పది కోట్ల రూపాయల విరాళాన్ని చెక్కు రూపంలో ఇచ్చారని తెలిపారు. ఇంకో నాలుగైదు కోట్ల రూపాయలను కూడా ఇస్తామని హామీ ఇచ్చారని, తిరుమలలో నిర్వహిస్తున్న తరహాలోనే యాదాద్రిలో సైతం నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించడానికి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. ఇక ప్రయాణీకుల అవసరాలకు తగినట్లుగా బస్ స్టేషన్, క్యూ కాంప్లెక్స్, కార్ పార్కింగ్, నిత్యాన్నదాన సత్రాలు, భక్తుల కోసం దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్స్ తదితరాలన్నీ రావాలని అన్నారు. సర్వ హంగులతో టెంపుల్ సిటీ ఆవిర్భవిస్తుందని, భక్తుల కోసం 354 లగ్జరీ క్వార్టర్లతో 250 ఎకరాల లేఅవుట్ ఉంటుందని, డిజైన్ ఖరారుకాగానే నిర్మాణం తొందరలో ప్రారంభమవుతుందని తెలిపారు. విరాళాలు ఇచ్చే దాతలు రెండు విభాగాలుగా కాటేజీల గురించి ఆలోచనలు పంచుకున్నారని, కోటి రూపాయల విరాళంతో నిర్మించే కాటేజీలు ఎలా ఉండాలి, రెండు కోట్ల రూపాయల కాటేజీలు, యాభై లక్షలు, పాతిక లక్షలతో కట్టే కాటేజీలు ఒకదానికొకటి భిన్నంగా ఉంటాయని సూచనప్రాయంగా తెలిపారు. తిరుపతిలో, ఇతర దివ్య క్షేత్రాల తరహాలోనే ఇక్కడా కాటేజీలు ఉంటాయన్నారు. ఇప్పటికే రెఃండు కోట్ల రూపాయలు విరాలంగా ఇవ్వడానికి నలభై మూడు మంది దాతలు వచ్చారని, త్వరలోనే నిర్మాణపు పనుల్ని ప్రారంభిస్తామన్నారు. యాదగిరిగుట్ట డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ కిషన్‌రావుతోనూ మాట్లాడామని, త్వరలో హైదరాబాద్‌లో సమీక్షించి డిజైన్‌పై చర్చిస్తామని తెలిపారు. అన్ని కాటేజీ బ్లాక్‌లు ఒక పద్ధతి ప్రకారం ఉండేలా ఎవరు కట్టాలో చర్చిస్తామని తెలిపారు. ఒక్కో బ్లాకుకు ఒక్కో పేరు పెడతామని, లక్ష్మీ నరసింహస్వామివారి పేరు మీద ఒక బ్లాక్, విష్ణు భక్తుడైన ప్రహ్లాద పేరు మీద ఒక బ్లాక్, అలివేలు మంగ పేరు మీద మరో బ్లాక్ ఇలా ఒక్కో బ్లాక్‌కు ఒక్కో పేరు ఉంటుందని తెలిపారు. అయితే అన్ని బ్లాక్‌ల నిర్మాణం ఒక యూనిఫాం పద్ధతిలో ఉండేలా డిజైన్లను ఖరారు చేస్తామన్నారు.

ఆలయాలు సంస్కృతి, సంస్కార పరివర్తనా కేంద్రాలు

ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం యాదాద్రి ఆలయ నిర్మాణంతో పాటు మండపాలు, శిల్పసంపదను చూస్తే ఈ రోజుల్లో కట్టగలిగేటటువంటివి కావని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. చాలా చోట్ల ఆలయాలను కడతారని, కానీ యాదాద్రి నిర్మాణం మాత్రం ప్రపంచంలోనే ఒక విభిన్నమైనదని అన్నారు. సాధారణంగా ఆలయ నిర్మాణంలో గోపురాలను ఒక స్థాయి వరకు కట్టి మిగిలిన భాగాన్ని సిమెంటుతో కడతారని, అదే పద్ధతిలో యాదాద్రిని కూడా కట్టాలనుకుంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి ఉండేదన్నారు. మూడు నెలల్లోనే పూర్తి చేసి ఉండేవారమని, కానీ మనం అలా కట్టలేదని, గోపురాల్లో మొత్తం ఏడు అంతస్తుల వరకూ శిల్పాలతోనే కట్టామని వివరించారు. వేల ఏళ్ళ పాటు నిలిచి ఉండేలా మొత్తం కట్టడాలను కృష్ణ శిలలతోనే కట్టామని తెలిపారు. ఆలయాలు మన సంస్కృతి, సంస్కారాన్ని భవిష్యత్ తరాలకు పరివర్తన చేసే కేంద్రాలని, కమ్యూనిటీ సెంటర్లు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఒక తరం నుంచి మరో తరానికి ఆలయాలు మన సంస్కృతిని, సంస్కారాన్ని ట్రాన్స్‌ఫర్ చేసే గొప్ప సంస్థలని వ్యాఖ్యానించారు. నాస్తిక సోదరులు కొన్ని పిచ్చిపిచ్చి ప్రచారాలు చేస్తారుగానీ మన ఆలయాలు కమ్యూనిటీ, కల్చరల్ సెంటర్‌లుగా ఏ విధంగా పనిచేస్తున్నాయో గ్రహించరని అన్నారు. యాదాద్రికి ప్రస్తుతం శని, ఆదివారాల్లో వచ్చే 70 వేల మంది భక్తులు ఎవరు పిలిస్తే వస్తున్నారని ప్రశ్నించారు. ఆలయానికి ఉన్న శక్తి, మహత్తు అలాంటిదని అన్నారు. ఎవ్వరూ పిలవకుండానే భక్తులు తమంతట తాముగా స్వచ్ఛందంగా వస్తున్నారని, అందుకే ఆలయం గొప్ప కమ్యూనిటీ, కల్చరల్ సెంటర్ అని అన్నారు. సంస్కృతిని, సంస్కారాన్ని పెంపొందించే క్షేత్రం మహిమ అలాంటిదని, అందుకే నిర్మాణం విషయంలో అంత శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.



అష్టాదశ శక్తిపీఠాల్లో జోగులాంబ ఒకటి

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో తాను కొన్ని అంశాలను ముక్కుసూటిగా చెప్పానని గుర్తుచేసిన కెసిఆర్ ఇప్పటికీ వాటిని చెప్పడానికి భయపడనని, దాచుకోనని అన్నారు. ''సమైక్య రాష్ట్రంలో మా నదులు మావి కాకుండా పోయాయి. మా పుష్కరాలు, మా దేవుళ్ళు కూడా మావి కాకుండా పోయాయి'' అని అన్నారు. దేశంలోని అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి శ్రీలంకలో కూడా ఉందని, అమ్మవారి ఉపాసన చేసేవారు ఆ పద్దెనిమిది క్షేత్రాల్లో ఉపాసన చేస్తేనే సంపూర్ణ ఉపాసకులు అవుతారని, అప్పుడు మాత్రమే వారు చండీ యాగం లాంటివి చేయడానికి అర్హులవుతారని వివరించారు. అలాంటి శక్తిపీఠాల్లో తెలంగాణలో కూడా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం ఒకటని అన్నారు. అమ్మవారి ఉపాసకులు వీటన్నింటిలోనూ ఉపాసన చేయాలని, ప్రతీ ఏటా వారు అది చేస్తారని, సౌకర్యాలు, వసతులు ఉన్నా లేకపోయినా ఒక పద్ధతి ప్రకారం అది జరుగుతుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను జోగులాంబ నుంచి గద్వాలకు పాద యాత్ర ఎంచుకోడానికి కారణం అష్టాదశ పీఠమేనని గుర్తుచేశారు. అందుకే రెండేళ్ల క్రితం వచ్చిన కృష్ణా పుష్కరాల్లో అమ్మవారి పేరు మీద ఒక జోగులాంబ ఘాట్‌ను కూడా కట్టించామని, తాను అక్కడే పుష్కరస్నానం చేశానని తెలిపారు.

సహస్ర కుండాత్మక అభిషేకంతో ఉద్ఘాటన

యాదగిరి గుట్ట ఆలయ నిర్మాణమేకాదు దీని ప్రతిష్ఠ కూడా అంతే గొప్పగా ఉండాలని, ఆషామాషీగా జరగరాదని కెసిఆర్ వ్యాఖ్యానించారు. ఇది ఆలయ ప్రతిష్ఠ మాత్రమేనని, విగ్రహ ప్రతిష్ఠ కాదని స్పష్టం చేశారు. సహస్ర కుండాత్మక అభిషేకంతో ఆలయ ఉద్ఘాటన కార్యక్రమం జరగాలని, దేశంలో ఇప్పటివరకు ఎక్కడా ఇలా జరగలేదని, 1008 హోమ గుండాలతో జరుగుతుందని తెలిపారు.

ప్రధాని మొదలు వివిఐపిలు చాలా వస్తారు

యాదాద్రి ఆలయ ఉద్ఘాటన కార్యక్రమానికి ప్రధాని మొదలు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, విదేశీ స్వామీజీలు చాలా మంది వస్తారని, వారి వసతి నిమిత్తం ప్రెసిడెన్షియల్ క్వార్టర్ల నిర్మాణం కూడా జరగాల్సి ఉందన్నారు. ప్రెసిడెన్షియల్ సూట్‌లు 60 కడుతున్నామని, సెప్టెంబరుకల్లా పూర్తవుతాయని, ఆలయ ఉద్ఘాటనకు పిఎం, రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రులు చాలా మంది వస్తారు కాబట్టి వారి స్థాయికి తగిన గెస్ట్ హౌస్‌లు ఉండాలన్నారు. బృహత్తరమైన ఉద్ఘాటన కాబట్టి చాలా ఆలోచనతో పనులు జరగాలని, ఈ ఏర్పాట్లన్నీ పూర్తయిన తర్వాతనే ఉద్ఘాటన జరుగుతుందని తెలిపారు. ప్రారంభం తేదీ ఎప్పుడో తానే చెప్తానని, ప్రస్తుతానికి కీలకమైన పనులు పూర్తయ్యాయని, మిగిలిన అన్ని పనులూ ఏకకాలంలో ప్రారంభమయ్యేలా చూద్దామని, పనుల్లో వేగం పెరగాలని స్పష్టం చేశారు. వీటిని సమీక్షించడానికి తానే ఇకపైన నెలకు రెండు మూడు సార్లు వస్తానని తెలిపారు. ఆలయ పనులను పరిశీలిస్తున్నప్పుడు ముఖ్యమంత్రి వెంట మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, భువనగిరి పార్లమెంటు సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌రావు, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, బడుగుల లింగయ్య యాదవ్, శాసనసభ్యులు పైళ్ళ శేఖర్‌రెడ్డి, గొంగిడి సునీత, గ్యాదరి కిషోర్, మర్రి జనార్ధన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్, కృష్ణారెడ్డి, మాజీ మంత్రి ఉమా మాధవరెడ్డి, ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, కలెక్టర్ అనితా రామచంద్రన్, వైటిడిఏ చైర్మన్ కిషన్‌రావు, ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి గీత, రాచకొండ పోలీసు కమిషనర్ మహేశ్ భగవత్ తదితరులు ఉన్నారు.

చిన జీయర్ ఆధ్వర్యంలో బద్రీనాథ్ నుంచి, ప్రపంచంలోని 133 దేశాల నుంచి వైష్ణవ ఫిలాసఫీని ఆచరించే స్వాములు వస్తారని సిఎం తెలిపారు. ఆ సమయంలో యాదాద్రికి పదిహేను లక్షల మంది భక్తులు వచ్చే ఆస్కారం ఉందని, ఆరున్నర వేల మంది రుత్విక్కులు ఏకకాలంలో వేదపఠనం చేయనున్నారని, వారికి సహాయకులే రెండు వేల మంది ఉంటారని వివరించారు. ఇక యాగం చేసేవారు, రుత్విక్కులు పన్నెండు వేల మంది ఉంటారని, తానే దగ్గర ఉండి ఒక కార్యకర్తలా పాల్గొని జరిపిస్తానని తెలిపారు. అంత గొప్ప యాగం, కార్యక్రమంతో ఈ ఆలయం పునీతం అవుతుందన్నారు. గ్రామ దేవత తరహాలో టెంకాయతోనే పూర్తికాదని, జరగాల్సినవి ఇంకా చాలా ఉన్నాయన్నారు. హైదరాబాద్ నగరానికి ఈ క్షేత్రం దగ్గరగా ఉన్నందున పిల్లలతో ఒకటి రెండు రోజులు ఉండాలనే ఫీలింగ్ రావాలన్నారు. బస్వాపూర్ దగ్గర రిజర్వాయర్ సమీపంలో 260 ఎకరాల జాగాలో కన్వెన్షన్ సెంటర్, ఫైవ్ స్టార్ హోటళ్ళు వస్తాయని, హెచ్ఐసిసి తరహా హోటళ్ళు కూడా వస్తాయని, బోటింగ్ సౌకర్యం, థియేటర్లు కూడా ఉంటాయన్నారు. భువనగిరి ఖిల్లా, జైన దేవాలయం, కొలనుపాక .. వీటన్నింటినీ కలుపుతూ ఒక పర్యాటక సర్క్యూట్ ఉంటుందని తెలిపారు.



పద్ధతి ప్రకారమే అన్నీ... హడావుడిగా కానివ్వ

''యాదాద్రి ఆలయ పనులు ఎట్ల జరగాలో అట్ల జరగాలి తప్ప కేవలం జరగడం కోసం జరిగేది కాదు. పనుల్ని హడావిడిగా కానివ్వను నేను. టైం పెట్టుకుని ఉరికే పనులు కావు అవి. ఒక ఎంఆర్ఓ ఆఫీసు లేదా ఒక ఎండివో ఆఫీసు లాగ ఉండదని, ఒకవేళ అలా ఆషామాషీగా, ఆదరబాదరగా కట్టేటట్లయితే నేనే కట్టనియ్యను. శిల్ప సంపదతో ముడిపడిన పనులు అవి. వెయ్యేళ్ళు, రెండు వేల ఏళ్ళు ఉండాలి. దీని ప్రారంభోత్సవం కూడా చాలా గొప్పగా జరుగుతుంది'' అని ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యాఖ్యానించారు. యాదాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న కెసిఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్య,లో వేద పండితులు ముఖ్యమంత్రికి ఆశీర్వాద వచనం చేశారు. అనంతరం ముఖ్యమంత్రి ప్రధాన దేవాలయ పునర్ నిర్మాణ పనులతో పాటు మంటపం, గర్భగుడి, బాహ్య ప్రాకారాలు, అంతర్ ప్రాకారాలు, మాడ వీధులు, రథశాల, వ్రత మంటపం, ధ్వజ స్థంభం, ప్రసాదం కౌంటర్లు, శివాలయం తదితర పనులను పరిశీలించారు. అధికారులకు, శిల్పులకు సూచనలు చేశారు. హెలికాప్టర్ ద్వారా నిర్మాణ పనులను వీక్షించారు.





ప్రేతాత్మ వెలిగించిన పొగ

అదిగో అక్కడే
ప్రేతాత్మలు వెలిగించిన పొగ
ఆత్మగా మారి గాలితో సహజీవనం చేస్తుంది
అదిగో అప్పుడే
వెన్నెల చీకటి కుబుసంలోకి జారడాన్ని చూసి
దూరంగా నక్క కూత పెడుతుంది
రాహువు కేతువు పన్నిన వలలో
చిక్కిన మానవత్వం
మరణించాకే నిజమైన పదార్థమై
మరో ప్రపంచమై సంచరిస్తుంది అక్కడ
ఇక ఇప్పుడు కుళ్లడానికి అక్కడ ఎముకలు లేవు
చిందడానికి వర్ణ వర్గ వైషమ్యాలతో
మకిలిన రుధిర ధాతువు అక్కడ లేదు

వెన్నును మెలి పెట్టి విరిచే
అసూయా ద్వేషాలు లేవు
ఇప్పుడు అక్కడ
సహజ సృష్టితో సాగే
మానవత్వపు పునాదులు లేచాయి
అక్కడ బాల్యం
ఆకులూ పుల్లలు పట్టుకుని
ప్రకృతిలోకి అడుగులేస్తోంది
ప్రతీ ఆడతనపు అంగాంగ సౌష్టవం
అక్కడ నవమాసాలు మోసిన అమ్మతనమై
పూజింపబడుతుంది

ఏ అర్థ రాత్రో కాదు
సూర్యుడి నడిబొద్దున కూడా
నలు దిక్కుల మధ్యే కాదు
నాలుగు గోడల గుండె గదిలో కూడా
ముడుతలు పడిన చర్మం
అక్కడ ఎపుడూ నిగనిగలాడుతుంది
అక్కడ రెండు కాళ్ళ జంతువుకే కాదు
అన్ని కాళ్ళ ఉనికీ స్వేచ్ఛతో రాయబడింది
అక్కడ విత్తనాలు పిలిచినపుడే
చినుకులు రెక్కలు కట్టుకుని వాలుతాయి
ఆ ప్రతిబింబంలో కనిపించేది

గోచీ కట్టి నారు పోసిన రైతన్న చిరునవ్వు
ఆ ప్రపంచంలో స్మశానాలు నిషిద్ధం
ఆ లోకం పేరు సమసమాజం
కానీ ఆ లోకానికి లోటు ఒక్కటే
ఆ లోకంలోని ప్రతీ ఆత్మా
భౌతిక లోకంలోకి తొంగి చూసినప్పుడల్లా
ఆర్ద్రత వారి కనురెప్పలపై మొలుస్తుంది
అందుకే భౌతిక వర్తమాన ప్రపంచాన్ని
అవి వెలివేశాయి
మరో నవ ప్రపంచాన్ని సృష్టించుకున్నాయి.

– పరవస్తు
8328384951

కాలరేఖపై కవిత్వపు నది


జాని.తక్కెడశిల
9491977190

నాలుకలపై అక్షరాలు నానడమంటే సామాన్యమైన విషయమా! గుండె లో తడి లేకపోతే అదెలా కుదురుతుంది? హృది లోతుల్లో ఉబికి ఉబికి వచ్చిన అక్షరాలే కవిత్వమౌతుంది. అలాంటి కవిత్వమే నాలుకలపై సింహాసనం వేసుకొని కూర్చుంటుంది. ''వడగాల్పు నా జీవితమైతే వెన్నెల నా కవిత్వం '' అని గుర్రం జాషువా తన కవిత్వాన్ని గురించి చెప్పుకున్నారు. అలాగే ప్రజాకవి కాళోజి గారు ''ఎవని వాడుక భాష వాడు రాయాలె. ఇట్ల రాస్తే అవతలోనికి తెలుస్తదా అని ముందర్నే మనమనుకునుడు, మనను మనం తక్కువ చేసుకున్నట్లె. ఈ బానిస భావన పోవాలె. నే నెన్నో సార్లు చెప్పిన. భాష రెండు తీర్లు ఒకటి బడి పలుకుల భాష, రెండోది పలుకు బడుల భాష. పలుకు బడుల భాషగావాలె.'' అని అన్నారు. వారు చెప్పిన దానిని పరిశీలించినప్పుడు కవిత్వం ఎక్కడినుండో పుట్టదు మనలో నుండే మన పరిసరాల నుండే మనము అనుభవించిన సంఘటనలనే కవిత్వంగా చేసి బుర్రలో నుండి తోడుకుంటున్నాము.

కవిత్వం ఇలానే ఉండాలని ఎవరూ చెప్పలేదు చెప్పకూడదని నా అభిప్రాయం. నా కవిత్వం ఇలా ఉంటుందని కొందరు చెప్పుకుంటే మరికొందరు ఇలా ఉంటే బాగుంటుందని చెప్పారు. కావున కవిత్వం ఇలానే ఉండాలని ఎవరైనా చెపితే వినకండి. మీ భాషలో, మీ యాసలో మీ వేదనను, ఆనందాన్ని, దుఃఖాన్ని, అవగాహనని, విశ్లేషణని, అనంతాన్ని కవిత్వంలో ఇమడింపచేయండి. నా పరిశీలనలో కవిత్వం రెండు రకాలుగా వస్తోంది. ఒకటి అభూతకల్పనలతో రీడర్ కి అందని మెటాఫర్ తో కవిత్వాన్ని రాస్తున్న వారు కొందరైతే. పేరాను వాక్యాలుగా తెంచి కవిత్వంగా మలుస్తున్నామని భ్రమపడేవారు మరికొందరు. కవిత్వం కవికి, రీడర్ కి వంతెనగా ఉండాలి. కవిత్వానికి శైలి ముఖ్యం ఎన్నో సంవత్సరాల నుండి రాస్తున్నవారు కూడా ఒక శైలిని నిర్మించుకోలేకపోతున్నారంటే వారు కవిగా విఫలం అవుతున్నారనే అర్థం.

సీనియర్ కవులను ఒకరితో ఒకరిని పోల్చలేము. ఎందుకంటే ఎవరి శైలి వారిది? వారి శైలిలో వారు నిష్ణాతులు. అలాంటి కవుల్లో ఒకరైన వారు దేవరకొండ బాలగంగాధర తిలక్. ఈ కవి పేరు చెప్పగానే తెలుగు సాహిత్యాభిమానులకు గుర్తు వచ్చేది ''నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు'' అనే వాక్యం. ఇదే వాక్యం ఇప్పటికి తెలుగు కవిత్వాన్ని శాసిస్తూనే ఉంది. ఒక్క వాక్యంలో తన కవిత్వం ఎలా ఉంటుందనే చెప్పిన విధానం, అందులో తిలక్ గారు వాడిన ప్రతీకల వల్లె తెలుగువారి గుండెల్లో ఆ వాక్యం నిలిచిపోయింది. అక్షరాలను ఆడపిల్లలతో పోల్చడం అవి వెన్నెలలో ఆడుకుంటున్నాయని చెప్పడంతో తన కవిత్వం అందంగాను, విస్తృతంగాను, భావయుక్తంగా ఉంటుందని తేల్చి చెప్పారు. పోలిక రీడర్ కి అర్థమవ్వాలి అది రీడర్ ఊహించగలగాలి. కవి ప్రకటించిన ఊహను రీడర్ అందుకున్నప్పుడే కవిత్వం పచ్చ పచ్చగా వెలుగుతుంది.

అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటిలోని మొదటి వాక్యం ఇలా ఉంటుంది. 'నా కవిత్వం కాదొక తత్వం/ మరి కాదు మీరనే మనస్తత్వం'. కవిత్వం ఎప్పటికీ ఒక తత్వం కాదు ఎవరికీ, ఏ వాదానికి చెందినది కాదు. కొన్ని కోట్ల తత్వాలతో భావం





కలిస్తే కవిత్వం అవుతుందేమో. కవిత్వం రీడర్ కి ఎలా అవసరమైతే అలా ఒదిగిపోవాలి. తను దుఃఖంలో ఉన్నప్పుడు కవిత్వం చదివితే స్వాంతన దొరకాలి. ఆనందంగా ఉన్నప్పుడు ఉత్తేజాన్ని ఇవ్వాలి. ఇలా కవిత్వం తనను తాను మార్చుకుంటూ రీడర్ కి అన్ని సమయాల్లో హత్తుకుపోవాలి. అప్పుడే కవిగా మనం నిలబడగలము. కవిత్వం ఎందుకు రాస్తున్నావని ఎవరో అడిగారు?ఒక కవి అన్నాడట అతిపెద్ద పురస్కారం కోసమని. నేనంటాను కవిత్వం రాసేది ఒక వర్గం, జాతి, ప్రాంతం వివక్షకు గురైనప్పుడు బాసటగా నిలిచే అక్షరాన్ని వారికి అందివ్వడానికి. అలాంటి కవిత్వమే కదా చిరకాలం నిలిచేది. ఆ కోవలోకి చెందిన పుస్తకమే అమృతం కురిసిన రాత్రి.

మనిషి జీవితంలో వృద్ధాప్యం ఒక వరం కావాలి కాని అదొక శాపమై, పక్కలో బల్లమై క్షణం క్షణం మరణభీతిని కలిగిస్తోంది. ఎవరికీ అవసరం లేని స్థితిలోకి వెళ్ళడమే ఈ ముసలితనం. పండిన పండులో సూర్యుడు ఎలా ఉదయిస్తాడు. సూర్యాస్తమయం జరిగే చోట వెలుగును ఎలా నిలువరించలేము. అక్కడ చీకటి ప్రవేశిస్తుంది అది ముసలి చీకటి, రాకాసి చీకటి, ముడతల చీకటి, కల్లకింద మరణాన్ని పాతిపెట్టే చీకటి, రెప్పలపై ఎండిపోయిన రక్తపు ఛాయల చీకటి. నాలుగు గోడల మధ్యలో కరుగుతున్న కండల చీకటి. పురివిప్పిన చీకటి, ఉదయించిన చీకటి, అగాధంలోకి నెట్టే చీకటి. పెదవులపై మరణాన్ని ఉలకపోస్తున్న చీకటి అవును అదే అదే ఆ చీకటే ఊపిరిలో మసులుతోంది. ముసలివాడు కవితలో తిలక్ గారు ముసలితనం ఎలా ఉంటుందని వివరించిన తీరు రీడర్స్ ని కంటతడి పెట్టిస్తుంది. కవిత గొప్పదనం ఏంటంటే ఒక ముసలివ్యక్తి తన దుస్థితిని చెప్తున్నట్టు రాయడమే. శివారెడ్డి గారి ఆసుపత్రి గీతంలో కూడా కొన్ని ఖండికలు సంబంధించిన పాత్రలే రీడర్స్ కి చెప్తున్నట్టు కవిత్వం ఉంటుంది. ఒక వ్యక్తి లేదా సమూహం చేత కవిత్వాన్ని చెప్పించడంతో అందులో శిల్పం, సహజత్వం బలంగా ఉంటుంది. రీడర్ కూడా త్వరగా రిసీవ్ చేసుకుంటాడు. నేను కూడా నా 'వై' కావ్యాన్ని హిజ్రాలే తమ బాధను చెప్పుకుంటున్నట్టు రాశాను. బహుశ అందుకేనేమో ఆ పుస్తకం ఎక్కువమందిని ఆలోచింపచేసింది. కాని ఇది ప్రతి చోట వాడకూడదని నా అభిప్రాయం అవసరాన్ని బట్టి కవి నేరుగా రీడర్ తో విషయాన్నీ కవిత్వ రూపంలో చెప్పవచ్చు, లేదా రెండవ వ్యక్తిగా మారి చెప్పించవచ్చు. కవితకు ఎత్తుగడ, శిల్పం, ముగింపు మాత్రమే కాదు ఏ టెన్స్ లో ఎలా చెప్పాలనేది కూడా ముఖ్యమే.

ఇప్పటికి మనకి అర్థం కాదు ఈ నాగరికత మనిషిని ముందుకు నడిపిందో వెనక్కి నడిపిందో. ఒక కాలం నుండి మరొక కాలానికి ప్రయాణిస్తూ వచ్చిన మనిషి అవసరాన్ని బట్టి అన్ని విషయాల్లోను మారుతూ వచ్చాడు. మార్పు మంచి చేస్తే పర్వాలేదు అదే మార్పు మనిషి ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. నాగరికత గురించి చెప్తూ నాగరికత మైలపడిన దుప్పటిలా నన్ను కప్పుకుంది అన్నారు. నాగరికత మైలపడింది అనే చెప్పడంతో నాగరికత అవసరమే కాని అది మైలపడినందున ముందుకు వెళ్ళలేకపోతున్నామని చెప్పడమే.

జీవితాన్ని దేనితో కొలుస్తారు. కొలవాలనుకోవడం మూర్ఖత్వమే అనుకుంటాను. ఒకవేళ కొలవాలనుకుంటే ఎన్నివేల నవ్వులతో కొలవాలో. మరి అలాంటి నవ్వులు మన జీవితాల్లో ఉన్నాయా? కాలంపై కన్నీరు పరిగెడుతుంటే నవ్వుల తీగలు ఒకరితో ఒకరిని ఎలా కలుపుతాయి. వికృతం కొలువైన చోట నవ్వులు పూయాలనుకోవడం సబబు కాదు. జీవితాన్ని కొలిచే సందర్భమే వస్తే ఇతరుల జీవితాల్లో మీరు ఎంత శాతం ఉన్నారో? ఎంతవరకు ఉపయోగపడ్డారో లెక్కకడితే సరిపోతుందేమో. జీవితం అనేది వ్యక్తిగతం కాదు అదొక సమూహం. ఎంత పెద్ద సమూహమైతే మన జీవితం కూడా అంత పెద్దది అవుతుంది.

1971 లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు పొందిన ఈ కవితా సంకలనంలోని కవితలు ఆనాటి పరిస్థితులను తెలుపుతూనే భవిష్యత్ ఎలా ఉండబోతోంది అని చెప్పిన విధానం వల్ల కవి సహేతుకంగా ఆలోచించి సరైన నిర్ణయాన్ని ప్రకటించారనిపించింది. ఉదాహరణకు 'ఓ దేవుడా రక్షించు నా దేశాన్ని దేవుళ్ళ నుండి, పూజారుల నుండి, వ్యవస్థ నుండి' ఇది 1963 లో రాసిన కవిత కానీ నేటి పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు రాశారని పిస్తుంది. అప్పటికి ఇప్పటికి ఏమైనా మార్పు వచ్చిందా అంటే వచ్చిందనే చెప్పాలి అప్పట్లో కొద్ది శాతమే దోపిడీ ఉండేది ఇప్పుడు వందకు వెయ్యి శాతం దోపిడీ జరుగుతోంది. గతం, ప్రస్తుతం, భవిష్యత్ నిర్మాణ క్రమాన్ని తెలిపేదే ఈ అమృతం కురిసిన రాత్రి. తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేసిన ఎందరో కవుల్లో తిలక్ గారు ఒకరు. వారి కవిత్వ గొప్పదనం ఏంటంటే ఎన్నిసార్లు వారి కవిత్వాన్ని చదివినా మళ్ళీ మళ్ళీ కొత్తగా మనకు పరిచయం అవుతూనే ఉంటుంది.

క్రీడలపై కథలను పంపండి

క్రీడలపై వచ్చిన కథలను సంకలనం తీయుటకై సంకల్పిస్తున్నారు. క్రీడల నేపథ్యంగా వచ్చిన కథలు, ఎవరు రాసినవైనా పంపిస్తే వాటిని సంకలనంలో చేరుస్తారు. అలాంటి వాటిని మార్చి 10లోగా కస్తూరి మురళీకృష్ణ, ప్లాట్ నెం.32, ఇంటి నెం.8–48, రఘురాంనగర్ కాలనీ, ఆదిత్య హాస్పిటల్ వీ ధి, దమ్మాయిగూడ, హైదరాబాద్–83కు పం పాలి. kmkp2025@gmail.comకు ఈ మెయిల్ ద్వారాగానీ, లేదా 98496 17 39 2కు వాట్సాప్ ద్వారా గానీ పంపించవచ్చు.

దివ్యాంగ మహిళల కథలకు ఆహ్వానం

'శారీరకంగా మిగతా వారి కన్నా వేరుగా ఉన్నాను.' అనిపించగలిగే కథలు గానీ, అనుభవాలు గానీఉంటే, బి.అరుణ, ఇంటి. నెం.129, లేడీస్ హాస్టల్–1, యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్, తెలంగాణ–500046,చిరునామాకు గానీ, arunaborra@gmail.com ఈమెయిల్‌కు గానీ, పంపితే వచ్చిన అన్నింటినీ కలిపి పుస్తకంగా వేస్తారు. వివరాలకు 9395 532951 నెంబర్లను సంప్రదించవచ్చు.

కావ్య పరిమళం

తెలంగాణ సాహిత్య అకాడమి నెలనెలా 'కావ్య పరిమళం' పరంపరలో భాగంగా ఈ నెల 8న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో కాళోజీ నారాయణ రావు ''నా గొడవ''పై డా॥ తూర్పు మల్లారెడ్డి ప్రసంగిస్తారు. సభకు డా॥ నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారు.

పుస్తకాల ఆవిష్కరణ సభ


తెలంగాణ రచయితల సంఘం జంటనగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డా. కొండపల్లి నీహారిణి రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ ఈ నెల 7న ఉదయం 10.30 గంటలకు రవీంద్రభారతి హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథులుగా డా, నందిని సిధారెడ్డి, డా. ముదిగంటి సుజాతారెడ్డి, సభాధ్యక్షులుగా డా. ఏనుగు నరసింహారెడ్డి, విశిష్ట అతిథులుగా డా. మామిడి హరికృష్ణ, డా. అమ్మంగి వేణుగోపాల్, డా. నాళేశ్వరం శంకరం, డా. నిత్యానందరావు, డా. కె. పి అశోక్ కుమార్, కందుకూరిశ్రీరాములు తదితరులు పాల్గొంటారు

కొత్తదనపు అభివ్యక్తి 'మా ఊరు కన్నతల్లి'


తిరునగరి శ్రీనివాస్
9441464764

వస్తుభావ రచనలతో నూతనత్వాన్ని ప్రదర్శిస్తూ నిశితమైన లోకానుభవాన్ని అందిస్తూ పఠనాసక్తిని తనదైన సృజన శక్తితో కలిగిస్తున్న ప్రొఫెసర్ పి. లక్ష్మీనారాయణ సరికొత్త కవితా సంపుటి 'మా ఊరు కన్నతల్లి'. తల్లిప్రేమలోని స్వచ్ఛత, ఊరుపై మమకారం, జీవిత ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలు, సందర్భాన్ని బట్టి కలిగిన హృదయ స్పందనలకు ప్రతిరూపాలే ఈ సంకలనంలోని కవితలు. 'ఎప్పుడు తిరిగి నీరాక' అన్న కవితను మహాకవి సినారేను సంస్మరించి రాస్తూ 'నిశ్శబ్దాన్ని శబ్దంలోకి అనువదిస్తాడు. నిన్ను నన్ను కలపాలని నిరంతరం ప్రయత్నిస్తున్నాడు' అంటూ అదే కవితలో 'కలంతో దోస్తి కాగితాలే స్థిరాస్థి' అంటూ విశ్వ మానవతను చాటగలిగిన కవిగా చెబుతారు. అదే కవితలో 'కలంతో దోస్తి కాగితాలే స్థిరాస్థి' అంటూ — కలం, కాగితంతో పెనవేసుకున్న కవి అనుబంధాన్ని గుర్తు చేస్తారు. 'ప్రాణికోటి కన్నీటి పాట' అన్న కవితలో వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటిన పరిస్థితికి వేదనపడుతూ 'ఎడారి ఎన్నేళ్లుగా ఏడ్చినా / ఇసుక రేణువులు కన్నీళ్ళై కరగవు / ఎండిపోయిన చెరువు గుండెలు ఎంతగా బాదుకున్నా / భూమి పగుళ్ళ నుండి నీళ్ళు ఉబికిరావు' అంటూ వాస్తవికతను ఆవిష్కరిస్తారు. 'ఈ భూమికి అంతిమ గడియలేవో సమీపించిన ఆర్తనాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి / ఊళ్ళు, అరణ్యాలు తీరని దాహార్తితో తహతహలాడి తల్లడిల్లిపోతే / ఈ మహాజీవన గమనానికి అస్తిత్వం లేకుండా పోతున్నది' అంటూ హెచ్చరికనూ చేశారు.

గుండెనిండా ధైర్యంతో హాయిగా నవ్వగలిగే శక్తి పేదవాడికే చెల్లిందంటూ 'విధి విఘాతాల్ని బతుకు అవరోధాల్ని / లెక్కచేయక హాయిగా నవ్వే / నిరుపేద నిజంగా మహనీయుడు' అంటారు. 'బాల్యం' అనే కవితలో 'తిరిగి పసివాళ్ళమైపోతే బాగుండేది / సీతాకోక చిలుకలు మా దోస్తులు / లేత గుబురు మావిళ్ళు మా ఆస్తులు / కొండపైన శిఖరం దాకాపోయి ఆకాశాన్ని తాకాలని ఆరాటపడే వాళ్ళం' అంటూ ఎంతో జ్ఞాపకాల మాధుర్యాన్ని కళ్ళ ముందుంచుతారు. 'నిష్ఠాగరిష్టుడు' — అన్న కవితలో లక్ష్మీనారాయణలోని విమర్శనాత్మక – లోతుల్ని పట్టుకోవచ్చు. 'సముద్రగాథ' కవితలో 'సముద్రమొక గగుర్పొడిచే వీరగాథ / నిజంగా సముద్రం ఏనాటికి అలసిపోని నిత్య అన్వేషి' అనడం ఎంతో విశ్లేషణ ఊతమిచ్చే వాక్యాలుగా అనిపిస్తాయి. 'మనవాళ్ళే' కవితలో 'నీడనే నిజమని నమ్మేవాళ్ళు / ఆ జాడల్లో నడచిపోయే వాళ్ళు' అంటూ రేపటి గురించి పట్టింపులు 'పరేశాన్లు లేవు / వీళ్ళు గ్రహాంతర వాసులేమి కారు / వీళ్ళంతా మనవాళ్ళు 'మనుషులు' కవితలో సింగరేణి కార్మికుల్ని నల్లబంగారం పండించే కర్షకులతో పోలుస్తారు. 'ముగ్గులు' కవితలో చుక్కల్ని కలిపే చాకచక్యం తెలిసిన మహిళలు వేదాంత శిఖామణులు, సత్యాన్ని ప్రబోధించే ప్రవక్తలు అంటారు. 'నెమలి మరణం' కవితలో గొంతు తడారిపోయి నెమలి అడవిలో చచ్చిపోతే పిచ్చుకలు దీనంగా ఏడ్చాయి, కాకులు ఎంతగానో అరచాయి అని – కరవు కరాళనృత్యాన్ని చూపెడతారు. 'నిస్సహాయున్ని' – అన్న కవితలో 'పువ్వుని త్రుంచి సొంతం చేసుకోలేను / పరిమళానికి అవధులు లేవు అంటారు. 'మనమంతా మరణిస్తాం / అయినా జీవితం సాగిపోతుంది / మహాదూరాలు దారులు మాసిపోవు / అయినా ప్రయాణికుడు మజిలీ చేరుకొంటారు' అన్న ఆత్మవిశ్వాసాన్ని లక్ష్మీనారాయణ ప్రకటిస్తారు. మా ఊరు చెరువు పోషమ్మ పాదాలను తాకి అలుగుల్ని పాలధారల్లా పోస్తుంది అంటూ తమ ఊరిలో చిన్ననాటి చెరువును గుర్తు చేసుకున్నారు. అసమాన శిలా సౌందర్యానికి ప్రతీకగా భావించే భువనగిరి దుర్గం గురించి రాసిన కవితలో అలనాటి ప్రాభవాన్ని, నేటి వర్తమాన స్థితిని వివరిస్తూ ఏకశిల భువనగిరి శౌర్యం అజేయం అని కొనియాడుతారు. మొత్తం 50 కవితలు ఈ సంకలనంలో ఉన్నాయి. గతంలో అరచేయి – ఆకాశం, సూర్యుని వాంగ్మూలం, మనిషిని వెతుకుదాం వంటి కవితా సంకలనాలను వెలయించిన లక్ష్మీనారాయణ ప్రత్యేకతను ఆపాదించుకున్న అంశాలను కవితలుగా మలచి ఈ కొత్త సంకలనంలో చేర్చారు. 'ఎందరి నిండు బతుకులు / పునాదుల్లో సమాధులైతే ఈ సౌధాలు ఆకాశాలకు తాకుతాయి' వంటి ఆలోచనాత్మకమైన ఎన్నో పంక్తులు 'మా ఊరు కన్నతల్లి'లో కన్పిస్తాయి.



భాషణ భూషణాలు



చాన్నాళ్ల క్రితం రావిశాస్త్రి గారు సినిమాకి మాటలు రాయటానికని మద్రాసు వెళ్లారు. అక్కడ కొన్నాళ్లుండి తిరిగి వస్తుంటే, ఆయన్ని ఓ అభిమాని ప్రశ్నించారట ''గురువు గారూ సిన్మా ప్రపంచం ఎలా వుంది'' అని. అందుకు శాస్త్రి గారు ''సినిమా ప్రపంచం బాగానే వుంటుంది. వాళ్లతో చాలా సుఖం. మన గదికి మనల్ని అద్దె చెల్లించనివ్వరు. వాళ్ళే చెల్లిస్తారు. మన సిగరెట్టు మనం కొనే పనేం లేదు. వాళ్లే కొనిస్తారు. మన మందు మనం కొనక్కర్లేదు. మన తిండి మనల్ని తిననివ్వరు. వాళ్లే ఏర్పాటు చేస్తారు. చివరికి మన డైలాగులు మనల్ని రాయనివ్వరు. వాళ్లే రాసుకుంటారు'' అంటూ చమత్కరిస్తూ విశదపరిచారు.

పంపినవారు : పి.కళాధర్,
సుభాష్‌నగర్, కరీంనగర్.

editor@manatelangana.org

'అభ్యుదయ సృజన ఒక మేధో బాధ్యత'


డా.బెల్లి యాదయ్య
9848392690

తెలుగు సాహిత్యంలో భావ విప్లవం బలపడి తీక్షణ కాల్పనికత వీస్తున్న రోజుల్లో చైనాదేశంలో నవ సాంస్కృతికోద్యమం(New Cultural Movement) నడిచింది.దీని నాయకుల్లో హు షిహ్(1862–1962)ఒకరు.ఈయన వ్యవహారిక సత్తావాదాన్ని స్థాపించి చైనా పునర్నిర్మాణ వాదానికి విద్యా పరంగా సాహిత్య పరంగా మద్దతు ఇచ్చిండు.1939 లో నోబెల్ పురస్కారానికి నామినేట్ అయిన హు షిహ్ భారతీయ సంస్కృతికి ' India conquered and dominated China culturally for twenty centuries without ever having to send single soldier across her borders' అంటూ1937 లో హార్వర్డ్ యూనివర్శిటీ ప్రసంగంలో నీరాజనం పట్టిండు.సమాజంలో సాహిత్యంలో చోటుచేసుకునే మార్పులు పరిణతి దిశగా సాగినప్పుడే చైతన్యం నూరు పూలుగా వికసిస్తుందన్నడు. 1917 జనవరిలో బీజింగ్ నుండి వెలువడిన కమ్యూనిస్టు సిద్ధాంత పత్రిక 'న్యూ యూత్' కు హు షిహ్ రాసిన 'A Preliminary Discussion of Literay Reform'అనే విమర్శా వ్యాసం ఎంతో విలువైనది.ఇందులో ప్రతిపాదించిన ఎనిమిది అంశాలు కొత్తదనం అన్నింటా కోరుకునే కవులకు రచయితలకు మార్గదర్శకాలు.ఈ వ్యాసం కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన థియోడర్ డి బెరీ మరియు రిచర్డ్ లుఫినో లు సంయుక్తంగా సంకలనం చేసిన 'సోర్సెస్ ఆఫ్ చైనీస్ ట్రెడిషన్ వాల్యూమ్2, కొలంబియా యూనివర్సిటీ ప్రెస్,2000'లో అందుబాటులో ఉంది.

కొలంబియా విశ్వవిద్యాలయం లో తత్వశాస్త్ర పరిశోధకుడిగా(1917)ఉన్న సమయంలో జాన్ డ్యూయి ప్రభావానికి హు షిహ్ లోనయ్యిండు. పరిశోధనానంతరం మాతృదేశానికి తిరిగి వచ్చి, తన గురువు డ్యూయి స్థాపించిన ప్రాగ్మాటిజానికి జీవితకాలం ప్రచారకుడిగా కొనసాగిండు.పెకింగ్ విశ్వవిద్యాలయానికి అధ్యక్షుడిగా పనిచేసి చైనా విద్యా రంగాన్ని విస్తృతంగా ప్రభావితం చేసిండు.'May Four Movement' కు ముఖ్య భూమిక నిర్వహించిన హు షిహ్ చైనా ఆధునిక కవిత్వానికి ఆద్యుడిగా నిలబడిండు.చైనా పునర్వికాసం మీద విరివిగా రచనలు చేసిండు. వినూత్న సాహిత్య సృష్టికి హు షిహ్ విశ్వసించి ఉద్ఘాటించిన 'I believe that literary refo rm' at the present time must begin with these eight items:(1)Write with substance.(2)Do not imitate the ancients.(3) Emphasize grammar. (4).Reject melancholy.(5) Eliminate old cliches.(6)Do not use allusions.(7) Do not use couplets and parallelisms. And(8) Do not avoid popular expres sions or popular forms of characters' ఈ సూచనలు సాహిత్య మౌలిక లక్షణాల్ని లోతుగా పట్టిస్తూ వినూత్నతకు పాదు వేస్తవి.Write with substance అంశం క్రింద అనుభూతికి ఆలోచనకు రచనలో ప్రాధాన్యత ఉండాలన్నడు.కేవలం పదజాలం , వాక్యం సముదాయం,స్వరలయల కూర్పు రచన కాదు.రచనకు అనుభూతే ఆత్మ అని, జ్ఞానం, ఆదర్శం,ఒక దివ్యచక్షువు రచనలోని ఆలోచన ద్వారా పాఠకులకు అందాలన్నడు హు షిహ్. Do not imitate the ancients అంశంలో సాహిత్యం కాలవాచి, మార్పుకు సూచి అని,పాత కథల ఎత్తిపోతల వలన లాభం లేదని


హు షిహ్

,కవులు రచయితలు వస్తురూపాల్లోఎవరి స్వంత ముద్ర వారికి ఉండాలన్నడు.గ్రామ్య జీవద్భాష జీవనేతివృత్తాలు ఘనమైన సాహిత్యం అవుతాయన్నడు. Emphasize Grammar అనే అంశంలో వ్యాకరణం పట్ల చులకన,నిరాదరణ సాహిత్య వేత్తలకు పనికిరాదన్నడు.భాషకున్న రాజస్వ నియమావళిగా భాషా ప్రాదేశికతగా వ్యాకరణాన్ని అభివర్ణించిండు. Reject melancholy గురించి ప్రస్తావిస్తూయువతరానికి సృజన పట్లగల మోహోద్రేకం కలం పేర్ల విషయంలో కావచ్చు,కాలస్వభావాన్ని చిత్రించడంలో కావచ్చు జ్ఞాన పైత్యంగా మారకూడదన్నడు. Eliminate old cliches అంటూ మూసవిధానాన్ని తీవ్రంగా నిరసించిండు. ఎవరైతే స్వీయభాషను, సొంత గొంతుకను, స్వీయానుభవాలను రచనలో రక్తి కట్టించలేరో , ఎవరికైతే own terms of description ఉండదో వాళ్లను సాహిత్య సోమరులుగా పేర్కొన్నాడు. Do not use allusions లో పూర్వకవులు చెప్పిన సాదృశ్యాలను,జాతీయాలను, చారిత్రక ఘట్టాలను,సామ్యతలను,ఉంటంకింపులను యధాతథంగా అరువు పుచ్చుకోవడం హీనత్వంగా,అసమర్థతగా పేర్కొన్నడు. Do not use couplets and parallelism అంటూ మానవ భాషకు సమాంతరత్వం ప్రత్యేక లక్షణమైనప్పటికీ , ఆయా కవుల ద్విపదలను, శ్లోకాలను తిరిగి చెప్పడం,కథా కథనాల్లో వర్ణనల్లో సమాంతరత్వం హేయమైన చర్యగా క్షీణతగా తిరస్కరించిండు. Do not avoid popular expressions or popular forms of characters అంటూ ప్రజలకు అర్థం అయ్యే జీవనోక్తులు ,జీవద్రూపాలు సహజంగా వాటికవే అలంకారంగా ఔచిత్యంగా ప్రాకృతికతగా రూపొందుతున్నపుడు కావాలని పరిహరించడం సాహిత్యమర్యాద కాదని వివరణ ఇచ్చిండు. Dead expressions కు స్వస్తి పలికి living expressions కు స్థానం కల్పిస్తే రచనలకు జీవం జవం సమకూరుతాయన్నడు. నీరసం నిస్సత్తువ నిర్లిప్తత నిస్పృహ సమాజాన్ని ముంచేస్తున్న సమయాల్లో, రొట్టకొట్టుడు వేలంవెర్రి అనుకరణ అచేతనం కళారంగాన్ని ఆవరించిన సందర్భంలో సాహిత్యమే పరిష్కారానికి దారి చూపే అంతిమ యోధ.అన్ని కాలాల్లో,అన్ని సమాజాలల్లో రచన యోధగా తయారు కావడానికి కావల్సిన సూచనలను సలహాలను నిర్మొహమాటంగా ప్రకటించి సాహిత్యాభివృద్ధిలో అభ్యుదయ సృజన ఒక మేధో బాధ్యత (Intellectual Responsibility)ను ఇట్లా ' Only who we realize that there is no eternal, unchanging truth or absolute truth can we around in ourselves a sense of intellectual responsibility. ' అని గుర్తు చేసిండు .సాహిత్యం లో వచ్చిన మార్పులు సమాజంలో కనిపించడం ఒక నింపాది పద్ధతి అయితే, సమాజంలో వచ్చిన పరిణామాలు సాహిత్యంలో కనిపించడం అనేది రెండో పద్ధతి అత్యంత వేగవంతమైనది.ఈ రెండిటిలో ఏ పద్ధతిలో స్పందించేవారికైనా హు షిహ్ ఎనిమిది సూత్రాలు అభ్యసించి అనుసరించదగినవి.

సకుటుంబం

'' వివాహాలు స్వర్గంలో నిర్ణయించబడతాయి'' నిజమే కానీ ఆ వివాహానికి సిద్ధమైన ఆలుమగలు తమ కమ్మని కాపురానికి సిద్ధంగా ఉన్నారా? జీవితంలో కీలకమైందా? మనిషి జీవితాన్ని స్వర్గమయం చేయగలిగింది దాంపత్య జీవితం మాత్రమే. దీన్ని నిర్మించుకోవలసింది కొత్త దంపతులు. ప్రారంభించబోయే కొత్త జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులు, సమస్యలను దాటుకొని ఆనందంగా జీవించగలిగే వాతావరణాన్ని సృష్టించుకోగలిగిన బాధ్యత వాళ్ళదే. యవ్వనంలో అడుగుపెట్టాక జీవిత భాగస్వామి గురించి ఆలోచించని యువతీ యువకులు ఉండరు.



పెళ్ళికి సిద్ధమేనా!

తమ లోపల కలిగే లైంగిక అనుభవాల ఆలోచన లోంచి మనసు పెళ్ళి మీదకు మరలుతోంది. తాము కోరుకొనే లక్షణాలతో తనకు తోడు దొరుకుతోందా! అనే సందేహం మొదలవుతోంది. ఇవాళ్టి సామాజిక పరిస్థితుల్లో తాను పుట్టి పెరిగిన ఇల్లు, తల్లిదండ్రులను వదిలి కొత్త చోటికి వెళ్ళాలి. గనుక అమ్మాయికి భర్త ఎలా ఉండాలనే ఊహతో పాటు, తన అత్తిల్లు ఎలా ఉంటుందీ అందులో ఎలా ఇమిడిపోబోతోంది అన్న భయాలు కూడా ఉంటాయి. మెట్టినింట అందరినీ మెప్పించే భారం అమ్మాయిదే కదా! కానీ ఆ అమ్మాయి ఒక్కరిపైనే వంట, గృహనిర్వహణ, ఉద్యోగ బాధ్యత, బంధుమిత్రులతో మానవ సంబంధాలు, భర్తతో అనుబంధం తన కోసమే కాస్త స్పేస్ అన్నీ ఆలోచించుకోవాలి.

ఇంతటి బాధ్యతలను దృష్టిలో ఉంచుకొని వివాహానికి మానసికంగా సిద్ధమై పెళ్ళిపీటల మీదకు ఎక్కాలి స్వయంగా ఇది అబ్బాయిలకు వర్తిస్తుంది. సంసారంతో వచ్చే జీవన విధానాన్ని అంగీకరించి తగిన విధంగా జీవితంలో మార్పులు చేసుకోవాలి. తన జీవితంలోకి అడుగు పెట్టే భార్య మానసిక ఆందోళన అర్థం చేసుకొని తనకి మాత్రమే సొంతంగా ఉన్న తన ఇంట్లో భార్యను కొత్త సభ్యురాలిగా చేర్చుకోవాలి. కష్టసుఖాలు పట్టించుకోకుండా వదిలేస్తే కొత్త కాపురంలో ఇమిడి పోయేందుకు అమ్మాయిలు కంగారుపడతారు. తన వాళ్ళందరినీ వదిలి తన వెంట నడిచి వచ్చిన భార్యకు భరోసా ఇవ్వటం భర్త బాధ్యత. తాను ఒంటరిననే భావం ఆమెకు కలుగకూడదు ఇందుకు గానూ వాళ్ళ ఇద్దరి మధ్య మాటల వంతెన ముఖ్యం. భార్య ఆందోళనను దూరం చేసి సందేహాలు రావు. ఆమెకు కొత్త కాపురానికి ప్రేమగా ఆహ్వానించటం అబ్బాయి బాధ్యత కూడా. ఈ ఇచ్చిపుచ్చుకొనే మాటలు భార్యాభర్తల సంసార జీవితానికి గట్టి పునాది.

ఇక పోతే అమ్మాయి విషయంలో పుట్టింట స్వేచ్ఛగా అమ్మా నాన్న ఆదరణతో, ప్రేమతో ఎలాంటి బాధ్యతలు లేకుండా పెరిగిన అమ్మాయికి అత్తగారింట్లో అలవాటు పడేందుకు కాస్త సమయం పడుతుంది. అందుకే ఒక కొత్త జీవితం రాక ముందే తనను తాను సిద్ధం చేసుకోవాలి. భావోద్వేగాలు అదుపులో పెట్టడం నేర్చుకోవాలి. ముందుగా అత్తగారు, ఆడపడుచులు తనను కన్నవాళ్ళ వంటి వాళ్ళే అన్న పాజిటివ్ భావనతో ఆ ఇంట్లో అడుగు పెట్టాలి. అత్త పాత్రలో కొత్తగా ఇమడాలి వరుని తల్లి.

> ఒక కొత్త జీవితం రాక ముందే తనను తాను సిద్ధం చేసుకోవాలి. భావోద్వేగాలు అదుపులో పెట్టడం నేర్చుకోవాలి. ముందుగా అత్తగారు, ఆడపడుచులు తనను కన్నవాళ్ళ వంటి వాళ్ళే అన్న పాజిటివ్ భావనతో ఆ ఇంట్లో అడుగు పెట్టాలి.

కోడలుగా ఆమెను అంగీకరించాలి. కోడలు కొడుకు జీవితంలోకి అడుగుపెట్టి అతని జీవితంలో వెన్నెల కురిపించబోయే కోడలి పాత్రను అత్తగారు అర్థం చేసుకోవాలి. స్వయంగా ఈ ఇద్దరు కూడా ఒకళ్ళనొకళ్ళు మెప్పించుకోవలిసిందే ఇప్పటి వరకు అలవాట్లు పద్ధతులు ఎవరికి వారుగా ఉన్నప్పటికీ, ఒక కొత్త జీవితంలో వీటినీ ఇద్దరూ అనుకూలంగా మార్చుకొనే ప్రయత్నం మొదటి ఘడియ నుంచి మొదలు పెట్టాల్సిందే. వరుడి కుటుంబం అమ్మాయి అందచందాలు చదువు, కుటుంబ నేపథ్యం ఎంచి చూసుకొన్నట్లు. ఆమె అప్పటివరకు ఏర్పరుచుకొనే అలవాట్లు, డ్రెస్సింగ్ పద్ధతి, ఇష్టమైన భోజనం, ఇవన్నీ ముందే తెలుసుకొంటే రాబోయే వధువు కోసం తమ ఇంట్లో ఆమెకు తగిన సదుపాయాలు కల్పించవచ్చు. ఇది కేవలం ఇచ్చు పుచ్చుకొనేదే. ప్రేమ ఇస్తే ప్రేమ తిరిగి వస్తుంది.

సంసార జీవితంలో ప్రారంభంలోనే తొలి అడుగులోనే భార్యాభర్తల అనుబంధానికి బలమైన పునాది పడాలి. ఒకరికోసం మరొకరు జీవిస్తామన్న భరోసా ఒక్కటి చాలు. వాళ్ళ జీవితాన్ని సంతోషమయం చేసేందుకు భర్త పట్ల పరిపూర్ణమైన విశ్వాసం భార్యకు, భార్య పట్ల సమానమైన గౌరవం భర్తకు ఉంటే చాలు. ఇద్దరు వ్యక్తుల భిన్నమైన సంస్కారాలతో పెరిగి, భిన్నమైన మహాభావాలతో ఉండి ఒకరుగా గడిపేందుకు ఈ బంధంలోకి అడుగు పెడుతున్నామనే ఎరుక ఇద్దరిలో ఉండాలి. ఒకరికొకరు గౌరవించుకోవడం చాలా ముఖ్యం.

ఎలాంటి మనిషి దగ్గర నుంచి ఏం కోరుకొంటారో, దాన్ని అదేస్థాయిలో తిరిగి ఇవ్వాలని కోరుకోవాలి. నేను అన్న భావన మాయమై మేము అన్న మాట గుండెల్లో మారుమోగాలి. డబ్బు, హోదా మాత్రమే కాక సమయం ఇవ్వాలని గుర్తు పెట్టుకోవాలి. ఇద్దరు ఎవరి జీవితంలో వారున్నా, ఇద్దరికీ కెరీర్‌లో ఎవరి ప్రయారిటీలు వారికి ఉన్నా, ఇద్దరికీ సంబంధించిన ఒక ప్రత్యేకమైన సమయంలో ఇద్దరూ ఒకరుగానే ఉండాలి, మెలగాలి, గౌరవించుకోవాలి, ప్రేమించుకోవాలి. దాంపత్యాన్ని రక్షించేది పరస్పర ప్రేమ మాత్రమే!

సి. అపర్ణ



ఎప్పుడూ మొదటి వరుసలోనే..

ఉద్యోగ జీవితం ఎప్పుడూ సవాళ్ల మయమే. ఎంతోమంది సహోద్యోగులతో కలిసి పనిచేయాలి. ఎన్నో పొరపాట్లు జరుగుతూ ఉంటాయి. అవి మన కెరీర్ పైన కూడా ప్రభావం చూపెడతాయి. కానీ కొంత జాగ్రత్తతో తెలివిగా మెలిగితే ఉద్యోగ సోపానాలు తేలికగా ఎక్కేయచ్చు. ఏదైనా ఒక ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలిసి వచ్చినప్పుడు, కొత్త పని చేయవలిసివచ్చినప్పుడు ఎప్పుడూ సహోద్యోగ సలహాలు తీసుకోకూడదు. మన ఉద్యోగం పట్ల మన బాధ్యత పట్ల మనకే ఒక స్పష్టత ఉండాలి. ఉద్యోగంలో చేరగానే అక్కడ నియమ నిబంధనలు తెలియకపోవచ్చు. సంస్థ పెద్దవో చిన్నదో దానికి పరిధులు నియమాలు ఉంటాయి. వాటిని తెలుసుకుని అర్థం చేసుకుని ఉద్యోగంలో ఇమిడిపోయే ప్రయత్నం చేయాలి. అన్నింటికంటే ముఖ్య విషయం ధైర్యం. చాలా మంది అమ్మాయిలు స్కూల్ లాగా ఆఫీసుల్లో కూడా వెనక ఉండేందుకు సీనియర్లు ఉన్నతాధికారుల ముందు నోరు విప్పకుండా ఉండేందుకే ప్రయత్నిస్తారు. కానీ ఉద్యోగ జీవితం ఒక భవిష్యత్తు. తెలివితేటలు నిరూపించుకుని ముందుకువెళ్ళే రాజమార్గం. ఎప్పుడూ ముందే ఉండాలి. మిమ్మల్ని మీరే ఆవిష్కరించుకోవాలి. అప్పుడే అద్భుతమైన కెరీర్ దక్కుతుంది.

అలిసిన ముఖానికి ప్యాక్!

రోజంతా పనిచేసేటప్పటికి ముఖం అలిసిపోయి ఉంటుంది. దీంతో నిర్జీవంగా మారిపోతుంది. మరి ఇలాంటప్పుడు ముఖాన్ని తాజాన్ని ఉంచడానికి క్యారట్ మాస్క్ చక్కగా పనిచేస్తుందంటున్నారు నిపుణులు. జిడ్డు చర్మం, సాధారణ చర్మతత్వం ఉన్నా ఈ మాస్క్ చక్కగా ఉపయోగపడుతుంది. రెండు క్యారెట్లు నీళ్ళలో ఉడకనిచ్చి చల్లార్చి మెత్తని గుజ్జుగా గ్రైండ్ చేయాలి. దానికి నాలుగు స్పూన్లు తేనె, ఒక స్పూన్ ఆలివ్ ఆయిల్, కొద్ది చుక్కల నిమ్మరసం కలిపి దీన్ని మాస్క్‌లా వేసుకుని ఓ అరగట అలా వదిలేయాలి. ఆ తర్వాత చన్నీళ్ళతో కడుక్కోవాలి. వారానికి మూడు సార్లు ఈ ప్యాక్ వేసుకోవాలి. క్యారెట్‌లో గ్లూకోజ్, ఐరన్, కాఫర్, విటమిన్ ఇ,డి,కేలతో పాటు బీటాకెరోటిన్ ఉంటుంది. ఈ ప్యాక్ తో చర్మం సహజంగా మెరుస్తూ ఉంటుంది.





ఆఖరివరకూ వాడితే ముప్పు..

కొద్ది పాటి మేకప్ ఉంటేనే మొహం తాజాగా ఉంటుంది. ఒక్కోసారి ఈ మేకప్ తో ర్యాష్ ఎలర్జీలు వస్తాయి. అంటే మేకప్ కు వాడే కాస్మోటిక్ లో ప్రిజర్వేటిక్స్ ప్రభావం తగ్గిపోయిందనుకోవాలి. నీటి ఆధారిత పౌండేషన్‌లు ఒక ఏడాది , నూనె ఆధారిత ఫౌండేషన్ లు 18 నెలల దాకా వాడుకోవచ్చు. తప్పని సరిగా స్పాంజ్, బ్రష్ వాడాలి. వేళ్ళు వాడితే కలుషితం అవుతాయి. ఫేస్ ఫౌండర్ లో పౌడర్ బ్రష్ ఆన్స్, పౌడర్ ఐ షాడోలు రెండు మూడేళ్ళు వాడుకోవచ్చు.లిప్ కలర్స్ వాసనలో తేడావస్తే మార్చేయాలి. చక్కని శిరోజాలకు సంబంధించిన వస్తువులు అయిపోయేదాకా వాడటం కూడా సమస్యే .కాలపరిమితి చూసుకుంటే మంచిదని అంటున్నారు నిపుణులు.

చిట్కాలు

* జామ ఆకుల్ని నమిలితే పంటినొప్పి చిగుళ్ళనొప్పులూ కూడా తగ్గుతాయట. అలాగే అరటిపండుతొక్క లోపలి పొరను తీసి పచ్చగా ఉన్న దంతాలమీద రోజూ రెండు నిమిషాలపాటు రుద్దితే అందులోని పొటాషియం, మెగ్నీషియం కారణంగా తెల్లగా మెరుస్తాయట.

* జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్, వాకింగ్... వంటి వ్యాయామాలను కనీసం రోజు విడిచి రోజు చేసినా కూడా మంచిదే. ముఖ్యంగా వీటివల్ల మంచి నిద్ర పడుతుందట.

చామదుంప కడీ

కావాల్సిన పదార్థాలు: మీడియం సైజు చామదుంపలు: 5, శనగపిండి: 2 టేబుల్ స్పూన్లు, పుల్లని పెరుగు: 1 కప్పు, నీళ్లు: 3 కప్పులు, కార్న్‌ఫ్లోర్ : 1 టీ స్పూన్, కారంపొడి: 1/2 టీ స్పూన్, పొడవుగా కట్ చేసిన మిర్చి: 2, పసుపు: 1/2టీ స్పూన్, ఉప్పు : రుచికి తగినంత.

తాలింపుకు కావాల్సిన వస్తువులు: నూనె: 1టేబుల్ స్పూన్, నెయ్యి: 1టీ స్పూన్, కరివేపాకులు: 3లేదా 4, వాము: 1/2 టీ స్పూన్, జీలకర్ర: 1/2 టీ స్పూన్, ఆవాలు:1/2 టీ స్పూన్, ఇంగువ: చిటికెడు, ఎండుమిర్చి: 2, కారంపొడి: 1/4 టీ స్పూన్.

తయారుచేసే పద్ధతి: ఒక గిన్నెలో శనగపిండి, పెరుగు, నీళ్లు, కారంపొడి, పసుపు, ఉప్పు కలపండి. హ్యాండ్ బ్లెండరోతో బ్లెండ్ చేయండి. చామదుంపలను తొక్క తీసి కడిగి పొడవుగా కట్ చేసుకోవాలి. ఒక నాన్‌స్టిక్ కడాయిలో నూనె వేడిచేసి ముందుగా చామదుంపలను ఫ్రై చేసి పక్కన పెట్టండి. మిగిలిన నూనెలో ఇంగువ, జీలకర్ర, ఆవాలు, వాముతో తాలింపు వేసి శనగపిండి ముద్ద వేసి మీడియం మంటపై చిక్కగా అయ్యేవరకు ఉడికించాలి. ఇందులో చామదుంపల ముక్కలు కూడా వేయండి. కడీ అయిపోగానే ఒక బౌల్‌లో తీసు కోవాలి. కొద్దిగా నెయ్యి వేడి చేసి ఎండుమిర్చి, కారంపొడి తాలింపు వేసి తర్వాత సర్వ్ చేయాలి.



కుదిరితే కుంకుమ పువ్వు

కుంకుమపువ్వు చలి, జలుబుకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. కుంకుమ పువ్వు కలిపిన పాలను జలుబు చేసినప్పుడు నుదురు మీద రాసుకుంటే, ఉపశమనం లభిస్తుంది. ఈ పువ్వులో శరీరానికి వేడిని అందించే గుణాలుంటాయి.

జ్ఞాపకశక్తి: కుంకుమపువ్వు కలిపిన పాలు తాగితే మెదుడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తిని మెరుగుపరిచి, వయసు పైబడడం వల్ల వచ్చే మతిమరుపును తగ్గిస్తుంది. ఆక్సిడేటివ్ ఒత్తిడిని నిలువరిస్తుంది.

నొప్పి నివారణ: బహిష్టు సమయంలో పొత్తి కడుపులో నొప్పి తగ్గాలంటే కుంకుమపువ్వు కలిపిన పాలు తాగాలి. దీనిలో నొప్పిని నివారించే గుణాలుంటాయి. దాంతో కొంత ఉపశమనం పొందుతారు.

నిద్రలేమి: కుంకుమ పువ్వులోని క్రొసిన్, సాఫ్రనాల్, పిక్రోక్రోసిన్ వంటి ప్రొటీన్ యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. పాలలో లేదా టీలో కుంకుమ పువ్వు కలుపుకొని తాగితే నిద్రలేమి సమస్య దరిచేరదు. మానసిక ఒత్తిడిని పోగొడుతుంది.

కుంకుమపువ్వులో మాంగనీస్ ఎక్కువగా ఉంటుంది. ఇది నిద్ర చక్కగా పట్టేలా చేస్తుంది.



గుండె ఆరోగ్యం: రక్త ప్రసరణ సవ్యంగా జరిగేందుకు, రక్తనాళాలు కుచించుకుపోకుండా కుంకుమపువ్వు చూస్తుంది. కుంకుమపువ్వులోని లక్షణాలు రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె సంబంధ వ్యాధులు వచ్చే ముప్పును నివారిస్తాయి.

కఠినంగా ప్రవర్తిస్తున్నారా..?

తల్లిదండ్రులంతా తమ పిల్లల్ని ఎంతగానో ప్రేమిస్తారు. వాళ్ళ భవిష్యత్తు ఎంతో బాగుండాలనే కోరుకుంటారు. అయితే కొందరే తమ పిల్లల మనసుల్ని అసలే మాత్రం నొప్పించకుండా ఎంతో ప్రేమగా పెంచుతారు. కానీ మరి కొందరు మాత్రం అల్లరి చేస్తున్నారనో సరిగ్గా చదవడం లేదనో కొడుతూ తిడుతూ పెంచుతుంటారు. ఇలా పిల్లల పట్ల కఠినంగా ప్రవర్తించడం వల్ల అది వాళ్ల మనసుమీదే కాదు, శారీరక ఆరోగ్యం మీదా ప్రభావం కనబరుస్తుందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం వీళ్లు 451కుటుంబాల్ని పరిశీలించారట. కఠినంగా వ్యవరించే తల్లిదండ్రుల ప్రవర్తన ఆ పిల్లల మెదడు పెరుగుదల మీద కనిపించదట. ఫలితంగా వాళ్లు దాదాపు రెండు దశాబ్దాల పాటు ఒత్తిడికి గురయినట్లు తెలుస్తోంది. అంతేకాదు, కొంతమంది పిల్లల హార్మోన్లలో హెచ్చుతగ్గులూ కనిపించాయని చెబుతున్నారు. దాంతో కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా కౌమారదశలో కొందరు పిల్లలు అతిగా తినడంతో ఊబకాయులుగా మారినట్లు గుర్తించారు. అలాగే మరికొందరు ధూమపానానికీ మద్యానికీ అలవాటు పడ్డారట. కాబట్టి పిల్లల మానసిక, శారీరక ఆరోగ్యానికి తల్లిదండ్రుల పెంపకమే కారణమనీ, వీలయినంత వరకూ సంబంధిత పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.





క్యాన్సర్‌కు వ్యతిరేకంగా ఇస్కాన్ 5కె రన్

ప్రారంభించిన కోలేటి దామోదర్ గుప్తా

మనతెలంగాణ/హైదరాబాద్: క్యాన్సర్‌ను తరిమి వేసేందుకు ఇస్కాన్ ఉద్యమం ప్రారంభించింది. క్యాన్సర్ మహమ్మారి పై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంపొందించేందుకు కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా ఆదివారం నెక్లెస్ రోడ్ నుంచి ట్యాంక్ బండ్ మీదుగా విద్యార్థులతో రన్ నిర్వహించింది. క్యాన్సర్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రముఖ ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 8 వేల మంది విద్యార్థులతో 5కెరన్ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసి ంగ్ కార్పోరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా పాల్గొన్నారు. అనేక జీవితాలను నాశనం చేస్తున్న క్యాన్సర్‌ను తరిమివేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని కోలేటి దామోదర్ గుప్తా ఈ సందర్భంగా పిలుపు ఇచ్చారు.

అందోలు చెరువులో అరుదైన చేప



మన తెలంగాణ /సంగారెడ్డి /జోగిపేట : సంగారెడ్డి జిల్లా అందోలు పెద్ద చెరువులో మత్స్యకారులకు వింతైన చేప లభించింది. ఎప్పటిలాగే ఆదివారం చెరువులోకి మత్స్యకారులు వేటకు వెళ్లగా వలలో అనుకోకుండా వింత అకారంలో చేప లభించడంతో దాన్ని చెరువు ఒడ్డుకు చేర్చారు. బూడిద రంగులో ఉండి నలుపు, తెలుపు మచ్చలతో ఉన్న చేపను చూసి అందరు ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు చూసేందుకు అక్కడికి చేరుకున్నారు. అనంతరం మత్స్యకారులు తిరిగి దానిని చెరువులోకి వదిలిపెట్టారు. ఈ చేప దాదాపుగా కిలోకు పైగా ఉంటుందని వారు తెలిపారు. ఇలాంటి చేపను చూడటం ఇదే మొదటిసారని పలువురు చెప్పారు.

మూడింట సమాచారం తొలగించాం!

మన తెలంగాణ/హైదరాబాద్: ఎన్నికల పిటిషన్ దాఖలైన వికారాబాద్ నియోజకవర్గంకు సంబంధించిన మూడు కంట్రోల్ యూనిట్ (సియూ)ల లోని సమాచారాన్ని తొలగించినట్లు ఆ జిల్లా ఎన్నికల అధికారి సయ్యద్ ఒమర్ జలీల్ స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నివేదించారు. ఈ నెల 1వ తేదీ నుంచి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించిన ఇవిఎంలకు మొదటి దశ తనిఖీల ప్రక్రియ చేపట్టాలని సిఇఒ రజత్ సంబంధిత జిల్లా ఎన్నికల అధికారులు జనవరి 31వ తేదీన ఆదేశించారు.

జీవ వ్యర్థాలతో ముప్పు

- **నగరంలో 50 టన్నుల ఉత్పత్తి, 15 టన్నులే శుద్ధి కేంద్రాలకు**
- **మిగతాది నాలాలు, చెత్తకుండీ, బహిరంగ ప్రదేశాల్లో..**

మన తెలంగాణ/హైదరాబాద్ : జీవ వ్యర్థాల (బయో మెడికల్ వేస్ట్) నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రతి రోజు 50 టన్నులు ఉత్పన్నమవుతుందని పిసిబీ అధికారులు లెక్కతేల్చారు. ఈ వేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం వలన పర్యావరణానికి హాని కలుగుతోందని అధికారులు హెచ్చరిస్తున్నారు. మెడికల్ హబ్‌గా మారుతున్న హైదరాబాద్ నగరం జీవ వ్యర్థాల వలన మరిన్ని అంటువ్యాధులు వచ్చే అవకాశముందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టానిక్ సీసా, సూదులు తదితర వాటితో అంటువ్యాధులు ప్రబలే అవకాశముందని వారు పేర్కొంటున్నారు. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రతిరోజు 50 టన్నుల జీవ వ్యర్థాలు ఉత్పన్నమవుతుండగా, రాష్ట్ర వ్యాప్తంగా మరో 20 నుంచి 30 టన్నుల వరకు ప్రతి రోజు బయటకు వస్తుందని పిసిబీ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉత్పన్నమయ్యే 50 టన్నుల జీవ వ్యర్థాల్లో 15 టన్నులు మాత్రమే శుద్ధి కేంద్రాలకు తరలిస్తున్నారని, మిగతాది చెత్తకుండీలో వేస్తున్నట్టు గతంలో అధికారులకు ఫిర్యాదులు అందాయి. పలు ఆస్పత్రులు జీవ వ్యర్థాలను చెత్తలో వేయడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని, దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని పిసిబీ అధికారులు గతంలో ఆస్పత్రులకు నోటీసులు జారీ చేశారు. జీవవ్యర్థాలను ఆస్పత్రుల నుంచి తరలించడానికి పలు సంస్థలు కాంట్రాక్టును దక్కించుకున్నాయి. ఒక్కో ఏజెన్సీకి 10 వేల బెడ్ల నుంచి ఆస్పత్రి వ్యర్థాలను సేకరించేందుకు అనుమతిని ఇస్తారు.

బెడ్డుకు 3నుంచి 4 రూపాయల చొప్పున..

ప్రస్తుతం ఆ సంస్థలో చేసే సిబ్బంది ప్రతి ఆస్పత్రికి వెళ్లి జీవ వ్యర్థాలను ఆస్పత్రి నుంచి శుద్ధి కేంద్రాలకు తరలిస్తుంటారు. ఒక్కో బెడ్డుకు మూడు నుంచి నాలుగు రూపాయల చొప్పున ఆ సంస్థకు ప్రతి ఆస్పత్రి చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొన్ని ఆస్పత్రులు డబ్బులు చెల్లించకుండా తప్పించుకోవడానికి చెత్త కుండీ, నాలాలు, బహిరంగ ప్రదేశాల్లో జీవ వ్యర్థాలను పడేస్తున్నారని, దీనివలన పర్యావరణానికి హాని కలుగుతుందని పర్యావరణ వేత్తలు ఆరోపిస్తున్నారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేశారని ఫిర్యాదులు అందడంతో పలు ఆస్పత్రులకు గతంలో పిసిబీ నోటీసులు సైతం జారీ చేసింది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు 4 వేలకు పైగా ఉన్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఆస్పత్రుల్లో ఉన్న బెడ్డు నుంచి సగటున 300 నుంచి 400 గ్రాముల వరకు జీవ వ్యర్థాలు వెలువడుతున్నట్టు పిసిబీ లెక్కలు వేసింది. అందులో కొన్ని ఆస్పత్రులు వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో కాకుండా చెత్తతో కలిపి పారేస్తున్నారు. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ చట్టం 1998 ప్రకారం ఆస్పత్రుల్లో రోజువారీగా వెలువడుతున్న చెత్తను వేర్వేరు డబ్బాల్లో నింపాలి. 48 గంటలకు మించి ఆస్పత్రుల్లో నిల్వ ఉంచరాదు. వీటిని శాస్త్రీయ పద్ధతుల్లో రీ సైక్లింగ్ చేసేందుకు ప్రత్యేకంగా నెలకొల్పిన కేంద్రాలకు తరలించాలి. రవాణా సమయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని చట్టం చెబుతోంది. చట్టం ప్రకారం ఆస్పత్రులు నడుచుకోవడం లేదని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలు, నాలాల్లో పడేస్తుండడంతో అంటువ్యాధులు సోకే అవకాశం ఉందని అధికారులు ఆస్పత్రులకు జారీ చేసిన నోటీసుల్లో హెచ్చరించారు. వ్యర్థాలను వేర్వేరు డబ్బాల్లో నింపే విషయంలోనూ పలు ఆస్పత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పిసిబీ అధికారుల తనిఖీల్లో వెల్లడయినట్టు తెలిసింది.

పిసిబీ అధికారులు గుర్తించినవి...

ఆస్పత్రులు విధిగా తమకు అందుబాటులో ఉన్న బెడ్లకు బయోవ్యర్థాల సెస్‌ను చెల్లించడం లేదు. బెడ్ల లెక్కలను తక్కువ చేసి చూపుతున్నాయన్న విషయమై అధికారుల తనిఖీలో వెల్లడయ్యింది. ఆస్పత్రి వ్యర్థాలు సేకరించేందుకు ప్రాంతాల వారీగా బాధ్యతలు అప్పగించకపోవడంతో ఏజెన్సీల మధ్య అనారోగ్యకర పోటీ నెలకొనడాన్ని ఆస్పత్రి యాజమాన్యాలకు కలిసి వస్తుందని అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ఆస్పత్రులు రోజు వారీగా ప్రతి బెడ్‌కు రూ.2.50 నుంచి రూ.4 వరకు విధిగా చెల్లించడం లేదని, వేర్వేరు డబ్బాల్లో వ్యర్థాలను నింపే పద్ధతిని కూడా ఆస్పత్రులు పాటించడం లేదని ఏజెన్సీలు ఇప్పటికే పిసిబీకి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ప్రస్తుతం నోటీసులు జారీ చేసిన సంస్థలకు నెల నుంచి రెండు నెలల పాటు సమయం ఇస్తారు. అంతలోపు పిసిబీ సూచించిన విధంగా మార్పులు చేసుకోకపోతే వాటిపై చర్యలు తీసుకునే వీలు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



ఆస్పత్రి నుంచి వ్యర్థాల్లో ఎక్కువగా...

హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులు వాడి పడేసిన సూదులు, బ్లేడ్లతో పాటు చీము, రక్తం తుడిచిన కాటన్‌ను బయట పడేస్తున్నారు. ఆస్పత్రి వ్యర్థాలను బయట పడేయడంతో బ్యాక్టీరియా, వైరస్ తొందరగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.





ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలహాబాద్(ప్రయాగ్‌రాజ్)లో గంగానది ప్రాంతంలో సంగం జరుగుతున్న ప్రాంతం ఇప్పుడు ఒక మహానగరిని తలపిస్తోంది. మౌని అమావాస్య నేపథ్యంలో పవిత్ర స్నానాలు ఆచరించేందుకు భక్తులు ఇక్కడికి భారీగా తరలివస్తున్నారు. దీంతో కుంభమేళా పరిసర ప్రాంతాలు జనసంద్రమవుతున్నాయి. దీనికి తగ్గట్టుగా అధికారులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరిచారు.

కలకత్తా కాళిక

మొదటిపేజీ తరువాయి...

పోలీసు కమిషనర్ నివాసం వెలుపలి స్థానిక పోలీసు బెటాలియన్లు అడ్డుకున్నాయి. ఐదుగురు సిబిఐ అధికారులను అరెస్టు చేసి, వారిని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళ్లి తరువాత విడుదల చేశారు. రోజ్ వాలీ, శారదా చిట్‌ఫండ్ పోంజీ స్కీం కుంభకోణాలకు సంబంధించి కేంద్రీయ దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణ జరుపుతోంది. ఇంతకు ముందు వెలువరించిన నోటీసుల ఆధారంగా చిట్‌ఫండ్ స్కాంకు సంబంధించి పోలీసు కమిషనర్ రాజీవ్ కుమార్‌ను విచారించేందుకు సిబిఐ బృందం చేరుకుంది. ఈ కేసుకు సంబంధించి కొన్ని అంశాలపై కమిషనర్‌ను విచారించాల్సి ఉందని సిబిఐ అధికారులు పట్టుపట్టారు. అయితే వారిని లోపలికి వెళ్లేందుకు అనుమతించేది లేదని అక్కడ భద్రతా ఏర్పాట్లలో ఉన్న పోలీసులు స్పష్టం చేశారు. దీనితో ఇరువర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. ఇది తీవ్రస్థాయి ఉద్రిక్తతకు దారితీసి, చిట్టచివరికి ఈ ప్రాంతానికి రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ తమ అధికార సిబ్బందితో కార్ల కాన్వాయ్‌తో హుటాహుటిన చేరుకునే వరకూ దారితీసింది. బెంగాల్‌లో సిబిఐ విచారణ ప్రక్రియకు అనుమతి లేదని, వారిని అనుమతించేది లేదని పేర్కొంటూ పోలీసు అధికారులు అక్కడికి వచ్చిన సిబిఐ బృందాన్ని అడ్డుకున్నారు. ఈ దశలో ఇరుపక్షాల మధ్య దాదాపుగా బాహాబాహీ స్థితి నెలకొంది. కోల్‌కతా పోలీసులు కొందరు సిబిఐ అధికారులను తమ అదుపులోకి తీసుకుని వారిని సమీప షేక్స్‌పియర్ సరానీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీనితో పరిస్థితి మరింతగా దిగజారింది. సెంట్రల్ కోల్‌కతాలోని లౌడాన్ స్ట్రీట్‌లో పోలీసు కమిషనర్ నివాసం ఉంది. అక్కడికి సిఎం మమత బెనర్జీ హుటాహుటిన చేరుకున్నారు. నగర పోలీసు కమిషనర్‌కు తమ సంఘీభావం ప్రకటించారు. ఆవేశంతో కదిలిపోతూ మమత బెనర్జీ అక్కడనే నిలబడి సిబిఐ వైఖరిపై నిప్పులు చెరిగారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ పావుగా సిబిఐ వ్యవహరిస్తోందని కలకత్తా కాళికలాగా మండిపడ్డారు. కొద్ది సేపు అక్కడనే భైఠాయించారు. పోంజీ స్కీంకు సంబంధించిన కొన్ని కీలక పత్రాలు మాయం అయ్యాయని,





దీనిపై తాము కమిషనర్‌ను విచారించాల్సి ఉందని, ఒకరోజు నుంచే ఆయన కోసం గాలిస్తున్నామని, తప్పించుకు తిరుగుతున్నాడని సిబిఐ ఆరోపించింది. అందుకే నివాసానికి వచ్చామని వాదించారు.తమను సెంట్రీలు, పోలీసులు అడ్డుకున్నారని సిబిఐ వారు విమర్శించారు. సిబిఐ బృందం భారీ ఎత్తున వచ్చిందని తెలియగానే క్షణాలలోనే అక్కడికి పోలీసు అధికారులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సిబిఐ అధికారులతో వాదనకు దిగారు. కమిషనర్ కుమార్‌ను విచారించేందుకు అవసరం అయిన అనుమతి పత్రాలు ఉన్నాయా? అని నిలదీశారు. దీనితో వారి నుంచి ఎటువంటి ప్రత్యుత్తరం లేక పోవడం, లోపలికి వెళ్లేందుకు యత్నిచడంతో వారిని పోలీసు అధికారులు నిలిపివేశారు. ఈ తరుణంలోనే ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇది జరుగుతూ ఉండగానే అక్కడనే ఉన్న కొందరు సిబిఐ అధికారులను పోలీసులు స్థానిక స్టేషన్‌కు తీసుకువెళ్లారు. వారు ఎందుకు వచ్చింది తెలుసుకునేందుకు స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే తాము ప్రస్తుత ఘటనపై ఏమీ మాట్లాడదల్చుకోలేది, ఇక్కడ ఇప్పుడు మౌనం పాటిస్తామని కమిషనర్ ఇంటి ఎదుటనే నిలిచిన సిబిఐ అధికారి ఒకరు వార్తా సంస్థలకు తెలిపారు. ఓ వైపు సిబిఐ బృందం, మరో వైపు పోలీసు బలగాలతో , ఇదే దశలో అక్కడ స్వయంగా సిఎం మమత బెనర్జీ ధర్నా, సిబిఐ వైఖరిని నిరసిస్తూ మాట్లాడటంతో తీవ్రస్థాయిలో అక్కడ గందరగోళం నెలకొంది. సిఎం మమత జరిపిన ధర్నాలో పోలీసు కమిషనర్ కూడా వచ్చి చేరారు.

అజిత్ దోవల్ ఆదేశాలతోనే : మమత ధ్వజం

కమిషనర్ ఇంటివద్ద జరుగుతున్న రగడ గురించి తెలియగానే మమత బెనర్జీ తీవ్రంగా స్పందించారు. దేశంలోని అన్ని వ్యవస్థలపై కేంద్రం దాడికి దిగుతోందని బిజెపి వారు పోలీసులను తమ అదుపులోకి తెచ్చుకునేందుకు, ప్రత్యర్థులను బెదిరించేందుకు ఇటువంటి చర్యలకు దిగుతున్నారని అంటూ వెంటనే తమ బృందంతో అక్కడి నుంచి నేరుగా కమిషనర్ నివాసానికి వెళ్లారు. అజిత్ కేంద్ర జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పశ్చిమ బెంగాల్ సిఎం మమత బెనర్జీ విమర్శించారు. ప్రధాని మోడీ ఏరి కోరి రాజకీయ ప్రత్యర్థులపై దాడికి వ్యూహ రచనకు దిగారు. ఇందులో భాగంగానే ధోవల్‌కు పూర్తి అధికారాలు కల్పించారు. సిబిఐ జరుపుతోన్న దాడులు ఇందులో భాగమే. ఇది కేవలం ఇక్కడి పోలీసు కమిషనర్‌కు వ్యతిరేకంగా జరిగిన దాడి కాదని, ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వంపై జరిగిన దాడి అని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ పేరిట కోల్‌కతా మెట్రో ఛానల్ వద్ద చేపట్టిన ధర్నాలో మమత పాల్గొన్నారు. మరోవైపు తాజా పరిణామాలపై ఎపి సిఎం చంద్రబాబు స్పందించారు. మమతకు తాము అండగా ఉంటామని అన్నారు. బిజెపి నిరంకుశ పాలన చేస్తుందని అఖిలేష్ అన్నారు.

స్పందించలేదనే వచ్చాం : సిబిఐ

తాము పోలీసు కమిషనర్‌కు పలు సార్లు నోటీసులు జారీ చేశామని, కేసు దర్యాప్తునకు సహకరించాలని కోరామని అయితే ఎటువంటి స్పందనా లేదని సిబిఐ అధికారి ఒకరు చెప్పారు. స్కామ్‌లకు సంబంధించి పశ్చిమ బెంగాల్ పోలీసు ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు జరిపింది. దీనికి ఐపిఎస్ అధికారి హోదాలో రాజీవ్ కుమార్ నాయకత్వం వహించారు. దీనికి సంబంధించి మాయం అయిన పత్రాలపై ఆయనను విచారించాల్సి వచ్చిందని సిబిఐ బృందం తెలిపింది. అయితే ఆయన తమ ఎదుట హాజరు కావాల్సిందనే ఆదేశాలు ఉన్నప్పటికీ బేఖాతరు చేశారని, అరెస్టు భయంతో తప్పించుకు తిరుగుతున్నాడని సిబిఐ బృందం తెలిపింది. అనివార్య స్థితిలోనే ఫైళ్ల గురించి ఆరా తీసేందుకు తాము ఇక్కడికి రావాల్సి వచ్చిందని వివరణ ఇచ్చారు. రాజీవ్ కుమార్ 1989 పశ్చిమ బెంగాల్ ఐపిఎస్ బ్యాచ్ అధికారిగా ఉన్నారు. ఆయన రెండు రోజులుగా విధులకు రావడం లేదని, చివరికి లోక్‌సభ ఎన్నికలకు రాష్ట్రంలో సంసిద్ధత, ఏర్పాట్ల సమీక్ష భేటీకి కూడా రాలేదని తెలిసిందని, అందుకే నివాసానికి వచ్చామని తెలిపారు.

విధులకు రావడం లేదనేది ఉత్తిదే : పోలీసు విభాగం

నగర పోలీసు కమిషనర్ విధులకు గైర్హాజరుఅయినట్లు సిబిఐ వారు చెప్పడాన్ని నగర పోలీసు వర్గాలు ఖండించాయి. సాయంత్రం ఒక ప్రకటన వెలువరించాయి. కమిషనర్ నగరంలోనే ఉన్నారు. సాధారణంగానే క్రమం తప్పకుండా విధులకు హాజరవుతున్నారు. ఇది నిజం, కాదని ఢిల్లీ నుంచి వచ్చిన సిబిఐ వారు ఏ విధంగా చెపుతారు? కేవలం ఆయన జనవరి 31వ తేదీన ఆయన లీవ్‌పై వెళ్లారు. తరువాత విధులలోనే ఉంటూ వస్తున్నారు. ఎటువంటి నిర్ధారణ లేకుండా అవాస్తవాలు ప్రచారం జరుగకుండా ప్రకటన వెలువరిస్తున్నట్లు పోలీసు విభాగం తెలిపింది. సిబిఐ వ్యవహార శైలి సరిగ్గా లేదని, నగర పోలీసు కమిషనర్‌ను, నగర పోలీసులను కించపరిచే , అప్రతిష్ట పాలు చేసే విధంగా వ్యవహరిస్తోన్న సిబిఐ అధికారులపై చట్టపరమైన చర్యలకు దిగాల్సి ఉంటుందని ఈ ప్రకటనలో హెచ్చరించారు.

కమిషనర్ అడ్డుకుంటున్నారు : సిబిఐ చీఫ్

కోల్‌కతా నగర పోలీసు కమిషనర్ దర్యాప్తు ప్రక్రియను అడ్డుకుంటున్నారని అందుకే చర్యకు దిగామని సిబిఐ ప్రస్తుత డైరెక్టర్ ఎం నాగేశ్వర రావు చెప్పారు. రాజీవ్ కొన్ని సాక్ష్యాలను ధ్వంసం చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలిపే కీలక సాక్ష్యాలు ఆధారాలు ఉన్నాయని అన్నారు. విచారణను దారి తప్పించేందుకు కుమార్ యత్నిస్తున్నారని, ఫైళ్ల గురించి ఆరా తీసేందుకు రంగంలోకి దిగినట్లు వివరించారు. ఆధారాలను దెబ్బతీసే వారిని ప్రశ్నించడం ఆనవాయితీ అని తెలిపారు.

సుప్రీంకు వెళ్లనున్న సిబిఐ?

బెంగాల్‌లో విధుల నిర్వహణకు వెళ్లిన అధికారులపై చర్యల పట్ల సిబిఐ తీవ్రంగా స్పందించింది. సిబిఐ అధికారులను అటకాయించడం వారిలో కొందరిని అరెస్టు చేయడం, పోలీసు జీపులలో స్టేషన్లకు తరలించడం వంటి చర్యలను జాగ్రత్తగా పరిశీలించుకుని దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టుకు వెళ్లే విషయం పరిశీలిస్తున్నట్లు సిబిఐ డైరెక్టర్ నాగేశ్వర రావు తెలిపారు. న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆదివారం నాటి పరిణామాలపై వివరించేందుకు తమకు అవకాశం ఇవ్వాలని సిబిఐ వర్గాలు బెంగాల్ గవర్నర్ కేషరి నాథ్ త్రిపాఠీని కోరాయి. అన్ని అంశాలను తాము గవర్నర్‌కు వివరిస్తామని, న్యాయానికి అభ్యర్థిస్తామని చెప్పారు.



జయరాం అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

మరో స్త్రీ?

(మొదటి పేజీ తరువాయి)

యువతి, కారు డ్రైవర్ల ప్రమేయమున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అదే దిశగా దర్యాప్తు చేపడుతున్నారు. చిగుపాటి హత్యకు ట్రెక్స్టాన్ కంపెనీ లావాదేవీల విషయంలో శిఖాచౌదరికి జయరాం ల మధ్య విభేదాలే కారణమని పోలీసులు భావిస్తున్నారు. జయరాంకు తెలియకుండా కంపెనీ చెక్కులపై శిఖాచౌదరి సంతకాలు చేసినట్లు వెల్లడైంది. ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల టర్నోవర్ జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. చెక్కులపై శిఖా ఫోర్జరీ సంతకాలు చేసినట్లు జయరాం తెలుసుకన్న తరువాత వీరిద్దరి మధ్య విభేదాలు మరింత ముదిరాయి. ఈ క్రమంలో శిఖా ఇచ్చిన చెక్కులు చెల్లకపోవడంతో జయరాం పలుమార్లు జైలుకు సైతం వెళ్లారు. ట్రాక్స్టాన్ కంపెనీ వ్యవహారాలను ఎక్స్‌ప్రెస్ టివి కార్యాలయంలోనే నిర్వహించేవారు. జయరాం హత్య కేసులో నిందితునిగా ఉన్న రాజేష్ శిఖాతో పాటు కంపెనీ వ్యవహారాలు, సమావేశాలకు పాల్గొన్నాడు. అనేక కంపెనీల్లో జయరాం తరపున శిఖా చౌదరి బినామీగా వ్యవహరించారు. కాగా ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న రాజేశ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. శిఖాపై ఉన్న అనుమానం వ్యక్తం చేస్తున్న పోలీసులు అమె పాత్రపై మరింత లోతుగా దర్యాప్తు చేపడుతున్నారు. జయరాం హత్య కేసులో కీలక అనుమానుతురాలిగాఉన్న శిఖను నిర్మాత కెపి చౌదరి కలిశారు. స్టేషన్ వద్ద ఉన్న శిఖ కారును ఆయన తీసుకెళ్లడంలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా నుంచి వచ్చిన జయరాం కుటింబీకులను పోలీసులు ప్రశ్నించారు. శిఖాచౌదరి, రాకేష్‌రెడ్డిల కాల్‌డేటాను పోలీసులు వరిశీలించారు. ఈక్రమంలో జూబ్లిహిల్స్‌లోని జయరాం నివాసంలో పోలీసులు సోదాలు నిర్వహించిన కీలక ఆధారాలు సేకరించారు.

రక్షణ కల్పించండి : జయరాం భార్య పద్మ

చిగురుపాటి జయరాం అంత్యక్రియలు ముగిసిన అనంతరం అతని భార్య పద్మ స్టేట్‌మెంట్‌ను న్యాయవాదుల, ఒక ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సమక్షంలో పోలీసులు రికార్డు చేసుకున్నారు. తన భర్త హత్యకేసులో తనకు ఎవరిపై అనుమానాలు లేవని, నాకు, నా పిల్లలకు రక్షణ కల్పించాలని ఆమె పోలీసులకు విన్నవించింది. ఇండియాలో తన భర్త నిర్వహిస్తున్న వ్యాపారాల గురించి తనకు తెలియదని, గతంలో ఒక టివి చానెల్‌ను ప్రారంభించారి మాత్రమే తెలుసునని వివరించింది. తనకు తెలిసినంత వరకు ఆయనకు శత్రువులు ఎవరూ లేరన్నారు.

మామయ్యతో సం'బంధం' ఉంది : శిఖా

చిగురుపాటి హత్యకేసు విచారణలో శిఖాచౌదరి పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడించింది. మామయ్యతో నాకు శారీరక సంబంధం ఉన్న మాట వాస్తమేనని, నాకు మామయ్య నచ్చినందుకే అతనితో శారీరకంగా కలిశానని వివరించింది. నాకు, రాకేష్‌కు, మామయ్యకు మధ్య ఆర్థిక లావాదేవీల వివాదాలు ఉన్న మాట వాస్తమేనని, అయితే రాకేష్ మామయ్యను అంతమొందిస్తాడని మాత్రం తాను ఊహించలేదన్నారు. ఇప్పటికే తనకు రెండు వివాహాలు జరిగాయని, వారిద్దరితోనూ విడాకులు తీసుకున్నట్లు శిఖా చౌదరి పోలీసుల ఎదుట వెల్లడించింది. తన రెండవ భర్తను వదిలేయడానికి రాకేష్‌రెడ్డి ముఖ్యకారణమని తెలిపింది. కొన్ని సంవత్సరాలుగా తాను రాకేష్‌రెడ్డితో డేటింగ్ చేశానని పోలీసులకు వివరించింది. రెండవ భర్తతో విడాకులు తీసుకున్న తరువాత రాకేష్‌రెడ్డిని వివాహం చేసుకుందామని నిర్ణయించుకున్నానని, ఇందుకు మామయ్య జయరాం ఒప్పుకోలేదని, మామయ్య వల్లే తాను రాకేష్‌కు దూరంగా ఉండాల్సి వచ్చిందని తెలిపింది. ఇదిలావుండగా మామయ్యకు తానే రాకేష్‌ను పరిచయం చేశానని, ఈ పరిచయంలో మామయ్య రాకేష్ వద్ద నుంచి రూ.4.5కోట్లు అప్పుగా తీసుకున్నాడని తెలిపింది. మామయ్య తిరిగి ఆ డబ్బులు చెల్లించపోవడంతో రాకేష్ నాతో పలు సార్లు గొడవపడ్డాడని తెలిపింది. జగ్గయ్యపేటలో తనపేరిట ఉన్న 10 ఎకరాల భూమి పత్రాలు మామయ్య దగ్గరే ఉన్నాయని తెలిపింది. మామయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలియగానే తాను, శ్రీకాంత్ ఇద్దరం కలిసి మామయ్య ఇంటికి వెళ్లి జగ్గయ్యపేట భూమికి సంబంధించిన పత్రాల కోసం వెతికామన్నారు.

శిఖాతో పరిచయం ఉంది : కెపి చౌదరి

జయరాం మేనకోడలు శిఖా చౌదరితో తనకు ఐదేళ్ల నుంచి పరిచయం ఉందని నిర్మాత కెపి చౌదరి తెలిపారు. అయితే రాకేష్‌రెడ్డి ఎవరో తనకు తెలియదన్నారు. ఈక్రమంలో శ్రీకాంత్‌తో తనకు పరిచయం ఉందని, శిఖా, శ్రీకాంత్‌లతో పలుమార్లు కలిశానన్నారు. జయరాంకు మద్యం సేవించే అలవాటు విషయం తనకు తెలియదన్నారు. శిఖా చౌదరిని జయరాం ఎంతగానో ప్రేమించేవాడని, ఎప్పుడు తన మేనకోడలి గురించి తనతో చర్చించేవాడని తెలిపారు.

ధర్మారం సర్పంచ్‌కు అరుదైన అవకాశం



మన తెలంగాణ/ పిట్లం : పిట్లం మండలంలోని ధర్మారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎర్రబోగడ సరోజకు అరుదైన అవకాశం లభించింది. హర్యానాలోని కురుక్షేత్రంలో జరిగే నరేంద్ర మోడీ గ్రామ వికాస్ సెమినార్‌కు ఆహ్వానం లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు ఈ అవకాశం రావడం ఎంతగానో ఆనందంగా ఉందని, గ్రామాల అభివృద్ధిపై తనవంతు సెమినార్ ఇవ్వనున్నానని ఆమె వివరించారు. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర, గ్రామ పెద్దల సహాయ, సహకారాలు తదితర వాటిపై చర్చించనున్నట్లు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



మన తెలంగాణ/ రాయికల్ : జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన సంగ లింగవ్వ(112)అనే శతాధిక వృద్ధురాలు ఆదివారం మృతి చెందింది. గత కొన్ని రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతున్న లింగవ్వ తనువు చాలించింది. మొన్నదాక తన పనులు తానే చేసుకుంటూ జీవించిన లింగవ్వకు ఐదుగురు కుమారులు కాగ పెద్ద కుమారుడు, కోడలు ఇప్పటికే మృతి చెందారు. ఆమె నాలుగవ కుమారుడు సంగ లింగం ప్రస్తుతం కోరుట్ల మున్సిపల్‌లో 4వ వార్డు సభ్యులుగా కొనసాగుతున్నాడు. కాగ ఆమె మృతి పట్ల జడ్‌పిటిసి గోపి మాధవి రాజరెడ్డి, ఎంపిటిసి తలారి నాగమణి రాజేశ్, సర్పంచ్ అజారోద్దీన్‌లు సంతాపం వ్యక్తం చేశారు. కాగ కోరుట్ల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ముక్కెర శేఖర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

మన తెలంగాణ/ కీసర(మేడ్చల్ జిల్లా) : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన శనివారం అర్థరాత్రి కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారంలో జరిగింది. సిఐ ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం. ఎల్ బి నగర్ మన్సూరాబాద్ ప్రాంతానికి చెందిన షేక్ సికిందర్ (22), సిర్ల వెంకటేష్ (25) శనివారం అర్థరాత్రి 2.30 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై నాగారం నుంచి రాంపల్లి వైపు వెళ్తున్నారు. ఈస్ట్ గాంధీనగర్ కాకతీయ స్కూల్ వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో షేక్ సికిందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్‌ను గాంధీ ఆసుపత్రికి తరలించగా ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని జింక మృతి

మనతెలంగాణ/ జన్నారం : జన్నారం మండలం ఇంధన్‌పల్లి చౌరస్తాసమీపంలో ఆదివారం తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని చుక్కల జింక మృతి చెందిందని ఇందన్‌పల్లి రేంజ్ ఆధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. రోడ్డుపై చుక్కలజింక మృతి చెందినట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని దాన్ని పరిశీలించి ఏ వాహనం ఢీకొట్టిందో సమాచారం కోసం ఆరా తీస్తున్నామని తెలిపారు. మృతి చెందిన జింకకు పంచనామా చేసి పూడ్చివేశామనిశ్రీనివాస్‌రావు తెలిపారు.

‘శబరిమల’ మహిళలకు బెదిరింపులు

మలప్పురం : నెల రోజుల కిందట శబరిమల ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళల్ని చంపుతామని బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. 40 ఏళ్ల వయసులో ఉన్న బిందు, కనకదుర్గ కాషాయ సంస్థల నుంచి వచ్చిన బెదిరింపుల్ని లెక్కచేయకుండా అయ్యప్ప ఆలయంలోకి వెళ్లి ప్రార్థనలు చేశారు.పది నుంచి 50 ఏ ళ్ల మధ్య వయసులో ఉన్న బాలికలు, స్త్రీలను శబరిమల ఆలయంలోకి వెళ్లనివ్వరు. అయితే, శతాబ్దాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని తృణీకరించి వెళ్లిన ఆ ఇద్దరు మహిళలపై హిందూ సంప్రదాయ సంస్థలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. ఆలయంలోకి ప్రవేశించినందువల్ల కలిగే హానికి సిద్ధంగా ఉండమని బెదిరిస్తూ ఈ ఇద్దరు మహిళలకు ఒక లేఖ అందిందని పోలీసులు తెలిపారు. 44 ఏళ్ల కనకదుర్గ జనవరి 2న అయ్యప్ప ఆలయంలో ప్రార్థనలు చేసినందుకు ఆమె భర్త, బంధువుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది.

సైనిక ఫిరాయింపులకు గుయిడో విజ్ఞప్తి



కారకాస్ : సైనిక ఫిరాయింపులకు వెనిజులా ప్రతిపక్షనాయకుడు గుయిడో పిలుపునిచ్చారు. మరింతమంది సైనికులు దేశంలోని సోషలిస్ట్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి జనరల్ ఫిరాయింపు తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. ఇలా ఉండగా అధ్యక్షుడు నికోలస్ మదూరో త్వరలో నేషనల్ అసెంబ్లీకి ఎన్నికలు జరగాలని, అప్పుడే తనకు సవాల్ విసిరిన వ్యక్తిని తొలగించేందుకు వీలవుతుందని చెప్పారు. ఎన్నికలు జరగాలని మదూరో ఇచ్చిన ఈ పిలుపు వల్ల గుయిడోకు, ఆయనకు మధ్య ప్రతిష్టంభన మరింత తీవ్రం కావచ్చని అంటున్నారు. ప్రతిపక్షం అదుపులో ఉన్న నేషనల్ అసెంబ్లీకి గుయిడో నాయకత్వం వహిస్తున్నారు. కొత్త గా అధ్యక్ష ఎన్నిక జరగాలని ఈ వర్గం డిమాండ్ చేస్తోంది.

నేటి నుంచి ఆర్‌టిసి భద్రతా వారోత్సవాలు

మన తెలంగాణ / హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి భద్రత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ఉన్నతాధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారంగా ప్రతి ఏడాది ఫిబ్రవరి నాలుగవ తేదీ నుంచి పదవ తేదీ వరకు ఈ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది 90వ రోడ్డు భద్రత వారోత్సవాల నిర్వహణకు సంస్థ ఏర్పాట్లను పూర్తి చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల ముందు రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం అవసరమైన కసరత్తును పూర్తి చేసిన అధికారులు కార్యాచరణ ప్రణాళికను నేటి నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. వారోత్సవాల సందర్భంగా ప్రతి డిపో ముందు డిపో మేనేజర్, డిపో పరిధిలోని ప్రయాణికుల సంఘం ప్రతినిధులు, రవాణా, పోలీసు, న్యాయశాఖలతో పాటు ఇంతర ప్రముఖు లను డిపోకు ఆహ్వానించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆర్‌టిసి సూపర్‌వైజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశాన్ని ఏర్పాటు చేసి సురక్షిత డ్రైవింగ్‌కు సంబంధించిన పలు రకాల సలహాలు, సూచనలను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

మోడీని ఓడించాలి : సీతారాం ఏచూరి




కోల్‌కతా: ప్రధాన మంత్రి నరేంద్రమోడీని చౌకీదార్’ అని పేర్కొంటూ ...ఆయన కాపలాలో దేశంలో దోపిడీ, మతతత్వం పెరిగిపోయాయని సిపిఎం జనరల్ సెక్రెటరీ సీతారాం ఏచూరి ఆదివారం ఆరోపించారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక ప్రభుత్వం రావాల్సిన అవసరముందన్నారు. ‘రానున్న ఎన్నికలో మనల్ని చౌకీదార్ మోడీని ఓడించాలి. మనకు ఇలాంటి చౌకీదారు అక్కర్లేదు. ఆయన హయాంలో దేశంలో దోపిడీ పెరిగింది. మతతత్వమనే విషం దేశమంతా వ్యాపించింది. గత ఐదేళ్లుగా కేంద్రం దేశాన్ని దోచుకుని, ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయని తాయిలాలు ఇస్తోంది’ అని ఏచూరి చెప్పారు. ఇక్కడి బ్రిగేడ్ పెరేడ్ మైదానంలో జరిగిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ‘మోడీపట్ల ఇష్టంలేక ఆయనను ఓడించాలనడం లేదు. ఒక మార్పు జరగాలి. సమగ్ర దేశాభివృద్ధికి కొత్త విధానాలు కావాలి’ అని సీతారాం ఏచూరి అభిప్రాయపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా ఆయన విరుచుకుపడ్డారు.కేంద్రంలోని కాషాయ పార్టీ, బెంగాల్‌లోని మమతా బెనర్జీ పార్టీ నాణేనికి రెండు వైపులన్నారు.

నష్టాలు నిన్నటమాట

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో బహుళ ప్రయోజనం

కీలకం కానున్న ఐకెపి గ్రూపులు



రాష్ట ప్రభుత్వం ఏర్పాటుచేయ తలపెట్టిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా టమాటా రైతులకు, నిరుద్యోగ యువతీ యువకులకు లబ్ధిచేకూరనుంది. దిగుబడి తక్కువగా ఉన్నపుడు లాభాలు గడించే రైతులు దిగుబడి అధికమై సరైన ధరలు లేకపోవడంతో అమ్ముకోలేక బజార్లలో పారబోసి కంటనీరుపెడుతూ ఇంటికి చేరిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. రాష్ట్రంలోని ఆదిలాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో అత్యధికంగా టమాటా పండిస్తారు. వీరికి అండగా నిలవాలన్న ధృడ సంకల్పంతో ఉన్న సిఎం కెసిఆర్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఈ హామీ మేరకు ఆయా జిల్లాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయవచ్చంటూ సర్వే జరిపిన జయశంకర్ వ్యవసాయవిశ్వ విద్యాలయ ప్రొఫెసర్లు ఇచ్చిన సూచనల మేరకు ఆ వైపుగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఈ యూనిట్ల ఏర్పాటువల్ల టమాటా పంటకు నష్టం అనేది నిన్నటి మాటగా మారనుంది. మార్కెట్లలో ధర వస్తే అమ్మగా మిగిలిన పంటను ఐకెపి గ్రూపులకు అమ్ముకోవడం ద్వారా ప్రాసెసింగ్ యూనిట్లకు చేరుస్తారు. ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటైతే వందలాది మంది యువతీయువలకులకు ఉద్యోగాలు దొరికే అవకాశాలున్నాయి.





మనతెలంగాణ/ న్యూస్ నెట్‌వర్క్:

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, ఉట్నూర్, జైనూర్ మండలాల్లో టమాటా సాగు అధికంగా ఉంటుంది. జిల్లాలో సుమారు 12 వేల ఎకరాలలో టమాటా పంటను సాగు చేస్తుండగా, ఎకరాకు 50 నుంచి 80 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ లెక్కన ప్రతి సంవత్సరం జిల్లా రైతులు 84 వేల టన్నుల టమాటాను పండిస్తున్నారు. ఇక జిల్లాలో దశాబ్దాల నుంచి ఇక్కడి రైతులు ఖరీఫ్‌లో టమాట పంటను సాగు చేస్తూ ఆదాయాన్ని పొందుతున్నారు. పంటను మార్కెట్‌కు తరలించడానికి పెట్టెలను సైతం గతంలో రాయితీపై అందించారు. ప్రస్తుతం 98 శాతం టమాట ఊత కర్రల విధానంలోనే సాగువుతోంది. ఆయితే ఈ విధానం ద్వారా టమాట సాగు చేయాలంటే ప్రస్తుతం ఎకరానికి రూ 70 వేలు ఖర్చు అవుతోంది. దిగుబడులు చేతికొచ్చే దశలో మార్కెట్‌లో ధరలు అమాంతం పడిపోతుండడంతో టమాటా సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా 200 టన్నులకు పైగా టమాటా దిగుబడి వస్తుండగా, దాదాపు 10 టన్నుల వరకు మాత్రమే టమాటాను వినియోగిస్తున్నారు. మిగిలిన టమాటాలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 200 టన్నులకు పైగా టమాట ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. ముఖ్యంగా మధ్యప్రదేశ్‌లోని బరేలితో పాటు ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్, గోదావరిఖని, కాగజ్‌నగర్, మంచిర్యాలకు ఎగుమతి చేస్తున్నారు. టమాట అనుబంధ పరిశ్రమలు నెలకొల్పడానికి పారిశ్రామికవేత్తలు ఎవరూ ముందుకు రావడం లేదు. సంవత్సరం పొడుగునా టమాట అందుబాటులో ఉంటే టమాటతో తయారు చేసే టమాట పల్ప్, జ్యూస్, కేచ్, టమాట పౌడన్ పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పలువురు వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. టమాట ఆధారిత పరిశ్రమలు ఏర్పడితే ధర నిలకడగా ఉండి టమాట రైతులకు లబ్ది చేకూరే అకాశం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టమాట రైతులు కోరుతున్నారు.

సిద్ధిపేట జిల్లాలో రైతులు భారీగా పంటలు సాగుచేస్తున్నారు. జిల్లాలోని 15,723 ఎకరాల్లో 62,892 టన్నుల టమాటా ఉత్పత్తి అవుతోంది. బిందు సేద్యంతో టమాటాను పండించి రైతులు అధిక దిగుబడులు సాధిస్తున్నారు. రెండు నుంచి మూడు నెలల వ్యవధిలో టమాటా పంట చేతికందుతుండడంతో రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొన్ని సందర్భాల్లో టమాటా ధర అధిక ధరలు ఉంటుండడంతో రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్న సమయంలో మరికొందరు రైతులు కూడా లాభాల ఆశతో ఇదే పంట వైపు మొగ్గు చూపడంతో ఉత్పత్తి అధికమై ధరలుపడిపోవడంతో నష్టాలను చవిచూస్తున్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన మేరకే రైతులతో ఈ పంటను సాగుచేయించగలిగితే రైతులకు లాభాలతోపాటు యువతీయువకులకు ఉద్యోగావకాశాలు కూడా వచ్చే అవకాశముంది. జిల్లాలోని చిన్నకొడూరు, నంగునూరు మండలాల్లో అత్యధికంగా టమాటా ఉత్పత్తి అవుతుండడంతో ఈ ప్రాంతంలోనే ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని రైతులు కోరుతున్నారు.

టమాటాను అష్టకష్టాలుపడి సాగుచేస్తున్నప్పటికీ రైతులకు గిట్టుబాటు కావడంలేదు. ప్రభుత్వం త్వరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటుచేస్తామని ప్రకటించడంతో రైతుల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెర్వు, గుమ్మడిదల, జిన్నారం తదితర మండలాల రైతులు దశాబ్దాలుగా టమాటా సాగుచేస్తున్నారు. తమ పంటను అమ్ముకునేందుకుహైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆశించిన మేరకు ధరలు రాకపోవడంతో గిట్టుబాటు కావడంలేదని వాపోతున్నారు. జిల్లాలోని మూడు మండలాల్లో సుమారు 350 ఎకరాల్లో టమాటా పంట సాగవుతోంది. గుమ్మడిదల ప్రాంతంలో టమాటా రైతులకోసం గత ప్రభుత్వాలు కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటుచేశాయి. కానీ దాని నిర్వహణ సరిగా లేకపోవడంతో కోల్డ్ స్టోరేజీ నేడు వృధాగా మిగిలిపోయింది. ఈ కోల్డ్ స్టోరేజీని రైతులకోసం ఉపయోగించాలనేఆలోచన కూడా అధికారులకు రావడంలేదు. ఫలితంగా టమాటా రైతులు ఎప్పటిలాగే తమ దిగుబడిని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

పరిశ్రమ ఏర్పాటు హర్షణీయం

తెలంగాణా ప్రభుత్వం టమాటా ఆధారిత పరిశ్రమ ఏర్పాటుపై చర్యలు తీసుకోవడం ముదావహం. ఈ పరిశ్రమ ఏర్పాటైతే టమాటా రైతుల కష్టాలుదూరమయ్యేఅ వకాశాలున్నాయి ప్రస్తుతం ఎకరాకు 20నుంచి 30 వేలు మాత్రమే గిట్టుబాటవుతోంది. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటైతే రూ.50వేల వరకు ఆదాయం ఉంటుంది.

- సుదర్శన్, గుడిహత్నూర్ రైతు

గిట్టుబాటువుతుంది

ప్రభుత్వం ఏర్పాటుచేయతలపెట్టిన ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా తమకు గిట్టుబాటవుతుంది. ఎకరానికి 15టన్నుల వరకు దిగుబడి వస్తోందని, అయినప్పటికీ సరైన ధరలు లేక మార్కెట్‌లో పారబోసి వస్తున్నాం.

- అనీఫ్, ముంబాపూర్ రైతు

తక్కువ నీటితో అధిక పంట


తక్కువ నీటితో టమాటా సాగుచేస్తూ ఎక్కువ దిగుబడి సాధిస్తున్నాం. బిందు సేద్యంతో ఇతర పంటల కంటే టమాటా పంట త్వరగా చేతికి వస్తుండడంతో లాభాలుగడిస్తున్నాం. ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటుండడం ఎంతో మంచి పరిణామం.

- సూరగోని రాజయ్య, పెద్దకోడూరు రైతు

లాభాల పంట

గత ఆరు సంవత్సరాలనుంచి టమాటా పంట సాగుచేస్తున్నాం. ఈప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుచేస్తే లాభాలు పెరుగుతాయని సంతోషం వ్యక్తంచేశారు.

- అనిత, వెంకటాపూర్ (సిద్దిపేట)





మేడారంలో భక్తుల సందడి



మన తెలంగాణ/ తాడ్వాయి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంకు భక్తులు ఆదివారం వేలాదిగా తరలి వచ్చారు. రాష్ట్రంలోని హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చి తల్లులను దర్శించుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి తల్లుల వద్దకు చేరుకొని పసుపు కుంకుమ, పూలు, పండ్లు చీర, బెల్లం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కుటుంబసమేతంగా వచ్చిన భక్తులు జాతర పరిసర ప్రాంతాలైన మ్యూజియం, చిలకలగుట్ట, సారలమ్మగుడి, తదితర పరిసర ప్రాంతాలను సందర్శించారు. అనంతరం కోళ్లు, మేకలను తల్లులకు నైవేద్యంగా సమర్పించి వంటలు చేసుకొని తిని ఉల్లాసంగా గడిపి తిరిగి వెళ్లారు.

వనదేవతలను దర్శించుకున్న చత్తీస్‌గఢ్ మంత్రి, ఎంఎల్‌ఎలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్కసారలమ్మలను చత్తీస్‌ఘడ్ ఎక్సైజ్‌శాఖ, ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ మంత్రి కవాతు లకుమ ఆదివారం దర్శించుకున్నారు. బీజాపూర్ ఎంఎల్‌ఎ విక్రమ్ మాండవీ, భద్రాచలం ఎంఎల్‌ఎ పోదెం వీరయ్య, ములుగు ఎంఎల్‌ఎ సీతక్కలతో కలిసి మేడారం వచ్చిన ఆయన అమ్మవార్లకు పుసుపు, కుంకుమ పూలు పండ్లు, నూతన వస్త్రాలు, ఎత్తు బెల్లం, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానికి వచ్చిన మంత్రి ఎంఎల్‌ఎలను పూజారులు సాంప్రదాయంగా డోలు వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గాజరావు, మండల పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, సీనియర్ నాయకులు నల్లెల కుమారస్వామి, బొళ్ల దేవేందర్, బుర్రి శంకర్, బత్తిని రాజు, పులి సంపత్, పూజారులు కాక కిరణ్, మునీందర్, క్రిష్ణయ్య, కాక సారయ్య, దేవాదాయశాఖ అధికారులు, మధు, క్రాంతికుమార్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు మహా అద్భుతం

చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



మన తెలంగాణ/ కరీంనగర్ ప్రతినిధి : కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే మహా అద్భుతమైన ప్రాజెక్టు అని, ఈ నీళ్లతో తెలంగాణలోని కోటి ఎకరాలకు సాగునీరు అంది మెట్టప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. కరీంనగర్ జిల్లాలోని రామగుడు మండలం లక్ష్మీ పూర్‌లోని కాళేశ్వరం టన్నెల్‌ను ఆదివారం సందర్శించి మాట్లాడారు. ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇప్పటికే రెండు మోటార్ల డ్రై రన్ పూర్తయిందని, మిగతా 5 మోటార్ల బిగింపు తుది దశకు చేరిందని ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే తెలంగాణలో నీటి సమస్య తీరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గోదావరి నది నుంచి 90 రోజుల పాటు నిత్యం రెండు టిఎంసిల నీటి చొప్పున 180 టిఎంసిల నీటిని ఎగువకు మళ్లించడం ఈ పథకం ఉద్దేశమని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీలు వీర్ల కవిత, పునుగోటి ప్రశాంతి, లచ్చిరెడ్డి, ఎంపిపిలు దూలం బాలాగౌడ్, మార్కొండ కిష్టారెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు వీర్ల వెంకటేశ్వర్‌రావు, ఒంటెల మురళీకృష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు ఆకుల మధుసూధన్, ఉప్పుల గంగాధర్, పుల్కం గంగన్న, ఇఇ నూనె శ్రీధర్, డిఇఇ నర్సింగరావు, ఎఇఇలు శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్ కమేడియన్‌గా రాణిస్తున్నప్పుడు నా అభిమానులంతా హీరోగా నటించమని అడిగారు. అందుకే ఇప్పుడు హీరోగా చేస్తున్నా. ఒకే రకమైన పని చేయడం నాకు ఇష్టం ఉండదు. త్వరలో తప్పకుండా దర్శకుడినవుతాను. ఆర్య హీరోగా ఓ సినిమా తీయాలనుంది.
– కోలీవుడ్ స్టార్ కమేడియన్ సంతానం

వినోదంతో.. అద్భుతమైన కామెడీ కోసం..


నాగార్జున

సీనియర్ స్టార్ నాగార్జునకు ఈమధ్య పెద్దగా హిట్స్ లేవు. దీంతో తదుపరి చిత్రాల విషయంలో ఆయన ఎంతో జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే నాగార్జున రెండు అదిరిపోయే స్క్రిప్ట్‌లను ఎంచుకున్నారు. ఈ రెండింటిలో వినోదంతో పాటు అద్భుతమైన కామెడీ ఉండేలా ఆయన జాగ్రత్త పడుతున్నారట. ఈమేరకు నాగార్జున స్పష్టంగా తన దర్శకులకు ఆజ్ఞలు వేశారట. సంక్రాంతి బరిలో 'ఎఫ్ 2' సాధించిన అసాధారణ విజయాన్ని చూశాక నాగార్జున కూడా వెంకటేష్ దారిలోనే కామెడీ ఎంటర్‌టైనర్లతో జోరు చూపించాలని భావిస్తున్నారట. కళ్యాణ్ కృష్ణ దర్శకత్వం వహించనున్న 'బంగార్రాజు', రాహుల్ రవీంద్రన్ తెరకెక్కించనున్న 'మన్మథుడు 2' చిత్రాల్లో కామెడీని పర్‌ఫెక్ట్ టైమింగ్‌తో సెట్ చేయాలని ఈ సీనియర్ స్టార్ సూచించారట. థియేటర్లలో ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకుంటే బాక్సాఫీస్ వద్ద సక్సెస్ సాధ్యమేనని నాగార్జున భావిస్తున్నారట. 'ఎఫ్ 2'లో కాస్త ఘాటైన జోకులు ఉన్నా వాటిని ఫ్యామిలీ ఆడియన్స్ బాగానే ఎంజాయ్ చేశారు. కాబట్టి నాగార్జున నటించే ఆ రెండు సినిమాల్లో కామెడీ కొత్త పుంతలు తొక్కుతుందని అంతా భావిస్తున్నారు.



రూపమే అసలు సిసలు అలంకారం

హీరోయిన్లు అంటే స్లిమ్‌గా, అందంగా ఉండాలి. జీరోసైజ్ అయితే ఇంకా మంచిది. అయితే కొంచెం బొద్దుగా ఉన్నా అవకాశాలు ఆమడ దూరం పరుగెడతాయి. కానీ విద్యాబాలన్ విషయంలో ఆ రూల్ అస్సలు పనిచేయదు. ఎందుకంటే ఆమెకు ఫిజిక్‌తో సంబంధం లేకుండా అవకాశాలు వస్తూనే ఉన్నాయి. సినిమాల్లోనే కాకుండా, వాణిజ్య ప్రకటనల్లోనూ విద్యాబాలన్‌కు ఆమె రూపమే అసలు సిసలు అలంకారం. ఇకపోతే ఇటీవల 'ఎన్టీఆర్ కథానాయకుడు' చిత్రంలో ఆమె బసవతారకం పాత్రలో అద్భుతంగా నటించి ఆకట్టుకుంది. ఈ సినిమా సక్సెస్ కాకపోయినా విద్యాబాలన్‌కు మంచి గుర్తింపు దక్కింది. ఇక బాలీవుడ్ హిట్ మూవీ 'పింక్' తమిళ్ రీమేక్ 'ఏకె 59'లో అజిత్‌కు జోడీగా ఆమె నటిస్తోంది. అయితే ఇటీవల సెలబ్రిటీ ఫొటోగ్రాఫర్ డబూ రత్నానీ క్యాలెండర్ కోసం విద్యాబాలన్ అదరగొట్టే హాట్ పోజుతో ఆకట్టుకుంది. ఈ ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా వైరల్ అవుతోంది.

విజయ్‌కు జోడీగా కేథరిన్


విజయ్ దేవరకొండ, కేథరిన్

టాలీవుడ్ యంగ్ స్టార్ విజయ్ దేవరకొండ ప్రస్తుతం 'డియర్ కామ్రేడ్' సినిమాలో నటిస్తున్నారు. ఈ సినిమా తర్వాత క్రాంతి మాధవ్ దర్శకత్వంలో విజయ్ నటించనున్నారు. ఈ సినిమాలో ఈ యంగ్ స్టార్ నలుగురు హీరోయిన్లతో ఆడిపాడతారని సమాచారం. ఇప్పటికే ముగ్గురు హీరోయిన్లను ఖరారు చేసిన ఫిల్మ్‌మేకర్స్ ఇప్పుడు నాలుగవ హీరోయిన్‌ను కూడా ఫైనల్ చేశారు. అందాల తార కేథరిన్‌కు ఈ అవకాశం లభించడం విశేషం. ఈమధ్య తెలుగులో పెద్దగా అవకాశాలు లేని ఈ బ్యూటీకి ఇది క్రేజీ ఆఫర్ అనడంలో సందేహం లేదు. ఇప్పటికే ఈ సినిమాలో హీరోయిన్లుగా రాశీఖన్నా, ఐశ్వర్య రాజేష్, ఇసబెల్‌ను తీసుకున్నారు. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభం కాగా... ఈ వారంలో కేథరిన్ కూడా ఈ షూటింగ్‌లో పాల్గొంటుందని తెలిసింది. విజయ్ దేవరకొండ ఇలా నలుగురు హీరోయిన్లతో రొమాన్స్ చేయడం తన కెరీర్‌లో ఇదే మొదటిసారి. ఈ సినిమా విడుదల తర్వాత విజయ్ రోమియో హీరోగా పేరు తెచ్చుకుంటారేమో చూడాలి. గోపీసుందర్ సంగీతాన్ని అందిస్తున్న ఈ సినిమాను క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్‌పై కె.ఎ.వల్లభ నిర్మిస్తున్నారు. కె.ఎస్.రామారావు ఈ సినిమాకు సమర్పకులు. ఈ సినిమాను దసరా బరిలోకి దించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారట.

డిఫరెంట్ కాన్సెప్ట్‌తో కల్కి



సీనియర్ హీరో రాజశేఖర్ కథానాయకుడిగా శివాని శివాత్మిక సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కళ్యాణ్ నిర్మిస్తున్న సినిమా 'కల్కి'. 'అ!' సినిమాతో విమర్శకుల ప్రశంసలను అందుకున్న ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రాజశేఖర్ పుట్టినరోజు కానుకగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ "గరుడవేగ చిత్రానికి ప్రవీణ్ సత్తారుతో పనిచేసేటప్పుడు ఎంత కొత్తగా ఫీల్ అయ్యానో... 'కల్కి' సినిమాకు ప్రశాంత్ వర్మతో కలిసి పనిచేసేటప్పుడు అంతే కొత్తగా ఫీల్ అవుతున్నాను. చాలా రోజుల విరామం తర్వాత సి.కళ్యాణ్ సంస్థలో నేను నటిస్తున్న చిత్రమిది" అని అన్నారు. సి.కళ్యాణ్ మాట్లాడుతూ "డిఫరెంట్ కాన్సెప్ట్‌తో చేస్తున్న చిత్రమిది. 1980 నేపథ్యంలో కథ సాగుతుంది. ఇంకా 30 శాతం షూటింగ్ మిగిలి ఉంది. మార్చి, ఏప్రిల్ నెలల్లో మిగతా షూటింగ్ పూర్తిచేసి మంచి తేదీ చూసి ఈ చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం. 'శేషు' తర్వాత రాజశేఖర్‌తో నేను చేస్తున్న చిత్రమిది" అని తెలిపారు. ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ "రాజశేఖర్‌తో కలిసి పనిచేయడం అద్భుతమైన అనుభూతి. ఈ సినిమా కోసం ఓసారి వరుసగా 48 గంటలు షూటింగ్ చేశాం. నా ఫస్ట్ సినిమా అందరికీ అర్థం కాలేదు. కానీ ఈ చిత్రం అందరికీ అర్థమవుతుంది. 'కల్కి' కమర్షియల్ సినిమా. కొత్త కమర్షియల్ ఫార్మాట్ సృష్టించే సినిమా" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీవిత రాజశేఖర్, శివానీ, శివాత్మిక, దాశరథి శివేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సస్పెన్స్ థ్రిల్లర్ 'చెడ్డీ గ్యాంగ్'


కనగాల రమేష్ చౌదరి, పద్మాలయ మల్లయ్య, శివాజీ రాజా తదితరులు

కనగాల రమేష్ చౌదరి దర్శకత్వంలో రాజ్ ప్రొడక్షన్స్ ఇంటర్నేషనల్ పతాకంపై విక్కీరాజ్ నిర్మిస్తున్న చిత్రం 'చెడ్డీ గ్యాంగ్'. శ్రీనివాస రెడ్డి ముఖ్య పాత్రలో నటించగా అమర్, ప్రదీప్ వర్మ, ఉదయ్, అభి, సిటి, ఖాదర్, లక్ష్మి, శృతి, కావ్య, దేవి, వీణ, జాస్మిన్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా టీజర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్‌ల్యాబ్స్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శివాజీ రాజా మాట్లాడుతూ "టైటిల్ చాలా బాగుంది. ఈ చిత్రాన్ని మలేషియా, ముంబయ్‌లలో చిత్రీకరించారు. దర్శకుడు రమేష్ సినిమాను చక్కగా తెరకెక్కించారు. ఈ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. దర్శకుడు రమేష్ చౌదరి మాట్లాడుతూ "దర్శకుడిగా నా తొలి చిత్రమిది. సినిమా కథ విషయానికొస్తే... పది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కేరళ అడవులకు టూర్‌కు వెళ్లి అక్కడ కోయవారి నిబంధనలను అతిక్రమించి ఇరుక్కుపోతారు. అక్కడి నుంచి వాళ్లు ఎలా బయటపడ్డారనేదే ఈ చిత్ర కథాంశం. 125 రోజుల్లో షూటింగ్‌ను ముగించాం. మలేషియాలో 25 రోజులు షూటింగ్ చేశాం. ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరిస్తారనే నమ్మకముంది" అని పేర్కొన్నారు. నిర్మాత విక్కీ రాజ్ మాట్లాడుతూ "కేరళలోని ఎర్నాకుళం, ఇరిట్టి అడవులు, హైదరాబాద్‌లోని సారథి స్టూడియో, రామోజీ ఫిల్మ్‌సిటీ, మలేషియాలో ఈ సినిమాను తెరకెక్కించాం. మలేషియాలో తెరకెక్కించిన క్లైమాక్స్ సినిమాకు హైలైట్ అవుతుంది. చిత్రంలో ఐదు పాటలున్నాయి. బాలీవుడ్ బ్యూటీ స్నేహాకపూర్ చేసిన ఐటమ్‌సాంగ్ యువతను ఆకట్టుకుంటుంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మాలయ మల్లయ్య, సెన్సార్ సభ్యులు ఎం.ఎస్.రెడ్డి, గీత రచయిత లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

హాలీవుడ్ స్థాయిలో హారర్ చిత్రం


'అమావాస్య' బిగ్ సీడీని విడుదల చేస్తున్న సి.కళ్యాణ్. చిత్రంలో సచిన్ జోషి, భూషణ్ పటేల్, ఫైట్ మాస్టర్ విజయ్ తదితరులు

సచిన్ జోషి హీరోగా వైకింగ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై 'రాగిణి యంయంఎస్' ఫేమ్ భూషణ్ పటేల్ దర్శకత్వంలో రైనా సచిన్ జోషి, దీపెన్ ఆమిన్ నిర్మించిన చిత్రం 'అమావాస్య'. నర్గిస్ ఫక్రీ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రం ఈనెల 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా యూనిట్ హైదరాబాద్‌లో గ్రాండ్ ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ బిగ్ ఆడియో సీడీని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "నాకు హర్రర్ జోనర్ అంటే చాలా ఇష్టం. నేను ఇప్పటివరకు చాలా హర్రర్ సినిమాలు నిర్మించాను. ఈ సినిమాలో సచిన్ బాగా నటించాడు. తనకు చాలా వ్యాపారాలు ఉన్నా సినిమాపై తనకు ఉన్న ప్యాషన్‌తో నటిస్తున్నారు. భూషణ్ ఈ సినిమాను చాలా అద్భుతంగా తెరకెక్కించారని ట్రైలర్ చూస్తేనే తెలుస్తోంది. ఆయన చాలా టాలెంటెడ్ డైరెక్టర్" అని అన్నారు. సచిన్ జోషి మాట్లాడుతూ "క్లాసిక్ హర్రర్ మూవీ 'అమావాస్య'. ప్రస్తుతం ఉన్న లేటెస్ట్ విఎఫ్‌ఎక్స్ వర్క్‌ను ఉపయోగించి ఈ సినిమా చేశాం. ఈ సినిమాను హిందీ, తెలుగులో చిత్రీకరించాం. హర్రర్ స్పెషలిస్ట్ భూషణ్ దర్శకత్వంలో ఈ చిత్రం అద్భుతంగా తెరకెక్కింది. హాలీవుడ్ స్థాయిలో హర్రర్ చిత్రాన్ని అందించాలని భావించి ఛాలెంజింగ్‌గా ఈ సినిమాను రూపొందించాం" అని తెలిపారు. దర్శకుడు భూషణ్ పటేల్ మాట్లాడుతూ "సినిమాలో క్లైమాక్స్ అందరినీ ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. ఈ చిత్రంలో కథతో పాటు విఎఫ్‌ఎక్స్‌కు చాలా ప్రాధాన్యముంది. సచిన్ జోషి చక్కగా నటించారు. హీరోయిన్ నర్గీస్ తన నటనతో అందరిని ఆకట్టుకుంటుంది. ఈనెల 8న ఈ చిత్రం విడుదల కానుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫైట్ మాస్టర్ విజయ్, నటుడు అలీ అస్గర్ పాల్గొన్నారు.

వినోదంతో పాటు సందేశం


శివ కంఠంనేని, అలేఖ్య, రసజ్ఞ దీపిక, శ్రీపాద విశ్వక్ తదితరులు

శివ కంఠంనేని టైటిల్ పాత్రలో రామ్‌కార్తీక్, శివహరీష్, అలేఖ్య, రసజ్ఞ దీపిక హీరోహీరోయిన్లుగా శ్రీపాద విశ్వక్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అక్కడొకడుంటాడు'. లైట్ హౌస్ సినీ మ్యాజిక్ పతాకంపై కె.శివశంకర రావు, రావుల వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. హైదరాబాద్‌లోని ఫిలిం ఛాంబర్‌లో జరిగిన సక్సెస్‌మీట్‌లో టైటిల్ పాత్రధారి శివ కంఠంనేని మాట్లాడుతూ "మా వినోదాత్మక చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. భారతీయుడు, అపరిచితుడు చిత్రాల తరహాలో అండర్‌కరెంట్‌గా డ్రంకన్ అండ్ డ్రైవ్ పైన సందేశం ఉంటుంది తప్ప ఇది పూర్తి కమర్షియల్ చిత్రం" అని అన్నారు. దర్శకుడు శ్రీపాద విశ్వక్ మాట్లాడుతూ "కొత్తదనానికి పట్టం కడుతున్న నేటి ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా తీసిన చిత్రమిది. సినిమా చివరి వరకు సస్పెన్స్ కొనసాగుతూ ప్రేక్షకులకు థ్రిల్‌ను కలిగిస్తోంది" అని పేర్కొన్నారు. నిర్మాతలలో ఒకరైన రావుల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ సినిమా ఆరంభం నుంచి చివరి సన్నివేశం వరకు ఉత్కంఠగా సాగుతూ ప్రేక్షకులను అలరిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరోలలో ఒకరైన శివ హరీష్, డిస్ట్రిబ్యూటర్ దాసరి శ్రీనివాస్, ఘంటా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ మాత్రమే చూడాల్సిన సినిమా


ఆదిత్, నిక్కీ తంబోలి, సంతోష్ పి.జయకుమార్, మిర్చి హేమంత్ తదితరులు

ఆదిత్, నిక్కీ తంబోలి హీరోహీరోయిన్లుగా సంతోష్ పి.జయకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'చీకటి గదిలో చితక్కొట్టుడు'. గత ఏడాది తమిళంలో విడుదలై హిట్ అయిన ఈ చిత్రాన్ని తెలుగులో రీమేక్ చేశారు. పోసాని, రఘుబాబు, సత్యం రాజేష్, తాగుబోతు రమేష్, మిర్చి హేమంత్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం ఫిబ్రవరి మూడో వారంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో హీరో ఆధిత్ మాట్లాడుతూ "స్క్రిప్ట్ నచ్చి ఈ సినిమా చేస్తున్నాను. ఈ చిత్రాన్ని దర్శకుడు సంతోష్ చక్కగా తెరకెక్కించాడు" అని అన్నారు. హీరోయిన్ నిక్కి తంబోలి మాట్లాడుతూ "ఈ సినిమాలో గ్లామరస్ పాత్రలో కనిపిస్తాను. ఈ అడల్ట్ హర్రర్ కామెడీ మూవీని దర్శకుడు సంతోష్ ఛాలెంజింగ్‌గా తీసుకొని తెరకెక్కించారు" అని తెలిపారు. దర్శకుడు సంతోష్ పి.జయకుమార్ మాట్లాడుతూ "యూత్ మాత్రమే చూడాల్సిన సినిమా ఇది. సినిమాలోని కామెడీ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాగుబోతు రమేష్, మిర్చి హేమంత్, సంగీత దర్శకుడు బాలమురళి బాలు తదితరులు పాల్గొన్నారు.


న్యూ ఢిల్లీలో జరుగుతున్న లాక్మీ ఫ్యాషన్ వీక్‌లో ర్యాంప్‌పై షోస్టాపర్స్‌గా మెరిసిన బాలీవుడ్ స్టార్లు అనీల్ కపూర్, జాన్వీ కపూర్



అలాంటి కట్టుబాట్లు తొలగిపోతున్నాయి

రెజీనా కసాండ్రాకు ఈమధ్య టాలీవుడ్‌లో అవకాశాలే రావడం లేదు. ఈ భామ చివరగా నటించిన తెలుగు సినిమా 'అ!'. ఈ చిత్రం ఆమెను పూర్తిగా నిరాశపరిచింది. అప్పటి నుంచి కోలీవుడ్‌పై ఎక్కువగా ఫోకస్ చేస్తున్న ఈ చెన్నై బ్యూటీ తాజాగా 'ఏక్ లడకీకొ దేఖా తో ఐసా లగా' సినిమాతో బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. మహిళా దర్శకురాలు షెల్లీ చోప్రా ధార్ రూపొందించిన ఈ చిత్రం థీమ్ లెస్బియన్ లవ్. ఈ బోల్డ్ సినిమాలో సోనమ్‌కపూర్, రెజీనాలు ప్రేమికులుగా కనిపించారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకు మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా సినిమా కాన్సెప్ట్‌పై ఆసక్తికరమైన కామెంట్స్ చేసింది రెజీనా. 'కాలం మారింది. మన చుట్టూ జరిగేవి ప్రజలు గమనిస్తున్నారు. క్రమంగా అన్ని విషయాలను వారు అంగీకరిస్తున్నారు. ప్రేమకు చాలా రూపాలున్నాయి. ప్రేమ ఇలాగే ఉండాలని ఎవరూ బంధనాలు విధించలేరు. అలాంటి కట్టుబాట్లు నెమ్మదిగా తొలగిపోతున్నాయి' అని రెజీనా చెప్పింది. అంతేకాదు లెస్బియన్ లవ్ గురించి అందరూ మాట్లాడుతున్నారని.. ప్రజల్లో దీనిపై అవగాహన పెరుగుతోందని ఈ భామ పేర్కొంది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇలాంటి వాటిని ఒప్పుకోక తప్పదని రెజీనా చెప్పడం విశేషం.

కార్పొరేషన్ బ్యాంక్ సిఇఒగా పివి భారతి



మంగళూరు : మంగళూరు ఆధారిత కార్పొరేషన్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)గా పివి భారతి బాధ్యతలు చేపట్టారు. భారతి ఇంతకుముందు కెనరా బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా సేవలందించారు. 2016 సెప్టెంబర్ 15 నుంచి ఆమె కెనరా బ్యాంక్‌లో రిస్క్ మేనేజ్‌మెంట్ వింగ్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా కార్పొరేషన్ బ్యాంక్ సిఇఒగా బాధ్యతలు చేపట్టారు. బ్యాంకింగ్ రంగంలో భారతికి 37 ఏళ్ల అనుభవం ఉంది. ఎన్‌సిఆర్(నేషనల్ క్యాపిటల్ రీజియన్), తమిళనాడులో వివిధ బ్రాంచ్‌లలో ఆమె పనిచేశారు. గ్రామీణ, శివారు ప్రాంతాలు, పట్టణం, మెట్రో బ్రాంచ్‌లలో భారతికి అపారమైన అనుభవం ఉంది.

ఆర్‌బిఐ వడ్డీ రేట్లు యథాతథంగానే !



న్యూఢిల్లీ : ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) ఈసారి కూడా వడ్డీ రేట్లను యథాతథంగానే కొనసాగించే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ద్రవ్యోల్బణం దిగివచ్చినప్పటికీ ఆర్థిక సవాళ్లు, క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగిన కారణంగా ఈవారంలో ఆర్‌బిఐ వడ్డీ రేట్లను యథాతథంగానే కొనసాగించవచ్చని అంటున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19)లో ఆర్‌బిఐ ఆరో ద్వైపాక్షిక పరపతి సమీక్ష సమావేశాలు 5న(మంగళవారం) ప్రారంభవనున్నాయి. అనంతరం 7వ తేదీన ముగుస్తాయి. పరపతి నిర్ణయాలను గురువారం మధ్యాహ్నం ఆర్‌బిఐ ప్రకటించనుంది. గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ రేట్లను యథాతథంగానే కొనసాగించింది. దీంతో ప్రస్తుతం రెపో 6.25 శాతంగా అమలవుతోంది. రివర్స్ రెపో 6.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 6.75 శాతంగా ఉంది.

దేశీయ సిమెంట్ ఉత్పత్తి



కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.91
యూరో	81.59
బ్రిటిష్ పౌండ్	93.13
ఆస్ట్రేలియన్ డాలర్	51.54
కెనెడియన్ డాలర్	54.00
సింగపూర్ డాలర్	52.67
స్విస్ ఫ్రాంక్	71.43
చైనీస్ యువాన్	10.56
మలేషియన్ రింగిట్	17.33
న్యూజిలాండ్ డాలర్	49.04
హాంకాంగ్ డాలర్	9.04
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	233.99
సౌతాఫ్రికన్ రాండ్	5.32

బులియన్




బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	31940	34160.43	0.82%
ముంబై	32490	34748.66	0%
ఢిల్లీ	32600	34866.31	0.77%
కోల్‌కతా	32870	35155.08	0.46%
కేరళ	30900	33048.13	0%
బెంగళూరు	31300	33475.94	0.32%
హైదరాబాద్	31940	34160.43	0.98%
గల్ఫ్	140.25	150.00	0.33%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42241.00
ముంబై	₹ 42241.00
ఢిల్లీ	₹ 42241.00
కోల్‌కతా	₹ 42241.00
హైదరాబాద్	₹ 42241.00



ఆన్‌లైన్‌లోనే అసెస్మెంట్

- రెండేళ్లలో పన్ను చెల్లింపుల్లో సమూల మార్పులు
- పన్ను చెల్లింపుదారుడు లేకుండానే ఐటిఆర్ పనులు
- గతేడాదిలో ఆన్‌లైన్ ద్వారా 2.06 లక్షల అసెస్మెంట్ కేసుల పరిశీలన
- సిబిడిటి చైర్మన్ సుశీల్ చంద్ర






న్యూఢిల్లీ: రెండేళ్లలో ఆదాయం పన్ను చెల్లింపుల్లో సమూల మార్పులు చోటుచేసుకుంటాయని, ప్రత్యక్షంగా పన్ను చెల్లింపుదారులు లేకుండా ఆన్‌లైన్ విధానంలో అసెస్మెంట్‌లు నిర్వహించే రోజులు వస్తాయని సిబిడిటి చైర్మన్ సుశీల్ చంద్ర పేర్కొన్నారు. పన్ను అధికారులతో ప్రత్యక్షంగా ఎదుర్కోకుండా, అంటే పన్ను చెల్లింపుదారుడు లేకుండానే అసెస్మెంట్‌లు జరుగుతాయని ఆయన అన్నారు. బడ్జెట్ అనంతరం ఒక ఇంటర్వ్యూలో సిబిడిటి(కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు) చైర్మన్ సుశీల్ చంద్ర మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సులభతర విధానాల్లో భాగంగా ముందస్తుగా నింపిన రిటర్న్ ఫామ్‌లను అస్సెస్సీలు దాఖలు చేయవచ్చన్నారు. పన్ను చెల్లింపుదారులకు 'పేరులేకుండా' సేవలందించే ప్రక్రియలో భాగంగా గతేడాదిలో ఐటి శాఖ ఆన్‌లైన్ ద్వారా 2.06 లక్షల ఆదాయం పన్ను అసెస్మెంట్ కేసులను పరిశీలించిందని అన్నారు. ఐటి శాఖలో అత్యాధునిక సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్(సిపిసి) 2.0ను నెలకొల్పేందుకు ఇటీవల ప్రభుత్వం అనుమతిచ్చిందని సుశీల్ చంద్ర తెలిపారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్ ప్రతిపాదనలకు మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. సిపిసి 2.0లో కొత్త ప్రయోజనాలెన్నో ఉన్నాయి. ప్రాథమిక సమాచారం లేకుండానే పన్ను చెల్లింపుదారులకు ప్రి–ఫిల్డ్ రిటర్న్ ఫామ్‌ను ఇవ్వడం జరుగుతుందని, దీంతో టిడిఎస్(టాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) నుంచి వారి గురించి తెలుసుకుంటారు. ఈ ప్రక్రియ 24 గంటల్లోనే నిర్వహించే సౌకర్యం వస్తోందని, ఈ విధానాన్ని రెండేళ్లలో ప్రారంభించవచ్చని ఆయన తెలిపారు. ఈ వేగవంతమైన రిటర్న్ ప్రక్రియతో పన్ను పరిధి విస్తృతమవుతుందని చంద్ర వివరించారు. మనిషిలేకుండానే అసెస్మెంట్, రిటర్న్‌ల పరిశీలన చేసేందుకు ఐటి శాఖ సమాయత్తమవుతోందని తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టే సందర్భంగా కేంద్ర ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలపై సిబిడిటి చీఫ్ స్పందిస్తూ.. ఐటి శాఖ ఇప్పటికే ఈ ప్రక్రియను ప్రారంభించిందని అన్నారు. ఇప్పటి కూడా చాలా తక్కువ ఐటి రిటర్న్ కేసులు అంటే మొత్తంలో 0.46 శాతమే పరిశీలనలో ఉన్నాయి. 99.54 శాతం ఐటిఆర్‌లను అంగీకరించామని ఆయన తెలిపారు. వచ్చే రోజుల్లో సగటు పన్ను చెల్లింపుదారుడి ఐటిఆర్‌ను పరిశీలించేటప్పుడు రెండు దశల విధానాన్ని అవలంభిస్తామని అన్నారు. తొలుత ఐటి శాఖ పరిశీలన మాత్రమే నిర్వహిస్తుంది. అసెస్మెంట్ కోసం అసెసింగ్ అధికారులు వెళ్లరు. 'పన్ను చెల్లింపుదారుడి గురించి సమాచారం పొందినట్లయితే మేము దానిని ఇ–మెయిల్ ద్వారా పంపుతాము. ఆఫీస్ సమస్యను పరిష్కరిస్తుంది. కేసుకు సంబంధించిన మరింత సమాచారం అవసరం లేకపోయినట్లయితే ఈ అంశాన్ని ఇంతటి ముగిస్తారు'అని చంద్ర వెల్లడించారు.

3.4 శాతం ద్రవ్యలోటు నిర్వహణ కష్టమే

అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ వెల్లడి



న్యూఢిల్లీ : ప్రభుత్వం నిర్ణయించిన ద్రవ్యలోటు లక్ష్యం నిర్వహణ సాధ్యం కాదని గ్లోబల్ రేటింగ్ సంస్థ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ వెల్లడించింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు అంచనా వేసిన దానికంటే పెరగనుందని మూడీస్ మేనేజింగ్ డైరెక్టర్ జినె ఫాంగ్ అన్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యం 3.4 శాతంగా ప్రభుత్వం నిర్ణయించుకుంది. అయితే అధిక వ్యయాలు, తక్కువ రెవెన్యూ వృద్ధి కారణంగా ఈ లక్ష్యాన్ని చేరుకోకపోవచ్చని మూడీస్ పేర్కొంది. జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) పరంగా చూస్తే భారత ప్రభుత్వం రుణం అత్యధికంగా ఉందని, కేంద్ర ఆర్థిక స్థిరీకరణ మార్గానికి కట్టుబడి ఉన్నట్లయితే ఇది తగ్గుముఖం పట్టే అవకాశముందని ఫాంగ్ అన్నారు.

ఆయిల్ కంపెనీల మూలధన వ్యయం నాలుగేళ్ల కనిష్టానికి..



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ చమురు సంస్థల మూలధన వ్యయం నాలుగేళ్ల కనిష్టానికి చేరింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో చమురు, గ్యాస్ అన్వేషణ, రిఫైనింగ్, పెట్రోకెమికల్స్‌లో ఒఎన్‌జిసి, ఐఒసి వంటి కంపెనీలు దాదాపు రూ.93,693 కోట్లు ఇన్వెస్ట్ చేయాలని యోచిస్తున్నాయి. దీంతో మూలధన వ్యయం నాలుగేళ్ల కనిష్టానికి చేరింది. ఒఎన్‌జిసి(ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్, కార్పొరేషన్), ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఒసి), గెయిల్ (ఇండియా), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(బిపిసిఎల్), హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్), మంగళూరు రిఫైనరీస్, పెట్రోకెమికల్స్ లిమిటెడ్, వాటి అనుబంధ సంస్థల మూలధన వ్యయం 2014–15 సంవత్సరం నాటి స్థాయిలో చేరాయి. 2019–20కు గాను కేంద్ర బడ్జెట్‌లో పేర్కొన్నారు.

ఆర్‌బిఐ సమీక్ష, క్యూ3 కీలకం

ఈ వారం మార్కెట్‌పై విశ్లేషకులు



న్యూఢిల్లీ : జనవరి ఫ్యూచర్స్ గడువు తేదీ ముగింపు, బడ్జెట్ –2019లతో గతవారం ముగిసింది. ఆర్‌బిఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) సమీక్ష, క్యూ3 ఫలితాలు వంటివి ఈ వారం మార్కెట్‌ను శాసించనున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఇన్వెస్టర్లు రిజర్వ్ బ్యాంక్‌పై దృష్టిసారించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19)లో ఆర్‌బిఐ ఆరో ద్వైపాక్షిక పరపతి సమీక్ష సమావేశాలు 5న(మంగళవారం) ప్రారంభమై 7వ తేదీన ముగియనున్నాయి. పరపతి నిర్ణయాలను గురువారం మధ్యాహ్నం ఆర్‌బిఐ ప్రకటించనుంది. గత సమీక్షలో రిజర్వు బ్యాంక్ రేట్లను యథాతథంగానే కొనసాగించింది. దీంతో ప్రస్తుతం రెపో 6.25 శాతంగా అమలవుతోంది. రివర్స్ రెపో 6.25 శాతం వద్ద కొనసాగుతోంది. ఎంఎస్‌ఎఫ్, బ్యాంక్ రేటు 6.75 శాతంగా ఉంది. ఫలితంగా ఈ వారం దేశీ స్టాక్‌మార్కెట్లలో ట్రెండ్‌ను ప్రధానంగా ఆర్‌బిఐ పాలసీ నిర్ణయాలు ప్రభావితం చేసే అవకాశమున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. మూడో త్రైమాసిక ఫలితాలను ఇప్పటికే పలు కంపెనీలు ప్రకటించాయి. మరికొన్ని కంపెనీలు క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలను వెల్లడించనున్నాయి. ఇంకా డాలరుతో మారకంలో రూపాయి కదలికలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులు వంటి పలు అంశాలు ట్రెండ్‌కు కీలకంగా నిలవనున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వారం క్యూ3 ఫలితాలను ప్రకటించే కంపెనీల జాబితాలో గెయిల్, మారికో, ఒబిసి, శోభా, సింఫనీ, టాటా కెమికల్, టాటా గ్లోబల్, టెక్ మహీంద్రా, ట్రెంట్, ట్రైజిన్, అదానీ పోర్ట్స్, సిప్లా, గ్రాఫైట్, బలరామ్‌పూర్ చినీ, బేయర్‌క్రాప్, కెపాసైట్, కోల్ ఇండియా, ఎక్సైడ్, గోద్రెజ్ ఆగ్రో, గ్రీవ్స్ కాటన్, ఇన్‌సెక్టిసైడ్స్, ఐఒబి వంటి కంపెనీలు ఉన్నాయి. మరోవైపు అమెరికా–చైనా మధ్య వాణిజ్య వివాదం పరిష్కారం కోసం గత వారం చివర్లో ఇరు దేశాల మధ్య చర్చలు జరిగాయి. రెండు రోజుల పాటు జరిగిన సమావేశాలు ఆశావహంగా ముగిసినట్లు చైనా ప్రతినిధులు పేర్కొన్నారు.

విదేశీ పెట్టుబడులు రూ.5300 కోట్లు వెనక్కి



న్యూఢిల్లీ: జనవరిలో విదేశీ పెట్టుబడులు భారీగా తరలిపోయాయి. దాదాపు రూ.5300 కోట్లు దేశీయ మూలధన మార్కెట్ల నుంచి వెనక్కిపోయాయి. కొద్ది నెలల్లో లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎఫ్‌పిఐ(విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు) జాగ్రత్త వహిస్తున్నారు. దీనికి ముందు 2018 నవంబర్, డిసెంబర్ నెలల్లో ఈక్విటీ, డెబిట్ మార్కెట్లలో దాదాపు రూ.17 వేల కోట్లు ఇన్వెస్ట్ చేశారు. అయితే అక్టోబరులో రికార్డు స్థాయిలో రూ. 38,900 కోట్ల ఎఫ్‌పిఐలు పెట్టుబడులను మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్నారు. ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, డాలర్‌తో రూపాయి విలువ బలహీనపడటం, అమెరికాచైనాల మధ్య కొనసాగుతున్నవాణిజ్య యుద్ధం లాంటి పరిణామాలు ఎఫ్‌పిఐల రాకపై ప్రభావం చూపుతున్నాయి. డిపాజిటరీల వద్ద లభించిన గణాంకాల ప్రకారం, గత నెలలో ఈక్విటీల నుంచి రూ.5,264 కోట్లు, డెబిట్ మార్కెట్ల నుంచి రూ.97 కోట్లు ఉపసంహరించుకోగా, మొత్తం రూ.5,361 కోట్లకు చేరింది.

బడ్జెట్ ఏ రంగాలకు అనుకూలం?

ఏ స్టాక్స్ లాభాలను ఇవ్వనున్నాయి? ● విశ్లేషకుల సూచనలు

న్యూఢిల్లీ: బడ్జెట్–2019లో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ మధ్యతరగతి, రైతుల, అసంఘటిత కార్మికులకు వరాల జల్లు కురిపించారు. ఆదాయం పన్ను మినహాయింపు పరిమితిని పెంచారు. బడ్జెట్లో అంశాలకు అనుగుణంగా దీర్ఘకాలిక పెట్టుబడులను ఎలా ప్లాన్ చేసుకోవచ్చునే అంశంపై నిపుణుల పలు సూచనలను చేస్తున్నారు. గ్రామీణ భారతానికి బడ్జెట్లో 1.35 లక్షల కోట్ల ఉద్దీపనలు ప్రకటించారు. రైతులకు నేరుగా నగదు బదిలీ పథకం, ఉపాధిహామీకి రూ. 60వేల కోట్లు కేటాయించారు. వీటితో కలిపి ప్రజల వినిమయ శక్తిని పెరగనుందని, అందువల్ల ఎఫ్‌ఎంసిజి, కన్జూమర్ డ్యూరబుల్స్, వ్యవసాయ ఉత్పాదకాల తయారీ కంపెనీలు లాభపడతాయని వారు సూచిస్తున్నారు. ప్రభుత్వం ఏడాదికి రూ. 6,000 చొప్పున నగదు సాయం చేయనుండటంతో రైతుల వ్యవసాయానికి చేయూతగా నిలుస్తుంది. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఇదే రైతులకు రుణ మాఫీలు కూడా ఇవ్వడంతో ఇప్పుడు వారి కొనుగోలు శక్తి పెరిగినట్టేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. వ్యవసాయం జోరందుకోనుండటంతో వ్యవసాయ ఉపకరణాలు, పనిముట్లు వంటి వాటికి డిమాండ్ ఏర్పడనుంది. మహీంద్రా, ఐషర్ వంటి కంపెనీల స్టాక్స్ పుంజుకునే అవకాశముంది. అలాగే ఎరువులు, సిమెంట్ కంపెనీలకు కూడా డిమాండ్ పెరగవచ్చు. 2020 వరకూ నమోదు కాబడ్డ ప్రాజెక్టులకు పన్ను మినహాయింపు దక్కడంతో రియాల్టీ రంగం ఊపందుకోనుంది. గృహ నిర్మాణంలో కూడా ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన పథకం కొనసాగింపు కూడా మధ్య తరగతి ప్రజలను ఇళ్ళ కొనుగోలు వైపు నడిపిస్తాయి. అంతే కాకుండా రూ. 2 కోట్ల వరకూ పన్ను మినహాయింపు కూడా రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెరగడానికి కారణం అవుతుందని భావిస్తున్నారు. దీంతో రియాల్టీ రంగం ఊపందుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకులకు రూ. 2.6 లక్షల కోట్ల నిధులను మూల ధనంగా కేటాయిస్తున్నట్టు ప్రకటించడంతో ప్రభుత్వరంగ బ్యాంకులకు కలిసొచ్చే అంశమనే చెప్పాలి. ఈ నిధుల కేటాయింపుతో బ్యాంకుల స్టాక్స్ పుంజుకోనున్నాయి. కాగా ప్రభుత్వ సంస్థలు తమ లావాదేవీలను గవర్నమెంట్ ఇ మార్కెట్ల ద్వారా జరపాల్సి ఉంటుందని బడ్జెట్లో ప్రకటించిన నేపథ్యంలో జిఇఎంలపై ఏటా రూ.7 లక్షల కోట్లు విలువైన లావాదేవీలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. దీనివల్ల ఇన్ఫీబీమ్‌కు లాభదాయకమని భావిస్తున్నారు. నూతనంగా లక్ష డిజిటల్ విలేజ్‌ల ఏర్పాటు చేయగా, దీనివల్ల జియో, స్టెరిలైట్ టెక్‌లాంటి కంపెనీలకు మేలు జరుగుతుంది. రెండో ఇల్లు కొనుగోలుపై సిజి మినహాయింపుతో హౌసింగ్, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలకు లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో మార్కెట్లు ద్వితియార్థం ఆరంభం వరకు మార్కెట్లు తీవ్ర ఆటుపోట్లకు లోనవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



దేశానికి మార్గదర్శనం



- అధికార వికేంద్రీకరణ జరిగినప్పుడే అన్ని ప్రాంతాలకు న్యాయం
- ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకతపై నిర్వహించిన సదస్సులో వక్తలు

మనతెలంగాణ/ హైదరాబాద్ : ఫెడరల్ ఫ్రంట్ దేశానికి సరైన మార్గం చూపుతుందని శాసనమండలి చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. అధికార వికేంద్రీకరణ జరిగినప్పుడే అన్ని ప్రాంతాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బిసి, ఎస్‌సి సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం సెంట్రల్ కోర్టు హోటల్‌లో 'భారతదేశంలో ఫెడరల్ ఫ్రంట్ ప్రాముఖ్యత' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్‌సి కార్పోరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో పాతూరి సుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఆయాచితం శ్రీధర్, మీడియా అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ, టిఆర్‌ఎస్ నాయకులు రాజారాం యాదవ్, ఒయు అధ్యాపకులు గాలి వినోద్‌కుమార్, బెవరేజెస్ కార్పోరేషన్ ఛైర్మన్ దేవిప్రసాద్, టిఎన్‌జిఒ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ, దేశంలోని వనరులను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకున్నప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలో అధికార వికేంద్రీకరణ జరిగినప్పుడే రాష్ట్రాలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. గ్రామాలలో ఒక ప్రాథమిక పాఠశాల, ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కూడా కేంద్రం ఆధీనంలో ఉండటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఫెడరల్ ఫ్రంట్ లక్ష్యాలు, ప్రయోజనాలపై ఒక పుస్తకం తీసుకురావాలని నిర్వాహకులను కోరారు. రాష్ట్ర బిసి కమిషన్ ఛైర్మన్ బి.ఎస్.రాములు మాట్లాడుతూ, దేశంలో సామాజిక న్యాయం జరగాలంటే కేంద్రంలో ఫెడరల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ ఏర్పాటులోనే ఫెడరల్ స్ఫూర్తి ఉందని పేర్కొన్నారు. దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. పరిపాలనలో మార్పులు రావాలంటే ఫ్రంట్ రావాలని వ్యాఖ్యానించారు. అధికార వికేంద్రీకరణతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కేంద్రంలో కచ్చితంగా ఫెడరల్ ఫ్రంట్ అధికారంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. అల్లం నారాయణ మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతుందని పేర్కొన్నారు. వాళ్లు అనుకున్నది మాత్రమే చేసే విధానం కనబడుతుందని అన్నారు. రిజర్వేషన్ల అంశాన్ని పక్కనపెట్టి రెండు మూడు రోజుల్లో అగ్రవర్ణాలకు 10 శాతం రిజర్వేషన్లు సాధించుకుందని చెప్పారు. దేశ రాజకీయాలపై సిఎం కెసిఆర్ లేవనెత్తిన మౌలిక అంశాలపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు.

దేవిప్రసాద్ మాట్లాడుతూ, ఫెడరల్ ఫ్రంట్ అంటే ప్రజా రాజకీయం అని పేర్కొన్నారు. ఫెడరల్ ఫ్రంట్ ఓట్లు, సీట్ల కోసం కాదని, ఇది ప్రజల కోసమని స్పష్టం చేశారు. గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ, దేశాన్ని ఎక్కువ పాలించిన కాంగ్రెస్ దేశాన్ని సర్వనాశనం చేసిందని అన్నారు. ప్రస్తుతం పాలిస్తున్న బిజెపి ఫాసిస్టు విధానాలు అనుసరిస్తూ దేశాన్ని నాశనం చేస్తుందని పేర్కొన్నారు. ఈ దేశానికి ప్రధానమంత్రిని ఒక ఉత్తరప్రదేశ్ మాత్రమే నిర్ణయిస్తుందని చెప్పారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు పెద్ద రాష్ట్రాలుగా ఉండడానికి వీల్లేదని అంబేద్కర్ ఆనాడే చెప్పారని పేర్కొన్నారు. రాజ్యాంగకర్తల ఆశయాలను ఫెడరల్ ఫ్రంట్ రూపంలో సిఎం కెసిఆర్ ముందుకు తెస్తున్నారని అన్నారు. నాయకులు ఈ దేశాన్ని శాస్త్రీయంగా ముందుకు తీసుకెళ్తూ అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలకు న్యాయం చేయాలని అన్నారు. ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ, మనదేశంలో ముఖ్యమంత్రులు, ఎంపిలు, ఎంఎల్‌ఎలు ఉన్నా దీని ప్రాణం అంతా కేంద్రంలోనే ఉంటుందని పేర్కొన్నారు. మౌలికమైన ప్రశ్నలకు సమాధానంగా, సమాహారంగా ఫెడరల్ ఫ్రంట్ వచ్చిందని చెప్పారు. కారం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, సేవ్ ఫెడరల్ విధానం, సేవ్ ఇండియా నినాదంతో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఫెడరల్ ఫ్రంట్ అని సిఎం కెసిఆర్ ప్రకటించిన తర్వాత దేశం మొత్తం కెసిఆర్ వైపు చూస్తుందని తెలిపారు. ఉన్నత విద్యామండలి వైస్ ఛైర్మన్ ఆర్.లింబాద్రి మాట్లాడుతూ, విద్య అనేది సమాజ మార్పుకు మార్గమని పేర్కొన్నారు. కానీ దేశంలో విద్యావ్యవస్థ ఎన్నో సమస్యలు ఎదుర్కొంటుందని చెప్పారు. నాణ్యమైన విద్య లభించకపోవడం వల్ల నిరుద్యోగిత పెరుగుతుందని అన్నారు. ఇంజనీరింగ్‌లో సుమారు 70 శాతం మంది విద్యార్థులు సరైన నైపుణ్యాలు లేక నిరుద్యోగులుగానే ఉంటున్నారని తెలిపారు. ప్రస్తుత విధానం వల్ల రాష్ట్రంలోని యూనివర్సిటీలలో అధ్యాపకుల నియామక ప్రక్రియ చేపట్టలేకపోతున్నారని ఉదహరించారు. ఈ విధానంలో మార్పులు జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజారాం యాదవ్ మాట్లాడుతూ, రాజ్యాంగ స్ఫూర్తితో, ఫెడరల్ స్ఫూర్తితో ముందుకు పోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అధికార వికేంద్రీకరణ, స్వయం పాలన జరిగినప్పుడే అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఈ సదస్సులో ఒయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీందర్, చంద్రు నాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు టంకశాల అశోక్ రచించిన తెలి రేకలు పుస్తకాన్ని ప్రారంభించారు.

క్యాన్సర్‌పై 'యశోద' అవగాహన

5కె రన్ నిర్వహణ

మనతెలంగాణ/ హైదరాబాద్ : క్యాన్సర్ వ్యాధి గురించి ప్రజలలో చైతన్య పరిచేందుకు మలక్‌పేటలోని యశోద హాస్పిటల్స్, యశోద క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహించిన క్యాన్సర్ అవేర్‌నెస్ 5కె రన్‌ను నిర్వహించామని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ గోరుకంటి పేర్కొన్నారు. నేడు ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 7.30 గంటలకు జనహిత కార్యక్రమం నిర్వహించనున్నామని యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ పవన్ గోరుకంటి తెలిపారు. క్యాన్సర్ వ్యాధి చికిత్సకు సంబంధించి తమ హాస్పిటల్స్ అంతర్జాతీయ స్థాయిలో రికార్డులు నెలకొల్పాయని వివరించారు. క్యాన్సర్‌కు ఆధునాతనమైన చికిత్సతో పాటు వ్యాధులను నిరోధించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వర్ధమాన నటుడు నవదీప్ ఎల్‌బి నగర్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో 5 కె రన్ ప్రారంభించిన అనంతరం అతి ప్రమాదకరమైన క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజలను చైతన్యవంతం చేసేందుకు 5 కె రన్ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం తదుపరి యశోద హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎ. లింగయ్య మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్ క్యాన్సర్‌కు వైద్యసేవలందించడంలో ప్రపంచస్థాయి ఆసుపత్రుల ధీటుగా సేవలందిస్తున్నాయన్నారు. క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక చికిత్సను అందిస్తూ యశోద హాస్పిటల్స్ ఘనకీర్తిని గడించాయన్నారు. అనంతరం యశోద హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ విజయ్‌కుమార్, ప్రముఖ అంకాలజిస్ట్ జి.వి.కె రెడ్డి మాట్లాడుతూ నానాటికి పెరుగుతున్న కాలుష్యం, ధూమపానం, మితిమీరిన మద్యం కారణంగా ఏటా 12లక్షల మంది భారతీయులు పలు రకాలు క్యాన్సర్ల భారీనపడుతున్నారన్నారు. ప్రజల్లో రోగాల పట్ల అవగాహన కోసం ఈ తరహా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎల్‌బి నగర్ నుంచి సరూర్ నగర్ అక్కడి నుంచి కొత్తపేట ఫ్రూట్ మార్కెట్ వరకు సాగిన 5కె రన్‌లో దాదాపు 10వేల మంది ప్రజలు, యశోద హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





ఓయూకు రూ.107 కోట్లు

రూసా-2ను ప్రారంభించిన ప్రధాని మోడీ

మన తెలంగాణ / హైదరాబాద్/ఉస్మానియాయూనివర్సిటీ: దేశ వ్యాప్తంగా 10 యూనివర్సిటీలు, పలు డిగ్రీ కళాశాలలను ఎంపిక చేసుకుని విద్యా, పరిశోధనల్లో మరింత ముందుకు సాగేందుకు ఉద్దేశించిన 'రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) 'రూసా2' కార్యక్రమాన్ని డిటిటల్ పద్ధతి ద్వారా జమ్మూకాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్ షేర్ ఇ కాశ్మీరి ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ నుంచి భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ రిమోట్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు యూనివర్సిటీలు, కళాశాలలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. డిజిటల్ లాంచింగ్ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ఒక భాగస్వామిగా ఆదివారం ఓ.యూ ఠాగూరు ఆడిటోరియం నుంచి పాల్గొన్నది. ఈ కార్యక్రమానికి ఎంతో ఉత్సాహంతో ప్రొఫెసర్లు, అధికారులు, రీసర్చ్‌స్కాలర్స్, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఠాగూరు ఆడిటోరియం రూసా డిజిటల్ లాంచింగ్‌లో మమేకమైపోయింది. ఆడిటోరియం స్క్రీన్ నుంచి రూసా డిజిటల్ లాంచింగ్‌ను ఆసక్తిగా తిలకించారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ప్రశ్నలు అడగటం, వాటిని ప్రధాని సమాధానాలు చెప్పడాన్ని ఆసక్తిగా పరిశీలించారు. తర్వాత సాగిన ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని సభికులు ఆసక్తిగా విన్నారు. కాగా వారంలో రోజుల్లో ఓ.యూకు కేంద్ర మానవ వనరుల శాఖ నుంచి రూ. 107 కోట్లు విడుదల కానున్నాయి. ప్రధాని ప్రసంగం ముగిసిన తర్వాత ఓ.యూ ఠాగూరు ఆడిటోరియం వేదిక పై నుంచి ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ పాపిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వివిధ యూనివర్సిటీలు, కళాశాలలు నాణ్యత ప్రమాణాలు పెంచుకుంటూ యూజిసి న్యాక్ గుర్తింపు కోసం ప్రయత్నించాలని, అప్పుడే రూసా లాంటి నిధులు పొందడానికి అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్స్ ప్రొ. ఆర్. లింబాద్రి, ప్రొ. వి. వెంకటరమణ, రాష్ట్ర కళాశాల విద్యా కమిషనర్, రూసా డైరెక్టర్ నవీన్ మిట్టల్, రూసా స్టేట్ ప్రాజెక్టు ఆఫీసర్ సౌందర్య జోసఫ్, ఓ.యూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్. గోపాల్ రెడ్డి, ఓఎస్‌డి ప్రొ.టి. కృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వ్యవసాయ రంగంలో గుణాత్మక మార్పులు

- రుణ మాఫీ, ఉచిత విద్యుత్ ప్రత్యామ్నాయాలు మాత్రమే
- విద్యార్థుల సదస్సులో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మనతెలంగాణ/ బాచుపల్లి : వ్యవసాయరంగంలోని సమస్యలను అధిగమించాలంటే ఉచిత విద్యుత్, రుణాల మాఫీలు శాశ్వత పరిష్కారమార్గాలు కావని భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లిలోని విఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన యోగయ్యానాయుడు భవనాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ డి.రామానాయుడు ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. మనదేశంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా పట్టణ ప్రాంతాలలోనే కేంద్రీకరించేవిధంగా ఉండటంతోనే గ్రామీణ ప్రాంతాలు బలహీనమవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించడంతో పాటు గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఇందుకు గాను రైతులకు సకాలంలో రుణాలు అందేలా చూడాలని, సకాలంలో రుణాలను చెల్లించిన వారికి వడ్డీ రేట్లను తగ్గించేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన ధరలతో పాటు మార్కెటింగ్‌ను కల్పించేదిశగా చర్యలు చేపట్టాలని, అప్పుడే చాలా మంది వ్యవసాయరంగంపై మక్కువ చూపుతారన్నారు. ఆహార ఉత్పతుల దిగుబడిలో కొరతలేదన్న ఆయన పోషక విలువల కొరత ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 60శాతం మంది వ్యవసాయంపై ఆదారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కానీ ఒకేరకమైన పంటలను పండించడం వల్లే సమస్యలు అధిగమవుతున్నాయని, ఇందుకు ప్రత్యామ్నయపంటలైన పాల ఉత్పత్తులు, ఫిషరిష్‌పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మన సాంప్రదాయబద్ధమైన ఆహారాన్ని వదిలివేసి ఇన్‌స్టంట్ ఫుడ్స్‌ను తీసుకోవడం వల్ల వ్యాధుల భారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజా జీవితానికి ఎన్నటికీ దూరం కాను

తాను రాజకీయల నుంచి విరామం తీసుకున్నప్పటికీ ప్రజా జీవితం నుంచి విశ్రాంతి తీసుకోబోనని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు స్పష్టంచేశారు. విద్యార్థులతో కలిసి వివిధ అంశాలపై చర్చించడం తనకు చాలా ఇష్టమన్నారు. ఉపరాష్ట్రపతిగా ఇప్పటి వరకు 68 యూనివరిటీల విద్యార్థులతో చర్చించానన్నారు. ప్రతి ఒక్కరు నిత్యం ఓ విద్యార్థిలా తెలుసుకునేందుకు ప్రయత్నిస్తునే ఉండాలన్నారు. పత్రికలు కూడా కేవలం రాజకీయ అంశాలకే పరిమితం కాకుండా జాతికి సంబంధించి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి అధ్యక్షుడు డాక్టర్ డిఎన్ రావు, ప్రధానకార్యదర్శి కె.హరిచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యోగి హెలికాప్టర్ దిగేందుకు నో పర్మిషన్



బాలూర్‌ఘట్ (పశ్చిమ బెంగాల్)/లక్నో : తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి)కి, భారతీయ జనతాపార్టీకి మధ్య ఉన్న శత్రుత్వం ఆదివారం నాడు మరింత వికృతరూపం దాల్చింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ పశ్చిమ బెంగాల్‌లో దిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. ఆదిత్యనాథ్ ఆదివారంనాడు ఇక్కడ బిజెపి ఏర్పాటుచేసిన రెండు ర్యాలీల్లో ప్రసంగించాల్సి ఉంది. అయితే, తప్పనిసరి పరిస్థితుల్లో ఆదిత్యనాథ్ టెలిఫోన్‌లోనే ర్యాలీలనుద్దేశించి ప్రసంగించాల్సి వచ్చింది. తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాల్ని అవలంబిస్తోందని, ముఖ్యమంత్రి మమతాబెనర్జీ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని దుయ్యబట్టారు. యుపి ముఖ్యమంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ ఘోష్ దక్షిణ దినాజ్‌పూర్ జిల్లాలోని బాలూర్‌ఘాట్‌లోను, ఉత్తర దినాజ్‌పూర్ జిల్లాలోని రాయ్‌గంజ్‌లోనూ ప్రసంగించాల్సి ఉంది. ర్యాలీలు నిర్వహించుకునేందుకు బిజెపికి అనుమతి లభించినా, ఈ రెండు ప్రదేశాల్లో ఆదిత్యనాథ్ హెలికాప్టర్ దిగేందుకు జిల్లా యంత్రాంగం అనుమతి నిరాకరించింది.

నేడు భారత్‌కు మొనాకో యువరాజు

న్యూఢిల్లీ : మొనాకో యువరాజు ప్రిన్స్ ఆల్బర్ట్ 2 వారం రోజుల భారత్ పర్యటనకు సోమవారం ఇక్కడికి చేరుకుంటారు. ఆయన ఈ నెల 4నుంచి 10వ తేదీ వరకు భారతదేశంలో పర్యటిస్తారు. తన పర్యటన సందర్భంగా ఆల్బర్ట్ 2 ... వాణిజ్యం, ఇంధనం వంటి అనేక కీలక రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల్ని పటిష్టం చేసుకునేందుకు భారత అగ్రనాయకత్వంతో చర్చలు జరుపుతారు. ప్రిన్స్ సోమవారం ఉదయం ఇక్కడికి చేరుకుంటారు. మధ్యాహ్నం ఇండియా– మొనాకో బిజినెస్ ఫోరం సమావేశానికి హాజరవుతారు. ఆ తర్వాత ఇంధనం, వాతావరణ మార్పులపై రౌండ్ టేబుల్ చర్చల్లో పాల్గొంటారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. మంగళవారం ఆయన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను, ప్రధాని నరేంద్రమోడీని కలుసుకుంటారు. ఆయన పర్యటనలో విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్‌ను కూడా కలుసుకొంటారని మంత్రిత్వశాఖ పేర్కొంది. ఫిబ్రవరి 10న స్వదేశానికి బయలుదేరే ముందు ప్రిన్స్ ఆల్బర్ట్ రాజస్థాన్ కూడా సందర్శిస్తారు.

కాంగ్రెస్‌కు కిశోర్ చంద్రదేవ్ గుడ్‌బై

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. విజయనగరం జిల్లాకు చెందిన సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి కిశోర్ చంద్రదేవ్ కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు. తాను ఏ పార్టీలో చేరేది తర్వాత చెబుతానన్నారు. దీనిపై త్వరలో ప్రకటన చేస్తానని చెప్పారు. విజయనగరం జిల్లా కురుపాంలో మీడియాతో కిశోర్ చంద్రదేవ్ మాట్లాడారు. కాంగ్రెస్‌లో సీనియర్లకు గౌరవం లేనందునే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆయన వెల్లడించారు. దేశ రాజకీయాలు, ప్రస్తుత పరిస్థితిని చూసే కాంగ్రెస్‌ను వీడినట్లు చెప్పారు. ఈ నిర్ణయం ఇప్పటికప్పుడు తీసుకున్నది కాదన్నారు. ఎన్నో రోజులుగా ఆలోచించి పార్టీని వీడానని తెలిపారు.

మోడీ సంస్కరణల వల్ల దేశం ఆదాయం పెరిగింది

మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం నవ భారత నిర్మాణానికి, యువ భారత అభివృద్ధి కోసం పనిచేస్తోందని బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ వ్యాఖ్యానించారు. ప్రధాని చేపట్టిన సంస్కరణల వల్లే దేశంలో ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. ఆదివారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాలకు జిఎస్‌టి ద్వారా అధిక నిధులు వచ్చినప్పటికీ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కె. చంద్రశేఖర్‌రావులు మాత్రం దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వం అవినీతి రహిత పాలనను అందిస్తోందన్నారు. అన్ని రాష్ట్రాలను సమాన దృష్టితో కేంద్రం చూస్తోందన్నారు. అయినప్పటికీ టిఆర్‌ఎస్ ప్రభుత్వం, కేంద్రం నుంచి నిధులు రావడం లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన నిధులపై బహిరంగ చర్చకు తాను సిద్దంగా ఉన్నట్లు దత్తాత్రేయ స్పష్టం చేశారు. ఇందుకు టిఆర్‌ఎస్ ఎంపీలు సిద్ధమా? అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి కిసాన్ పథకం కింద రైతులకు నేరుగా డబ్బులను వారి అకౌంట్లలోకి వేస్తామన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సిజెఐ



మనతెలంగాణ/ తిరుమల ప్రతినిధి : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగోయ్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయం వద్దకు చేరుకున్న జస్టిస్ రంజన్ గొగోయ్, న్యాయమూర్తి శ్రీ ఎన్.వి.రమణలకు టిటిడి కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్కుమార్ సింఘాల్, తిరుమల జెఈవో కె.ఎస్.శ్రీనివాసరాజు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. శ్రీవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో గౌ॥ ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, న్యాయమూర్తి ఎన్.వి.రమణలకు వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. వారికి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్నా, టిటిడి సివిఎస్వో గోపినాథ్జెట్టి, తిరుపతి అర్బన్ ఎస్పీ అన్బురాజన్ , సబ్ కలెక్టర్ డా.మహేష్ కుమార్ , శ్రీవారి ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

12లోగా అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోవాలి

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒకేషనల్ కళాశాలల అనుబంధ గుర్తింపు, అదనపు సెక్షన్లు, సీట్ల అనుమతికి ఈ నెల 12వ తేదీలోగా ఎలాంటి అపరాధ రుసుం లేకుండా యాజమాన్యాలు దరఖాస్తులు సమర్పించాలని ఇంటర్మీడియేట్ బోర్డు కార్యదర్శి ఎ.అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3 వేల అపరాధ రుసుంతో ఈ నెల 25 వరకు, రూ.5 వేల అపరాధ రుసుంతో మార్చి 8 వరకు, రూ.10 వేల అపరాధ రుసుంతో మార్చి 20 వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. వీటితోపాటు కళాశాల బదిలీ, సొసైటీ మార్పు, కళాశాల పేరు మార్పు వంటి దరఖాస్తులు అనుబంధ గుర్తింపు ప్రతిపాదనలతో సమర్పించాలని తెలిపారు. మార్చి 20 తర్వాత ఎలాంటి దరఖాస్తులు స్వీకరించడవని స్పష్టం చేశారు.

బడ్జెట్లో చేనేతకు కేంద్రం తక్కువ కేటాయింపులు

మనతెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్లో చేనేతకు తీరని అన్యాయం జరిగిందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం (సిపిఐ అనుబంధ సంస్థ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో వ్యవసాయం తరువాత రెండో ఉపాధి రంగంగా ఉన్న చేనేత పరిశ్రమపై కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అన్యాయమన్నారు. ఈ రంగానికి ఇటీవల కేటాయించిన కేటాయింపులే దీనికి నిదర్శనమన్నారు. చేనేత రంగానికి నామమాత్రంగా రూ.456 కోట్లు మాత్రమే కేటాయించి చేనేత కార్మికులకు తీరని అన్యాయం చేసిందన్నారు. నేటికి లక్షలాది కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. నోట్ల రద్దు, జీఎస్టీ వల్ల పరిశ్రమ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందని కార్మికులు ఉపాధి కోల్పోయి ఆకలి చావులకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

న్యూజిలాండ్‌తో జరిగిన చివరి వన్‌డేలో విజయం సాధించి టీమిండియా వన్‌డే సిరీస్‌ను 4– 1తేడాతో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చివరి వన్‌డేలో రాణించిన జట్టు సభ్యులను టీమిండియా కెప్టెన్ అభినందించాడు. క్లిష్ట సమయంలో అద్భుతంగా రాణించినం-దుకు వారికి ట్విట్టర్ ద్వారా అభినందనలు తెలియజేశాడు.

మన తెలంగాణ
హైదరాబాద్
సోమవారం 4, ఫిబ్రవరి 2019
www.manatelangana.news

చివరి పంచ్ మనదే..

రాణించిన రాయుడు, శంకర్

4–1తో సిరీస్‌ను దక్కించుకున్న భారత్

వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌తో వన్‌డే సిరీస్‌ను టీమిండియా 4– 1తో ముగించింది. వరసగా మూడు వన్‌డేలను గెలిచిన భారత్ నాలుగో వన్‌డేలో ఘోర పరాజయం పాలయిన విషయం తెలిసిందే. కాగా, ఆదివారం హామిల్టన్‌లో జరిగిన చివరి పోరులోను దాదాపు అదే పరిస్థితి. తొలుత బ్యాట్ చేస్తూ 18 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. పరిస్థితి చూస్తే కనీసం యాభై పరుగులైనా చేస్తుందా లేదా అనిపించింది. అయితే అంబటి రాయుడు, విజయ్ శంకర్‌లు అద్భుతమైన పోరాట పటిమను కనబరచి జట్టును ఆదుకున్నారు. చివర్లో హార్దిక్ పాండ్య, కేదార్ జాదవ్‌లు చెలరేగడంతో టీమిండియా గౌరవప్రదమైన స్కోరు సాధించింది. ఛేదనలో అడపాదడపా వికెట్లు పడుతున్నా కివీస్ గెలిచేలా కనిపించింది.ఆఖర్లో బ్యాట్‌మెన్ మెరుపులు మెరిపించడంతో ఉత్కంఠ పెరిగింది. అయితే భారత బౌలర్లు ముఖ్యంగా చాహల్(3), షమీ(2), పాండ్య(2)లు కట్టుదిట్టంగా బౌల్ చేయడంతో కివీస్‌ను 217 పరుగులకే ఔట్ చేసి సిరీస్‌ను ఘనంగా ముగించింది.

ఆదుకున్నరాయుడు, శంకర్

తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. మ్యాట్ హెన్రీ, ట్రెంట్ బౌల్ట్‌ల బౌలింగ్ ధాటికి రోహిత్ శర్మ(2),శిఖర్ ధావన్(6),శుభ్‌మన్ గిల్(7), ధోనీ(2)లు వరసగా పెవిలియన్‌కు క్యూకట్టారు. పది ఓవర్లలోపే 18 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అంబటి రాయుడు(90;113 బంతుల్లో 8 ఫోర్లు, నాలుగు సిక్స్‌లు), విజయ్ శంకర్ (45;64 బంతుల్లో 5 ఫోర్లు) నిలకడగా ఆడారు. చక్కటి బంతులను వదిలిపెడుతూ, ఏమాత్రం అవకాశం లభించినా ఒకటి, రెండు పరుగులతో స్కోరుబోర్డును ముందుకు సాగిస్తూ గౌరవప్రదమైన స్కోరు సాధించడంపై ఆశలు రేకెత్తించారు. వీరిద్దరూ అయిదో వికెట్‌కు 98 పరుగులు జోడించడంతో జట్టు కోలుకుంది. ఈ దశలో సమన్వయం లోపం కారణంగా శంకర్ రనౌటయ్యాడు. అప్పటికి జట్టు స్కోరు 116. ఆ తర్వాత వచ్చిన కేదార్ జాదవ్ (34; 45 బంతుల్లో 3 ఫోర్లు)తో కలిసి రాయుడు ఆరో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ దశలో సెంచరీకి చేరువైన రాయుడిని హెన్రీ ఔట్ చేశాడు. ఆ తర్వాత కొద్ది సేపటికే జాదవ్ కూడా వెనుదిరిగాడు. ఈ దశలో యువ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య రెచ్చిపోయాడు. జూలు విదిల్చిన సింహంలా ఫోర్లు, సిక్స్‌లు బాదాడు. కేవలం 22 బంతుల్లోనే రెండు ఫోర్లు, అయిదు సిక్స్‌లతో 45 పరుగులు చేసి జట్టు స్కోరును 250 పరుగులకు చేర్చాడు. ఒక దశలో పాండ్య ఒకే ఓవర్‌లో వరసగా మూడు సిక్స్‌లు బాదాడు. రెచ్చిపోతున్న అతడ్ని నీషమ్ ఔట్ చేశాడు. దీంతో టీమిండియా 252 పరుగులకు ఆలౌట్ అయింది.

బౌలర్ల సమష్టి కృషి


అయితే లక్ష్య ఛేదనలో కివీస్ ఎప్పటిలాగానే తడబడింది.18 పరుగుల వద్దే ఓపెనర్ హెన్రీ నికోల్స్(8)ని షమీ ఔట్ చేశాడు. ప్రమాదకరంగా కనిపించిన మరో ఓపెనర్ కొలిన్ మన్రో(24)ను కూడా అతనే పెవిలియన్‌కు పంపించాడు. ఈ దశలో కెప్టెన్ కేన్ విలియమ్సన్(39), టామ్ లేథమ్(37)లు మూడో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. ఈ దశలో భారీ స్కోరు చేసేలా కనిపించిన విలియమ్సన్‌ను కేదార్ జాదవ్ కీలక సమయంలో ఔట్ చేశాడు. కాగా రాస్ (1) విఫలమవడం కివీస్ ఆశలను నీరుగార్చింది. అయితే జేమ్స్ నీషమ్ 32 బంతుల్లో 44 పరుగులు చేసి మరో సారి జట్టు విజయంపై ఆశలు కల్పించాడు. ఈ దశలో అతడ్ని ధోనీ అద్భుతంగా రనౌట్ చేశాడు. చివర్లో మిచెల్ శాంట్నర్(22), మ్యాట్ హెన్రీ(17)లు కాస్సేపు పోరాడినా చాహల్ వారిని నిలువరించడంతో కివీస్ పోరు 217 పరుగుల వద్దే ముగిసింది. దీంతో 35 పరుగుల తేడాతో టీమిండియా విజయం సాధించి అయిదు వన్‌డేల సిరీస్‌ను 4– 1తేడాతో దక్కించుకుంది. 90 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అంబటి రాయుడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కగా, అన్ని మ్యాచ్‌లలోను చక్కగా రాణించిన మహమ్మద్ షమీకి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కింది. ఇక ఈ రెండు జట్ల మధ్య మూడు మూడు మ్యాచ్‌ల టి 20 సిరీస్‌లో తొలి మ్యాచ్ బుధవారం జరుగుతుంది.





మరోసారి కుప్పకూలిన ఇంగ్లాండ్

రెండో టెస్ట్‌లో విండీస్ ఘనవిజయం



ఆంటిగ్వా : దాదాపు పదేళ్ల తర్వాత వెస్టిండీస్ ఇంగ్లాండ్‌పై టెస్టు సిరీస్‌లో విజయం సాధించింది. ఆంటిగ్వాలో జరిగిన రెండో టెస్టులో కేవలం మూడు రోజుల్లోనే 10 వికెట్ల తేడాతో విజయం సాధించి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే మూడు టెస్టుల సిరీస్‌ను 2–0 తేడాతో సొంతం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 187 పరుగులకే కుప్పకూలిన విషయం తెలిసిందే. దీనికి సమాధానంగా వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 306 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో వెస్టిండీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 119 పరుగుల ఆధిక్యత లభించింది. బౌలర్లకు అనుకూలించే పిచ్‌పై 215 బంతులను ఎదుర్కొని అర్ధ సెంచరీ చేసిన డారెన్ బ్రావో చివరగా అవుటయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో పేలవమైన ప్రదర్శనతో కుప్పకూలిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో అంతకన్నా ఘోరంగా ఆడింది. కేవలం 132 పరుగులకే కుప్పకూలింది. వెస్టిండీస్ కెప్టెన్ హోల్డర్ (4– 43), మరో ఫాస్ట్ బౌలర్ రోచ్ (4– 52)ల ధాటికి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్ పెవిలియన్‌కు క్యూకట్టారు. ఒక్క జోస్ బట్లర్ మాత్రమే 24 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. విజయానికి అవసరమైన 14 పరుగులను విండీస్ ఓపెనర్లు కేవలం మూడు ఓవర్లలోనే సాధించి చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. కాగా శనివారం ఆట ప్రారంభం కావడానికి ముందు వెస్టిండీస్ బౌలర్ జోసెఫ్ తల్లి మరణించినట్లు తెలిసినప్పటికీ అతను ఆట్టలో కొనసాగి ఆట పట్ల తనకున్న అంకిత భావాన్ని చాటాడు.



ముంబయిలో ఆదివారం జరిగిన లాక్మే ఫ్యాషన్ వీక్‌లో ర్యాంప్‌పై హొయలొలికిస్తున్న బ్యాడ్మింటన్ క్రీడారిణి పివి సింధు.

ఇంతకన్నా ఏం కోరుతాను



వెల్లింగ్టన్ : న్యూజిలాండ్‌తో చివరి వన్‌డేలో సత్తా చూపిన ఆటగాళ్లను టీమిండియా తాత్కాలిక సారథి రోహిత్ శర్మ ప్రశంసించాడు. కఠిన పరిస్థితుల్లో తమను తాము పరీక్షించుకోవాలని భావించామని చెప్పాడు. నాలుగో వన్‌డేలో భారత్ 92 పరుగులకే కుప్పకూలి ఘోరపరాజయం పాలయిన విషయం తెలిసిందే. అయిదో వన్‌డేలో సైతం కేవలం 18 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయిన టీమిండియాను అంబటిరాయుడు, విజయ్ శంకర్, హార్దిక్ పాండ్యా, కేదార్ జాదవ్‌లు ఆదుకున్నారు. 'నాలుగు వికెట్లు చేజార్చుకున్న తర్వాత ఎవరైనా ఒక్కరు రాణించాలని కోరుకున్నాం. రాయుడు, శంకర్‌లు ఆ పని చేశారు. వారి భాగస్వామ్యం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. చివర్లో పాండ్యా, జాదవ్‌లు మెరుపులు మెరిపించారు. మేమెంతో పట్టుదల ప్రదర్శించాం. మ్యాచ్ జరుగుతున్న కొద్దీ వికెట్ ఫ్లాట్‌గా మారింది. ఒకానొక దశలో చేజింగ్ సులభమవుతుందని అనుకున్నాం. అయితే బౌలర్లు సమష్టిగా రాణించారు. కీలక సమయాల్లో బాట్స్‌మెన్‌ను ఔట్ చేశారు. ఇంతకన్నా నేను వారినుంచి ఏం ఆశిస్తాను. మ్యాచ్ గెలవాలంటే జట్టు కూర్పు బాగుండాలి. ఏది ఏమయినా న్యూజిలాండ్ వచ్చి ఆతిథ్య జట్టును 4– 1 తేడాతో ఓడించడమే ఒక గుర్తింపు' అని రోహిత్ అన్నాడు.

నేటి నుంచి రంజీ ఫైనల్

విదర్భతో సౌరాష్ట్ర ఢీ

నాగపూర్ : దేశవాళీ మెగా టోర్నీ రంజీ ట్రోఫీ క్రికెట్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ విదర్భతో సౌరాష్ట్ర తలపడనుంది. ఆదివారంనుంచి ఇక్కడ జరిగే ఈ మ్యాచ్‌లో జాతీయ జట్టు ఆటగాళ్లు చటేశ్వర పుజారా, ఉమేశ్ యాదవ్‌ల మధ్య ప్రత్యేక పోరు నడిచే అవకాశముంది. పరుగుల యంత్రంగా పేరొందిన పుజారా విదర్భను ఫైనల్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించగా, కీలక మ్యాచ్‌లలో అద్భుతంగా రాణించిన ఉమేశ్ తమ జట్టును ఫైనల్‌కు చేర్చడంలో కీలకపాత్ర పోషించాడు. పుజారా బ్యాటింగ్ సౌరాష్ట్రకు ప్లస్ పాయింట్ కాగా, వెటరన్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ విదర్భ బ్యాటింగ్‌కు అండగా నిలుస్తున్నాడు. కేరళతో జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో 12 వికెట్లు కూల్చిన ఉమేశ్ యాదవ్ ఒంటి చేత్తో విదర్భను ఫైనల్‌కు చేర్చాడు. కాగా జాఫర్ రంజీ ఫైనల్లో ఆడడం ఇది పదో సారి. ఇంతకు ముందు ఎనిమిది సార్లు ముంబయి తరఫున ఫైనల్లో ఆడిన అతను ఇప్పుడు విదర్భ తరఫున రెండో సారి ఫైనల్లో ఆడబోతున్నాడు. కాగా గత ఆరేళ్లలో సౌరాష్ట్ర రంజీ ఫైనల్‌కు చేరడం ఇది మూడో సారి.

కోహ్లీ సేనే ప్రపంచకప్‌లో ఫేవరేట్

ఏ పిచ్‌పైనైనా రాణించే సత్తా ఉంది : సచిన్



కోల్‌కతా : ఐసిసి వన్‌డే ప్రపంచకప్‌లో టీమిండియా ఫేవరేట్ అనే విషయంలో తనకు ఎలాంటి సందేహం లేదని దిగ్గజ క్రికెటర్ సచిన్ తెండూల్కర్ అన్నాడు. కోహ్లీ సేనకు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఏ పిచ్ పైనైనా రాణించగల సత్తా ఉందని అన్నాడు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లపైన భారత్ వన్‌డే సిరీస్‌లను గెలుచుకున్న విషయాన్ని సచిన్ గుర్తు చేశాడు.' టీమిండియా చక్కటి సమతూకంలో ఉంది. ఈ జట్టు ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఎక్కడైనా పోటీ పడగలదు. జట్టు ప్రదర్శనలు చూస్తుంటే భారత్ ఫేవరేట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇంగ్లాండ్ గడ్డపై త్వరగా జోరందుకోవడం ముఖ్యం. ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ గట్టి పోటీదారు. న్యూజిలాండ్ సైతం అలాగే కనిపిస్తోంది. ప్రస్తుత సిరీస్‌లో కాస్త ఇబ్బంది పడినా కివీస్‌జట్టు చాలా బాగుంది.స్టీవ్‌స్మిత్, డేవిడ్ వార్నర్‌లు జట్టులోకి వస్తే ఆస్ట్రేలియా బలపడుతుంది. కానీ వన్‌డేలలో కేవలం కొన్ని ఓవర్లలోనే మ్యాచ్ మలుపు తిరుగుతుంది. అందుకే ఆ జట్టుకు 50 శాతమే అవకాశముంది' అని సచిన్ అన్నాడు. కాగా, క్రీడల్లో మహిళలు దేశానికి పేరు తీసుకు వస్తున్నారని కొనియాడాడు. స్వప్న బర్మన్, ద్యుతి చంద్, హిమదాస్‌లు మహిళా సాధికారికతకు నిలువుటద్దాలని కొనియాడాడు.

బౌన్సీ పిచ్‌లపై.. ఇంకా తడబాటే!

మన తెలంగాణ / క్రీడావిభాగం : వరుస విజయాలతో దూకుడు మీదున్న భారత్‌కు నాలుగో వన్డేలో న్యూజిలాండ్ జట్టు దిమ్మ తిరిగే షాక్ ఇచ్చింది. బౌన్సీ పిచ్‌లపై భారత బ్యాట్స్‌మెన్ తడబాటును ఈ మ్యాచ్ ద్వారా మరోసారి బహిర్గతమైంది. సాధారణ పిచ్‌లపై అసాధారణ రీతిలో చెలరేగి పోయే భారత బ్యాట్స్‌మెన్‌కు ఫాస్ట్ బౌలింగ్‌కు అనుకూలించే గ్రౌండ్‌లో చతికిల పడడం అలవాటుగా మారింది. తాజాగా ఈ విషయం కివీస్‌తో హామిల్టన్‌లో జరిగిన నాలుగో వన్డేలో మరోసారి రుజువైంది. స్పిన్‌తో పాటు ఉపఖండం పిచ్‌లపై భారత బ్యాట్స్‌మెన్ పరుగుల వరద పారించడం అలవాటుగా చేసుకున్నారు. ఇటీవల భారత్ వన్డేల్లో సాధిస్తున్న విజయాలే దీనికి నిదర్శనంగా చెప్పొచ్చు. కానీ, కాస్త బౌన్సీగా ఉండే మైదానాల్లో మాత్రం స్వల్ప స్కోర్లకే పరిమితం కావడం టీమిండియాకు బలహీనతగా మారింది. గతంలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు, వన్డే సిరీస్‌లలో భారత బ్యాట్స్‌మెన్ స్వల్ప లక్ష్యాలను సయితం ఛేదించలేక చేతులెత్తేశారు. తాజాగా కివీస్‌తో జరిగిన వన్డేలో కూడా ఇలాంటి ఫలితమే పునరావృతమైంది. హేమాహేమీలతో కూడిన భారత బ్యాటింగ్ లైనప్ కివీస్ స్పీడ్ స్టర్ ట్రెంట్ బౌలింగ్‌కు విలవిల్లాడి పోయింది. అందరూ కలిసి కనీసం వంద పరుగులు కూడా సాధించలేక పోయారు. అంతకు ముందు జరిగిన మూడు వన్డేల్లో కూడా భారత బ్యాట్స్‌మెన్ అద్భుతంగా రాణించారు. కానీ, కాస్త బౌన్సీ పిచ్ ఎదురు కాగానే తక్కువ స్కోరుకే కుప్పకూలి ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో కూడా భారత్ టెస్టుల్లో, వన్డేల్లో స్వల్ప లక్ష్యాలను కూడా అందుకోలేక పోయింది. ఫాస్ట్ బౌలర్లను ఎదుర్కొవడంలో భారత బ్యాట్స్‌మెన్ బలహీనత జట్టుకు ప్రతికూలంగా మారింది.





లోపాన్ని అధిగమించాలి..

రానున్న ప్రపంచకప్ నేపథ్యంలో భారత్ తన లోపాన్ని సాధ్యమైనంత త్వరగా సరిదిద్దు కోవాల్సిన అవసరం ఉంది. వరల్డ్‌కప్‌కు కొన్ని నెలల వ్యవధి మాత్రమే మిగిలివుంది. అయితే ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉండే ఇంగ్లండ్ పిచ్‌లపై జరుగుతున్న ప్రపంచకప్ భారత్‌కు సవాలుగా మారింది. ఫాస్ట్ పిచ్‌లపై తడబడే అలవాటు భారత్‌ను కలవరానికి గురి చేస్తోంది. ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన సిరీస్‌లో, తాజాగా కివీస్‌తో జరుగుతున్న సిరీస్‌లో భారత బ్యాట్స్‌మెన్ బాగానే ఆడారు. అయితే బౌన్సీ పిచ్‌లపై మాత్రం భారత బ్యాట్స్‌మెన్ పూర్తిగా చేతులెత్తేశారు. ఆస్ట్రేలియాతో జరిగిన రెండో వన్డే, ఇటీవల కివీస్‌తో జరిగిన నాలుగో వన్డేలో భారత బ్యాట్స్‌మెన్ పూర్తిగా విఫలమయ్యారు. ఇది జట్టును కలవర పెట్టే అంశమే. ఇలాంటి పరిస్థితుల్లో బౌన్సీ పిచ్‌లపై మరింత మెరుగ్గా ఆడేలా బ్యాట్స్‌మెన్‌లలో ఆత్మవిశ్వాసం నింపాల్సిన అవసరం ప్రధాన కోచ్‌పై ఎంతైనా ఉంది. రవిశాస్త్రి, సంజయ్ బంగర్‌లు ఈ విషయంలో మరింత దృష్టి పెట్టాలి. ప్రస్తుతం టీమిండియాలో ప్రతిభావంతులకు కొదవలేదు. అయితే వారిని మరింత మెరుగైన బ్యాట్స్‌మెన్‌గా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా యువ ఆటగాళ్లు శుభ్‌మన్ గిల్, జాదవ్, రాయుడు, రాహుల్, పాండ్య తదితరులు బౌన్సీ పిచ్‌లపై మరింత బాగా ఆడేలా కోచ్‌లు కృషి చేయాలి. ఇప్పటికీ భారత్ కొంత మంది ఆటగాళ్ల రాణింపుపైనే ఆధారపడి ఉంది. ఓపెనర్లు శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, కెప్టెన్ విరాట్ కోహ్లీ, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్‌లు మాత్రమే భారత విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నారు. ధోని కూడా ఆస్ట్రేలియా సిరీస్‌లోనే రాణించాడు. ఇక, ఇటీవల కాలంలో కోహ్లీ, ధావన్, రోహిత్‌లే నిలకడగా రాణిస్తున్నారు. వీరిలో ఎవరో ఒకరూ జట్టును గెలిపిస్తున్నారు. మిగతావారు అంతగా ఆకట్టుకోలేక పోతున్నారు. ఇకనైనా భారత ఆటగాళ్లు తమ బ్యాటింగ్‌ను మెరుగుపరుచు కోవడంపై దృష్టి పెట్టాలి. అప్పుడే ప్రపంచకప్‌లో మెరుగైన అవకాశాలు ఉంటాయి.

పదిహేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి వీధులలో పండ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్న బొడ్డు నరసింహులు యాదవ్ తన సొంతూరు దుబ్బాక నియోజకవర్గంలోని తొగుల మండలానికి చెందిన చందాపూర్ గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు వకులాభవరణం కృష్ణ మోహన్‌రావు ఆదివారం సర్పంచ్‌గా ఎన్నికైన నరసింహులును తన గృహానికి భోజనానికి ఆహ్వానించి తనపాగా, శాలువాతో సన్మానించారు.

విశాల

పట్టాలు తప్పిన సీమాంచల్

- ఆరుగురి దుర్మరణం • 29 మందికి గాయాలు
- ట్రాక్‌పై పగుళ్లతోనే ప్రమాదం?



సోన్పూర్ (బీహార్) : ఢిల్లీకి వెళ్లే సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు పట్టాలు తప్పింది. ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఈ దుర్ఘటనలో కనీసం ఆరుగురు ప్రయాణికులు మృతి చెందారు. 29 మంది గాయపడ్డారు. బీహార్‌లోని వైశాలీ జిల్లాలో ఈ రైలు పట్టాలు తప్పడంతో 11 బోగీలు పక్కకు ఒరిగిపొయ్యాయని దీనితో ప్రయాణికులు మృతి చెందారని రైల్వే , స్థానిక పోలీసు వర్గాలు తెలిపాయి. కిషన్‌గంజ్ జిల్లాలోని జొగ్బనీ నుంచి బయలుదేరిన ఈ రైలు తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో సోన్పూర్ రైల్వే డివిజన్‌లోని మహనార్ రోడ్ సమీపంలో మహనార్ దరిదాపులలోని సహదాయి బుజుర్గ్ వద్ద పట్టాలు తప్పింది. ట్రాక్‌పై పగుళ్లతోనే రైలు పట్టాలు తప్పిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని ఈస్ట్ సెంట్రల్ జోన్ సమాచార అధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఒక జనరల్ కోచ్, ఒక ఎసి కోచ్ బి 3, మూడు స్లీపర్ కోచ్‌లు, మరో ఆరు కోచ్‌లు పట్టాలు తప్పాయని వెల్లడించారు. ప్రమాదంలో ఎడుగురు మృతి చెందినట్లు తొలుత రైల్వే వర్గాలు తెలిపాయి. అయితే తరువాత ఇచ్చిన వివరణలో ఆరుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. గాయపడ్డ 29 మందిలో ఇద్దరికి తీవ్రంగా గాయాలు అయినట్లు వెల్లడైంది. ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ 5 లక్షల పరిహారం అందిస్తున్నట్లు రైల్వే మంత్రి కార్యాలయం ప్రకటన వెలువరించింది. తీవ్రంగా గాయపడ్డ వారికి రూ 1 లక్ష చొప్పున, స్వల్ప గాయాలు అయిన వారికి రూ 50వేలు చొప్పున సాయం అందిస్తారు. ప్రమాద ఘటనాస్థలికి అవసరమైన రీతిలో వైద్య సంచార సహాయక బృందాలు చేరుకున్నాయి.

రైతులకు సాయం పెంచుతాం : జైట్లీ



న్యూయార్క్ : సన్నకారు రైతులకు ఇవ్వసంకల్పించిన నెలవారీ రూ 500 సాయం మొత్తం ఇక ముందు పెరుగుతుందా? ఈ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వనరుల సమృద్ధిని బట్టి ఇక ముందు పెంచే అవకాశం ఉందని కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ సూచనప్రాయంగా తెలిపారు. అమెరికాలో జైట్లీ చికిత్స పొందుతున్నారు. రైతులకు అందించే నెల వారి మొత్తాన్ని రాష్ట్రాలు తమతమ ఆర్థిక సహాయ పథకాల పరిధిలో పెంచుకోవచ్చునని సూచించారు. తాత్కాలిక బడ్జెట్‌లో రైతుల సహాయ పథకంపై రాహుల్ గాంధీ విమర్శలు సరికావని జైట్లీ తాము చికిత్స పొందుతున్న ఆసుపత్రి నుంచే పిటిఐతో ఇంటర్వ్యూలో తెలిపారు. రైతులకు రోజువారిగా రూ 17 ఇవ్వచూపిందని రాహుల్ మండిపడటం మంచిపద్ధతి కాదని, ప్రతిపక్ష నేత ఇకనైనా కొంచెం ఎదగాల్సి ఉందని, మరీ ఇంత చిన్నపిల్లల మాటలకు దిగడం సరికాదన్నారు. జరగబోయేవి జాతీయ సార్వత్రిక ఎన్నికలనుకుంటున్నారా? లేక కాలేజీ యూనియన్ ఎన్నికలుగా భావిస్తున్నారా? అని రాహుల్‌ను నిలదీశారు.

అయిదో రోజుకు చేరిన హజారే దీక్ష



న్యూఢిల్లీ : రాలెగావ్ సిద్ధి (మహారాష్ట్ర): సామాజిక ఉద్యమ కార్యకర్త అన్నా హజారే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష ఆదివారం నాటికి అయిదో రోజుకు చేరుకుంది. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌లో అన్నా హజారే చేస్తున్న ఆందోళనకు మద్దతిస్తున్న గ్రామీణులు రాష్ట్ర రహదారిని దిగ్బంధించారు. దాంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. అవినీతిని ప్రతిఘటించేందుకు కేంద్రంలోను, మహారాష్ట్రలోనూ నిఘా వ్యవస్థ ఉండాలని, రైతుల సమస్యల పరిష్కారానికి ఒక తీర్మానాన్ని చేయాలని డిమాండ్ చేస్తూ హజారే గత బుధవారం నుంచీ నిరాహార దీక్ష చేస్తున్నారు. 81 ఏళ్ల ఈ ఉద్యమకారుడి దీక్షకు మద్దతుగా రైతులు, యువకులు ఇక్కడికి 38 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్నర్ తహసిల్‌లోని సుపా గ్రామంలో అహ్మద్ నగర్–పుణె రాష్ట్ర రహదారిని దిగ్బంధం చేశారు. అవినీతి నిరోధానికి కేంద్ర స్థాయిలో లోక్‌పాల్‌ను నియమించాలని, రాష్ట్రాల్లో చట్టబద్ధమైన నిఘా వ్యవస్థలు లేనిచోట్ల లోకాయుక్తలను ఏర్పాటు చేయాలన్న హజారే డిమాండ్లను వారు సమర్థించారు.


పైకప్పు కూలి ముగ్గురి మృతి

థానే : ఒక క్లినిక్‌లో పైకప్పు కూలి రెండేళ్ల పాపతో సహా ముగ్గురు మరణించారు. మహారాష్ట్రలోని థానే జిల్లా ఉల్హాస్‌నగర్‌లో ఆదివారం ఈ సంఘటన జరిగిందని అగ్నిమాపక దళ అధికారి ఒకరు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలోఉల్హాస్‌నగర్ టౌన్‌షిప్ శివాజీ చౌక్ దగ్గర క్యాంప్ 3 ప్రాంతంలో మేమ్‌సాబ్ బిల్డింగ్‌లో జరిగిన ఈ ప్రమాదంలో మరో ముగ్గురు గాయపడ్డారని ఆయన చెప్పారు. మృతులను నీతూ సద్జా (60), అనితా మౌర్య (25), ప్రియా మౌర్య (2)గా గుర్తించామని ఉల్హాస్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ ఫైర్ ఆఫీసర్ భాస్కర్ మిర్బాగర్ అన్నారు. అయిదంతస్థుల భవంతిలో రెండో అంతస్థు కూలి మొదటి అంతస్థుపై పడిందని, అది గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న క్లినిక్ పై పడిందని యుఎంసి డిజాస్టర్ సెల చీఫ్ బాలాసాహెబ్ నెట్కే చెప్పారు. ఈ భవనాన్ని స్వాధీనం చేసుకుంటామని, ఈ దుర్ఘటనపై దర్యాప్తునకు ఆదేశించామని ఆయన తెలిపారు.

దృష్టి లోపం ఉన్నవారికి బ్రెయిలీ ఓటర్ స్లిప్‌లు

న్యూఢిల్లీ : దృష్టి లోపం ఉన్నవారికి, అంధులకు రాబోయే లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో బ్రెయిలీ ఓటర్ స్లిప్‌లను ఇస్తారు. చూపు మందగించినవారు లేదా అంధులు చదవడానికి వీలుగా బ్రెయిలీలిపి ఉంది. పేపర్‌పై అక్షరాలు ఉబ్బెత్తుగా ఉంటాయి. వాటిని తడుముతూ వారు అక్షరాల్ని చదవగలుగుతారు. ప్రింట్ మెటీరియల్‌ను చదవలేనివారికి ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వేసవి జరగబోయే లోక్‌సభ ఎన్నికలకు చేస్తున్న ఏర్పాట్లలో భాగంగా వీరికి బ్రెయిలీ లిపిలో ఉన్న ఫోటో ఓటర్ స్లిప్‌లను ఇవ్వాలని ఎన్నికల సంఘం రాష్ట్రాల్లోని ముఖ్య ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బ్రెయిలీ స్లిప్‌లను ఉపయోగించారు. దేశంలో దృష్టి మాంద్యం ఉన్నవారికి బ్రెయిలీలో ఎన్నికల ఫోటో ఐడెంటిటీ కార్డులు అందించాలని ఎన్నికల సంఘం ఆలోచిస్తోంది.

పద్మశ్రీని వాపస్ చేసిన మణిపురి డైరెక్టర్



ఇంఫాల్ : తనకిచ్చిన పద్మశ్రీ అవార్డును వాపస్ ఇస్తున్నానని అంతర్జాతీయంగా పేరున్న మణిపురి దర్శకుడు అరిబామ్ శ్యాం శర్మ ఆదివారం ప్రకటించారు. పౌరసత్వం (సవరణ) బిల్లు 2016కు వ్యతిరేకంగా ప్రజలు చేపట్టిన ఆందోళనలకు సంఘీభావం ప్రకటిస్తూ ఇలా వాపస్ ఇస్తున్నానని అరిబామ్ తెలిపారు. తన నివాసంలో ఆయన మాట్లాడుతూ... మణిపూర్ ప్రజలకు రక్షణ కావాలన్నారు. 500 మందికి పైగా సభ్యులున్న పార్లమెంటులో మణిపురికి కేవలం ఒకరిద్దరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారని, పార్లమెంటులో ఈశాన్య ప్రాంతపు గొంతు ఎంతవరకు వినిపిస్తోందని ప్రశ్నించారు. 'రాష్ట్రం చిన్నదా, పెద్దదా అని చూడకుండా వాళ్లు మాకు గౌరవం ఇవ్వాలి. రాష్ట్రాల కలయికతోనే కేంద్రప్రభుత్వం ఏర్పడింది కాబట్టి నేను ఈ అంశాన్ని లేవనెత్తాను. ఈశాన్య రాష్ట్రాలు సంయుక్తంగా ప్రాతినిధ్యం వహించినప్పుడు, ప్రభుత్వానికి ఏదైనా నివేదించినప్పుడు అది దాన్ని లెక్కలోకి తీసుకోవాలి. అలా చేయకుంటే మేము వ్యతిరేకించాల్సి వస్తుంది' అని మేము వ్యతిరేకించాల్సి ఉంటుంది' అని అరిబామ్ చెప్పారు.

యుపిలో 12 లక్షల మంది తొలి ఓటర్లు

లక్నో : రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో 12 లక్షలమంది యువతీయువకులు మొదటిసారి తమ ఓటుహక్కును వినియోగించుకోబోతున్నారు. రాష్ట్రంలో మొత్తం 14.40 కోట్లమంది ఓటర్లున్నారు. 'రాష్ట్ర ఓటర్ల జాబితాలో కొత్తగా 12,36,000 మంది పేర్లను చేర్చాము. జాబితాలో 18–19 సంవత్సరాల వయసున్నవారు 16.75 లక్షల మంది ఉన్నారు' అని ఉత్తరప్రదేశ్ ఎన్నికల ముఖ్య అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతిసారీ లోక్‌సభకు 80 మంది ఎంపీలను పంపే రాజకీయంగా కీలకమైన ఈ రాష్ట్రంలో ఓటర్లను ఆకట్టుకునేందుకు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

బహిరంగ మలవిసర్జనకు స్వస్తి

న్యూఢిల్లీ : స్వచ్ఛ భారత్ కార్యక్రమం కింద దేశంలో నాలుగువేలకు పైగా పట్టణ నగరాలను బహిరంగ మల విసర్జనకు (ఓడిఎఫ్) స్వస్తి పలికినట్టు ప్రకటించడం జరిగిందని గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారి ఒకరు చెప్పారు. దేశంలోని మొత్తం 4,378 పట్టణ నగరాల్లో 4,140ల్లో ఇప్పటికే ఓడిఎఫ్‌ను ప్రకటించాయని అన్నారు. వచ్చే నెలకల్లా దాదాపు అన్ని పట్టణాలూ స్వచ్ఛ్ భారత్ కింద అమలుచేసే ఓడిఎఫ్ కిందికి వస్తాయి. మోడీ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన కార్యక్రమం ఇది. జనవరి 31న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ... స్వచ్ఛ్ భారత్ అభియాన్ కింద దేశంలో తొమ్మిది కోట్ల మరుగు దొడ్లను నిర్మించారు. 2014లో 40శాతం కంటే తక్కువగా ఉన్న గ్రామీణ పారిశుద్ధ్యం ఇప్పుడు 98 శాతానికి పెరిగింది', 62,42,223 వ్యక్తిగత టాయిలెట్లు నిర్మించాలన్న లక్ష్యంలో 93 శాతాన్ని పూర్తి చేయడం జరిగిందని, మరో అయిదు లక్షల టాయిలెట్లను నిర్మిస్తే వంద శాతం సాధించినట్టవుతుందని ఆ అధికారి తెలిపారు.

వాళ్లకు కోట్లు.. రైతులకు చిల్లరా?



మోడీ బడ్జెట్ తీరుపై రాహుల్ ధ్వజం

పాట్నా : లంచగొండులకు కోటానుకోట్లు, పేద రైతులకు చిల్లర పైసలా? ఇదేం తీరు అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కేంద్ర బడ్జెట్ తీరు తెన్నులపై ఆదివారం నిప్పులు చెరిగారు. సంపన్నులు అందులోనూ అవినీతిపరులకు విధివిధానాలకు అతీతంగా కోట్లు కోట్లు పంరిపెట్టారు. అయితే రైతాంగానికి కేవలం రోజుకు రూ 17 చొప్పున అందించారని రాహుల్ అన్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ పథకం పేద రైతులకు ఎటువంటి ఆసరాను కల్పించబోదని స్పష్టం చేశారు. స్థానిక గాంధీ మైదాన్‌లో జరిగిన సభలో రాహుల్ ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పాట్నా యూనివర్శిటీకి సెంట్రల్ యూనివర్శిటీ ప్రతిపత్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రసిద్ధ గాంధీ మైదాన్‌లో కాంగ్రెస్ సభ జరగడం 28 ఏళ్ల తరువాత ఇదే మొదటిసారి. బిజెపి కేవలం వాగ్దానాలకు దిగుతుందని, అయితే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటుందని, ఇది వారికి తమకు ఉన్న తేడా అని తెలిపారు. ఇక్కడి వారిలో ఎవరి ఖాతాలో అయినా ప్రధాని మోడీ గతంలో చెప్పినట్లు రూ 18 లక్షలు వచ్చి పడ్డాయా? రైతు కుటుంబానికి కొత్త బడ్జెట్‌లో కల్పించింది కేవలం రోజకు రూ 17 అని, ఇదీ వారి మాటలకు చేతలకు ఉన్న తేడా అని విమర్శించారు. ఇటీవల కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో రైతు రుణమాఫీ తక్షణమే జరిగిందని,ఇ ందుకు తాను ఆయా రాష్ట్రాల సిఎంలను అభినందిస్తున్నానని చెప్పారు. బీహార్‌లో బిజెపి– జెడియు కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని రాహుల్ స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఈ కూటమిని ప్రజలు తిప్పికొడుతారని చెప్పారు. బీహార్ అన్నింటా వెనుకబడి పోయింది. విద్యా, ఉపాధి ఉద్యోగ అవకాశాలు హరించుకుపొయ్యాయని , ఇక బీహారీ యువత బిజెపి పాలిత ఇతర రాష్ట్రాలకు వెళ్లితే వారిని కొట్టి తరిమివేస్తున్నారని ఇదేం న్యాయం అని విమర్శించారు. ఇక్కడ అవకాశాలు కల్పించడం లేదు...వేరే దగ్గర ఉండనివ్వడం లేదని వారి పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు.

పనిచేసే వారిపైనే ప్రజల ఆశలు

లోక్‌సభ ఎన్నికలకు బిజెపి నినాదం



న్యూఢిల్లీ : పని చేసే వారినే ప్రజలు కోరుకుంటారు... అనేదే లోక్‌సభ ఎన్నికలకు బిజెపి ప్రచార ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. గత లోక్‌సభ ఎన్నికలలో బిజెపి సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదంతో ప్రజల వద్దకు వెళ్లింది. ఈసారి దీనికి బదులుగా కామ్ కరో జో.....ఉమీద్ ఉసీ సే హో అనేది నినాదంగా ఉంటుందని పార్టీ అధ్యక్షులు అమిత్ షా చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బిజెపి నెలరోజుల పాటు సాగే భారత్ కే మన్ కీ బాత్...మోడీకే సాథ్ కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా నే ఫలితాలను చూపెట్టిన వారినే ప్రజలు ఆశిస్తారు. కోరుకుంటారని ఈ కోణంలోనే తమ ఎన్నికల నినాదం ఉంటుందని బిజెపి తెలిపింది. తాము సిద్ధం చేసే ఎన్నికల ప్రణాళికను సంకల్ప్ పత్ర్‌గా పేర్కొంటూ, దీనికి దేశవ్యాప్తంగా పదికోట్ల మంది స్పందనను బిజెపి కోరింది.

ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల స్పందనకు అనుగుణంగా వారి సూచనల ప్రాతిపదికనే రూపొందించడం జరుగుతుందని, ప్రజాస్వామ్య పటిష్టతలో ఇది బిజెపి చేపడుతున్న వినూత్న పంథా అని అమిత్ షా వివరించారు. ప్రజలు ఎటువంటి దేశాన్ని కోరుకుంటున్నారు? ఇందుకు వారి సూచనలు సలహాలు ఏమిటనేది వారి నుంచి తెలుసుకుని అందుకు అనుగుణంగానే ప్రజా ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా పార్టీ ఎన్నికల పత్రం సంకల్ప్ పత్ర్‌గా రూపొందుతుందని షా వివరించారు. నెలరోజుల పాటు సాగే కార్యక్రమంలో ప్రజల వైఖరిని తెలుసుకుంటామని చెప్పారు. నవ భారత నిర్మాణం అనేది ఓ కల. దీనిని సాకారం చేసేందుకు ప్రజల స్పందననే ప్రాణప్రదం అవుతుందన్నారు. కార్యక్రమం ప్రారంభసూచకంగా దేశ రాజధానిలో పార్టీ వారు ఒక హోటల్‌కు వెళ్లారు. అక్కడ ఒక వెయిటర్ నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ విధంగా తమ దేశవ్యాప్త స్పందన సేకరణ పని మొదలైందని తెలిపారు.

గెలుస్తా.. ప్రధానిగా తిరిగొస్తా..

- ఎసి రూంల వారికి ఆరువేలంటే చులకన
- లేహ్, లడక్ సభలలో ప్రధాని మోడీ

లేహ్/లడఖ్ : వచ్చే లోక్‌సభ ఎన్నికలలో గెలుపు తమదే అని, తిరిగి తానే ప్రధానినని జమ్మూ కశ్మీర్ సభలలో ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. లేహ్, లడఖ్ ప్రాంతాలలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు మోడీ ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు, ప్రత్యేకించి కాంగ్రెస్‌పై తీవ్రస్థాయి విమర్శలకు దిగిన ప్రధాని ఎన్నికలలో విజయం పట్ల అపారధీమా వ్యక్తం చేశారు. తాను లేహ్, లడఖ్‌లలో ఇప్పుడు పలు పనులకు శంకుస్థాపనలకు వచ్చానని, తిరిగి ప్రధాని అయి వీటిని తానే ప్రారంభించడం జరుగుతుందని చెప్పారు. తాను ఇంతకు ముందు చేపట్టిన పనులను పూర్తి చేసి తానే వచ్చి ఆరంభించానని, ప్రజలకు అంకితం చేశానని, ఇప్పుడు పునాది రాళ్లు పడ్డ వాటిని తిరిగి తానే ప్రధానిగా వచ్చి ప్రారంభిస్తానని మోడీ చెప్పారు. రూ 2000 కోట్ల విలువైన లేహ్ – కార్గిల్ విద్యుత్ సరఫరా పనులకు తాను గతంలో శంకుస్థాపన చేశానని ఇప్పుడు దీనిని తానే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని విద్యుత్ సమస్యలను ఈ పంపిణీ వ్యవస్థతో తీర్చుకోవచ్చునని చెప్పారు. తమ పని సంస్కృతి విభిన్నంగా ఉంటుందని, ఇంతకు ముందటి అధికార పక్షాలకు తమకు పోలికే లేదని అన్నారు. దేశానికి కొందరు జాప్యం లోపం పని సంస్కృతిని వదిలిపెట్టి వెళ్లారని, వారిది లట్కానే ...భట్కానే పద్ధతి అని గత పాలకులపై ప్రధాని విరుచుకుపడ్డారు. ఇటువంటి వొంటి బద్ధకపు పద్ధతిని తాను వదలగొట్టేందుకు వచ్చానని చెప్పారు. ఏ పథకం అయినా చేపడితే అది నిర్ణీత కాలంలో పూర్తి కావల్సిందే, నాణ్యతా ప్రమాణాలతో ఉండాల్సిందే అన్నారు. లేహ్ ఇతర ప్రాంతాలకు పలు రకాలుగా వాతావరణ ఇక్కట్లు ఉన్నాయని, కేంద్ర ప్రభుత్వం ఇక్కడి వారికి వీటి నుంచి ఊరట కల్పించేందుకు కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఇప్పుడు తాము ఈ ప్రాంతంలో మొత్తం రూ 3000 కోట్ల విలువైన పథకాలకు శంకుస్థాపన చేసినట్లు, తిరిగి తాను వచ్చి ప్రధానిగా వీటిని ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. లేహ్‌ను అత్యుత్తమ విద్యా కేంద్రంగా మలిచి, ఇతర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడికి వచ్చేలా చేస్తామని చెప్పారు. ఇక్కడ మంచి వాతావరణాన్ని సానుకూలతను సృష్టించుకుని అందరినీ ఆకట్టుకోవాలనే కల తనకు ఉందని, దీనిని నిజం చేసుకుంటామని అన్నారు. ప్రధాని తమ పర్యటనలో భాగంగా లడఖ్‌లో సరికొత్త పర్యాటక కేంద్రాలను, పర్వతారోహక మార్గాలను ప్రారంభించారు. మారుమూల ప్రాంతాలకు కూడా రైల్వే, విమానయాన సౌకర్యాలను కల్పించేందుకు కేంద్రం కృషి చేస్తుందని తెలిపారు. బిలాస్‌పూర్ మండీ రైల్వే మార్గం కోసం సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. లేహ్ అత్యంత సమున్నతమైన ఆధ్యాత్మిక మజిలీ, ప్రకృతి రమణీయత నిండుకుని ఉంది. కళలు, సంస్కృతి, సాహస క్రీడలకు పెట్టింది పేరు అని మోడీ కితాబు ఇచ్చారు. లేహ్ ప్రాంతంలో 40 శాతం వరకూ యువజనులు ఉన్నారని, ఈ విద్యార్థుల అవసరాన్ని వారి డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు ఇక్కడి వర్శిటీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.



రూ 6000 అంటే అంత నామోషీనా..

పేద రైతులకు కేంద్రం ప్రకటించిన రూ 6000 సహాయ పథకం విలువ కొందరికి అర్థం కావడం లేదని ప్రధాని నరేంద్ర మోడీ విమర్శించారు. ఎసి రూంలలో దర్జాగా కూర్చునేవారికి ఆరువేల రూపాయలంటే ఏమిటనేది తెలియదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రైతాంగానికి రూ 6000ల ఆర్థిక సహాయ పథకం తీసుకువచ్చారు. దీనిపై ప్రతిపక్షాల విమర్శలను ప్రధాని తిప్పికొట్టారు. జమ్మూ కశ్మీర్‌లోని లేహ్‌లో పలు పథకాలకు శంకుస్థాపన కార్యక్రమాలకు వచ్చిన సందర్భంగా ప్రధాన మంత్రి ఆదివారం మాట్లాడారు. ఆరువేల రూపాయల ప్రాధాన్యత, దాని విలువ తెలిసే వారికే తెలుస్తుంది. ఢిల్లీలో ఎసి గదులలో కాలక్షేపం చేసే వారికి దీని గురించి ఎం తెలుస్తుంది? అని మోడీ నిలదీశారు. మారుమూల , క్లిష్టతర ప్రాంతాలలో నివసించే పేదు రైతులకు ప్రకటించిన సహాయ పథకాన్ని అపహాస్యం చేయడం అనుచితం అన్నారు. తాము ఇక్కడ శంకుస్థాపన చేస్తున్న పలు పథకాలతో లేహ్, లడఖ్ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇక్కడి ప్రాంత రైతులు కూడా తమ వివరాలను పొందుపర్చి ఏటా ఆరువేల రూపాయలను పొందవచ్చునని, రెండు హెక్టార్ల సాగుభూమి ఉన్న రైతులందరికీ ఇది వర్తిస్తుందని చెప్పారు. ఆరువేల రూపాయలను మూడు దఫాలుగా అందించడం జరుగుతుంది. రెండువేల రూపాయల సాయంతో ఆయా పంటకాలాలకు రైతాంగం సాగు అవసరాలను తీర్చుకోవచ్చునని ప్రధాని తెలిపారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా తొలి దఫా డబ్బులు అతి త్వరలో రైతులకు అందుతాయని, రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పుడే తగు మార్గదర్శకాలను పంపించడం జరుగుతోందని వివరించారు. రైతులకు ప్రయోజనం కల్గించే పథకం మైలురాయి వంటిదని ప్రధాని తెలిపారు. లేహ్ ప్రాంతంలో తొట్ట తొలి విశ్వవిద్యాలయాన్ని కూడా ప్రధాని ఆదివారం ప్రారంభించారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666